తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

6-10-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 245 పేజీలు: 10+4 వెల: 6.50


# శ్రద్ధాంజలి



## కీ.శే. శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి

(1951 – 05/10/2025)

ప్రేమకు ప్రతిరూపంగా.. ధైర్యానికి నిలువుటద్దంగా..
మా వెన్ను తట్టి నడిపించిన మీరు భౌతికంగా దూరమైనా..
మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచే వుంటారు.

భర్త
**పి. వీరా రెడ్డి**

సోదరుడు
**పి.పి. రెడ్డి - పి. రమ**

కుమారులు
**పి.వి. కృష్ణా రెడ్డి – పి. సుధారాణి**
**పి.వి. సుబ్బా రెడ్డి – పి. సుమలత**

కుమార్తె
**పి. ప్రసన్న కుమారి – పి. నాగి రెడ్డి**

## పెద్దకర్మ

2025 అక్టోబరు 15వ తేదీ
బుధవారం

**స్థలం:**
**హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్,**
**హైదరాబాద్.**

meil family



ఆదివారం కోక్రాఝర్‌లో బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ సభ్యుల ప్రమాణం దృశ్యం

# నిందితులపై కొరడా

>> చేస్తున్న 14 మందిని గుర్తించి 10 మందిని అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. అలాగే, ఫేక్ లేబుల్స్, వివిధ బ్రాండ్ల నకిలీ మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావు అనే వ్యక్తిని గుర్తించామని అతనికి విజయవాడలో ఒక బార్ లైసెన్సు ఉందని ముఖ్యమంత్రికి తెలిపారు. నకిలీ మద్యం దందాకు ములకలచెరువుకు వచ్చాడని తెలిపారు. ఇక్కడ తయారైన మద్యాన్ని పెద్దతిప్పసముద్రంలోని ఆంధ్రా వైన్స్, ములకలచెరువులోని రాక్ స్టార్ వైన్స్‌లో విక్రయించినట్లు తెలిపారు. ఈ నకిలీ మద్యం తయారీలో ఇతనే ప్రధాన నిందితుడని, తమిళనాడుకు చెందిన నలుగురు వ్యక్తులను, ఒడిశాకు చెందిన వారిని కూడా నియమించుకున్నాడని తెలిపారు. నకిలీ మద్యం సరఫరాకు ఓ డ్రైవర్‌ను కూడా నియమించుకున్నట్లు వివరించారు.
అద్దేపల్లి జనార్దన్ రావు సూచనల మేరకు నకిలీ మద్యం తయారీ చేస్తున్న అంశాన్ని మిగతా నిందితులు అంగీకరించారని సిఎంకు తెలియజేశారు. నకిలీ మద్యాన్ని విక్రయించిన రాక్ స్టార్ లైసెన్స్ టి రాజేష్ అనే వ్యక్తి పేరిట ఉందని, రాజేష్‌కు సంబంధించిన వాహనంలోనే నకిలీ మద్యం రవాణా చేస్తున్నట్టే తాము పట్టుకున్నట్లు తెలిపారు. రెండు వైన్ షాపులపైన సోదాలు నిర్వహించి, సీజ్ చేశామని తెలిపారు. ప్రధాన నిందితుడు జనార్దన్ రావు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని అధికారులు వివరించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని ఎక్సైజ్ అధికారులు సిఎంకు తెలిపారు. స్థానిక నాయకుడు జయచంద్రారెడ్డి పాత్రపై కూడా సమగ్ర విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఒక ప్రణాళికతో అద్దేపల్లి జనార్దన్ రావు ఏర్పాటు చేసిన ఈ లిక్కర్ తయారీ కేంద్రానికి కొందరు స్థానికుల సహకారం కూడా ఉన్నట్టు గుర్తించామని అధికారులు వివరించారు. ఏ1 జనార్దన్ రావు, ఏ2 కట్టారాజు, ఏ5 పి రాజేష్, ఏ12 కె శ్రీనివాసరావులను అరెస్టు చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. ఆర్థిక లావాదేవీలతో పాటు నకిలీ మద్యాన్ని ఎక్కడెక్కడకు సరఫరా చేశారన్న అంశాన్ని లోతుగా దర్యాప్తు చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిందితులు ఎంతటి వారైనా వదలొద్దని సిఎం స్పష్టం చేశారు.

# బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే

>> వచ్చే ఏడాది చివరి నాటికి హైవేను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రహదారిపై వాహనాలు గంటకు 120 కి.మీ. వేగంతో ప్రయాణించవచ్చు. బెంగళూరుచెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే కర్ణాటక పరిధిలో హుస్‌కోట నుంచి సుందరపాళ్య వరకు 91 కి.మీ. మేర నాలుగు వరుసల రహదారి ఇప్పటికే పూర్తి అయింది. ఈ విభాగంలో వాహన రాకపోకలు కూడా ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం సుందరపాళ్య నుంచి తమిళనాడు సరిహద్దు గుడిపాల వరకు పనులు చురుకుగా సాగుతున్నాయి. చిత్తూరు జిల్లా పరిధిలోని బైరెడ్డిపల్లె, చీలాపల్లె, బలిజపల్లె వద్ద లింకు రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. ఈ లింకు రోడ్లతో సమీప గ్రామాలు, పట్టణాలు ప్రధాన రహదారితో నేరుగా అనుసంధానం కానున్నాయి. ప్రస్తుతం హైవే నాలుగు వరుసలుగా నిర్మాణం జరుగుతున్నా, రాబోయే సంవత్సరాల్లో ట్రాఫిక్ పెరుగుదల దృష్ట్యా ఎనిమిది వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు మొత్తం దశలవారీగా అభివృద్ధి చెందుతోంది. ఇందులో చిత్తూరు జిల్లాలోని లింకు రహదారులను విస్తరించడమే కాకుండా, ఇంటర్‌చేంజ్‌లు, ఓవర్‌పాసులు, సర్వీస్ రోడ్లు కూడా నిర్మిస్తున్నారు. బెంగళూరు- చెన్నై హైస్పీడ్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే (ఎన్‌హెచ్7) కుప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా 2022లో శంకుస్థాపన చేసారు. నిర్మాణానికి అంచనా వ్యయం: రూ.17,980 కోట్లుగా గుర్తించారు.

# దివ్యక్షేత్రంగా శ్రీశైలం

>> చేయాలని సిఎం సూచించారు. దోర్నాల, సుండిపెంట, ఈగలపెంట తదితర ప్రాంతాల సమీపంలో ఉన్న జాతీయ రహదారులను దేవాలయానికి కనెక్ట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆధ్యాత్మికంగా పర్యాటక ప్రాంతంగా, పర్యావరణ పరంగా శ్రీశైలాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలని సిఎం పేర్కొన్నారు. దీనిపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందిస్తూ భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతున్న కారణంగా ఆలయ సమగ్ర అభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తున్న నేపథ్యంలో సౌకర్యాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న కురిమల లాంటి దేవాలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధ్యయనం చేసి శ్రీశైలాన్ని అభివృద్ధి చేద్దామని డిప్యూటీ సిఎం ప్రతిపాదించారు.

**రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయంగా శ్రీశైలం అభివృద్ధి**

రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలన్నీ అటవీ, గిరులపైనే ఉన్నాయని వారసత్వంగా వచ్చిన ఈ ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తిరుమల తర్వాత అతిపెద్ద ఆలయంగా శ్రీశైలం అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా భక్తులకు విస్తృతమైన సౌకర్యాలను కల్పించాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో సరైన పార్కింగ్ సదుపాయాలు కూడా లేవని అన్నారు. భూమి అందుబాటులో లేకపోతే పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలను కల్పించలేమని.. ఈ నేపథ్యంలో అధికారుల బృందం ఢిల్లీ వెళ్లి అటవీ మంత్రిత్వశాఖకు ఈ అంశాలను వివరించాలని సూచించారు. ఆయా ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఉన్న అటవీ ప్రాంతాలను కూడా రాష్ట్రప్రభుత్వం సంరక్షిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చదనం పెంపు, అటవీ ప్రాంతాల అభివృద్ధిపై ఇప్పటికే కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాన స్థాయిలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శ్రీశైలం పులుల ఆవాసాల్లో పులుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని దీనికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిఎం అటవీశాఖ అధికారులను ఆదేశించారు. శ్రీశైలం మహాక్షేత్రం అభివృద్ధికి నూతన ప్రతిపాదనలను దేవస్థానం అధికారులు సిద్ధం చేశారు. ఈ నెల 16వ తేదీన ప్రధాని మోదీ శ్రీశైలం దర్శనానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైల మల్లన్న ఆలయానికి దాదాపు రూ.1,657 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రధానిని కోరనున్నారు. కాశీ క్షేత్రంలో కాశీ విశ్వనాథ్ కారిడార్, ఉజ్జయిని మహాకాళ్ కారిడార్ తరహాలో శ్రీశైల క్షేత్ర కారిడార్‌ను అభివృద్ధి చేయడానికి నదరు నిధులు వినియోగించాలని దేవాదాయశాఖ, దేవస్థానం అధికారులు యోచిస్తున్నారు. ఆందుకుగాను రూ.90 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్, రూ.65 కోట్లతో గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు సాలుమండపాల నిర్మాణం, రూ.25 కోట్లతో కైలాస మానస సరోవరం ఏనుగుల చెరువు కట్ట అభివృద్ధి, రూ.25 కోట్లతో కైలాస కల్యాణం, రూ.13 కోట్లతో నూతన ప్రసాదాల తయారీ పోటు నిర్మాణం, రూ.10 కోట్లతో సామూహిక అభిషేక మండప నిర్మాణం, రూ.5 కోట్లతో దేవస్థానం వర్క్‌షాప్ నుంచి రుద్రపార్కు వరకు బ్రిడ్జి నిర్మాణం, రూ.95 కోట్లతో సిద్దరామప్ప కొలను అభివృద్ధి పనులు చేయాలని ఇఒ. ఎం. శ్రీనివాసరావు ఇప్పటికే దేవాదాయశాఖ అనుమతి కోరారు. శ్రీశైల దేవస్థానం నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు పరిధిలోనే ఉండడంతో అభివృద్ధి పనులను చేయాలంటే తరచూ అటవీశాఖ నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. దాంతో శ్రీశైల దేవస్థానం భూమి సమస్యను సైతం ప్రధాని దృష్టికి తీసుకెళ్లేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. అటవీశాఖ ఎటువంటి అభ్యంతరాలను లేవనెత్తకుండా 5,362 ఎకరాల భూమిని దేవస్థానానికి చెందే విధంగా సమస్య పరిష్కరించాలని ఈ సందర్భంగా విన్నవించనున్నారు. తెలంగాణ పరిధిలో ఆమ్రాబాద్ నుంచి బ్రహ్మగిరి(దోమలపెంట)వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని తెలంగాణ సర్కారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అదే విధంగా కర్నూలు, రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చేటటువంటి భక్తులు ఆత్మకూరు -దోర్నాల మధ్యనున్న ఇరుకైన రహదారి వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆత్మకూరుదోర్నాల మధ్య నల్లమల అడవులు ఉండడంతో జాతీయ రహదారి నిర్మాణం ఊసే లేకుండా పోయింది. అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉండడంతో ఘాట్ రోడ్డు విస్తరణ పనులు చేయడం సమస్యగా మారింది. తెలంగాణ ప్రాంతం తరహాలో ఇక్కడ కూడా ఎలివేటెట్ కారిడార్‌ను నిర్మిస్తే ప్రయాణాలకు అసౌకర్యాలన్నీ తొలగిపోతాయని ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులంతా అభిప్రాయపడుతున్నారు.

# ‘కల్తీ’ నెయ్యి కేసులో ఇక కీలక వ్యక్తుల విచారణ!
## మళ్లీ రంగంలోకి దిగిన సిబిఐ సిట్

**తిరుపతి,అక్టోబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి పాపానికి పాత్రధారులైన కారకులనుగుర్తించిన సిబిఐ సిట్ అధికారులు తాజాగా కీలక వ్యక్తులైన సూత్రధారులను గుర్తించనుంది. ఇందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలతో ఆదిశగా మళ్లీ సిట్ బృందం చర్యలకు సిద్ధమవుతోంది. శనివారం తిరుపతికి చేరుకున్న సిట్ అధికారులు టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాజీ పిఎకి మళ్లీ నోటీసులు జారీచేశారు. విచారణ పూర్తిస్థాయిలో ముందుకు కదలనుంది. చాలావరకు ఈ కల్తీ వ్యవహారంలో పెద్దలు బయటకు రానున్నారనేది ఇప్పుడుసంచలనంగా మారింది. గతంలోనే హైకోర్టుఇచ్చిన ఆదేశాలపై సిట్ సుప్రీంకోర్టుకెళ్లడం, ఆదిశగా విచారణ చేసిన ధర్మాసనం న్యాయమూర్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ కేసులో సమగ్రవిచారణ చేపట్టాలని ఆదేశించడంతో సిట్ అధికారులు మళ్ళీ రంగంలోకి దిగారు. ఇప్పటికే అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో లోతుగా దర్యాప్తుచేపట్టి నివేదికలు సిద్ధం చేశారు. లడ్డూల తయారీలో వినియోగిస్తున్న ఆవునెయ్యిలో పందికొవ్వు, గొడ్డుకొవ్వు నూనెలతోబాటు శాఖాహారపదార్థాలతో తయారుచేసిన నూనెలు కల్తీచేసి పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కుపంపాల్సిన టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాత్రపై నివేదికలు ఉన్నాయి. ఈ కేసులోమళ్ళీ దర్యాప్తు పున:ప్రారంభించడంతో క్లైమాక్స్‌లో పెద్దలు తప్పు చేసిన వారికి శిక్ష ఎవరికి పడనుందనేది త్వరలోనే తేలిపోనుంది.


పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాల కారణంగా డార్జిలింగ్ జిల్లాలో ఓ బ్రిడ్జి కూలిపోయిన దృశ్యం

# ఉత్సవ శోభాయాత్ర

>> స్కేటర్స్, పైడితల్లి అమ్మవారి కలశాలు, తప్పెటగుళ్లు, థింసా డాన్స్, పులి వేషాలు, విచిత్ర వేషాలు, ఆగమ పండితుల బృందం, విజయనగరం వైభవం, కేరళ వాయిద్యాలు, కర్ర సాము, అడుగుల బొమ్మలు, కొమ్ము కోయ డాన్స్, బిందెల డాన్స్, గరగల డాన్స్, చెక్క భజన, గంగిరెద్దులు, జముకుల బృందం, కాశీమాత డాన్స్, ఎన్‌సిసి కెడెట్స్ మార్చ్, కోలాటం, క్రీడా సంఘాలు మరియు క్రీడాకారులు, అంగన్వాడి సిబ్బంది, ఎన్‌ఆర్‌జిఎస్.., ఎస్‌హెచ్‌జి గ్రూప్స్ తదితర బృందాలు ర్యాలీలో అలరించాయి. ఈ సందర్భంగా విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఇటువంటి పండుగలు దోహదం చేస్తాయనున్నారు. నేటి తరానికి సంప్రదాయాలు, కళలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. జానపద కళలను, కళాకారులను ఆదుకునేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో అవసరమని అన్నారు. పైడితల్లి అమ్మవారు జిల్లా ప్రజలందరినీ చల్లగా చూడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, జెసి ఎస్. సేధు మాధవన్ తదితర ప్రముఖులు, కూటమి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో హోంమంత్రి అనిత దింసా నృత్యం:**

విజయనగరం జిల్లాలో పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన దింసా నృత్యంలో హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మహిళలతో కలిసి పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. కళాకారుల పులి వేషాలు, సాంప్రదాయ నృత్యాలు భక్తులను అలరించాయి. తరువాత విజయనగరం కోటలో హోంమంత్రి అనిత, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుని మర్యాదపూర్వకంగా కలిసి పైడితల్లి అమ్మవారి జాతర, విజయనగరం ఉత్సవాలపై చర్చించారు. కోట ప్రాంగణంలో విద్యార్థినులు నిర్వహించిన కోలాటంలో హోంమంత్రి, ఎమ్మెల్యే విద్యార్థినీల ఆహ్వానంతో పాల్గొని వారిని ప్రోత్సహించారు.

# రేపు నారావారిపల్లికి సిఎం చంద్రబాబు
## జిల్లా యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు

**తిరుపతి,అక్టోబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మంగళవారం ఉదయం తిరుపతిజిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గం స్వగ్రామమైన నారావారిపల్లికి వస్తున్నారు. ఆయన సోదరుడు దివంగత రామ్మూర్తినాయుడు సంవత్సరీకంలో పాల్గొని పలు కార్యక్రమల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి నారావారిపల్లికి రానుండటంతో జిల్లా యంత్రాంగం భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, సంయుక్త కలెక్టర్ శుభంబన్సల్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెలసుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, నాగభూషణరావ్, వెంకటరాముడు, డిఎస్పీలు వెంకటనారాయణ (ఎస్‌బి), రవిమనోహరచారి, శ్యామ్‌సుందర్, ప్రసాద్‌రావు,సిఐలుతో కలసి ఆదివారం మధ్యాహ్నం ఏర్పాట్లు పరిశీలించారు. ఒకరోజుసిఎం పర్యటనతో భద్రతను కట్టుదిట్టం చేశారు. పూర్తిగా ఆయన కుటుంబం కార్యక్రమం కావడంతో మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. భద్రత పరంగా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# కామెర్ల కలకలం

>> ఇప్పటికే రక్త పరీక్షలు నిర్వహించి 100 మందికి పైగా విద్యార్థులకు ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. ఇంకా పలువురికి రక్త పరీక్షల రిపోర్టులు రావాల్సి ఉంది. గురుకుల పాఠశాలలో కనీస వసతులు లేకపోవడం, వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో కలుషితమైన నీరు త్రాగడం వల్ల పచ్చకామెర్లు సోకినట్లు తెలుస్తోంది. పచ్చకామెర్లతో గత నెల 26న 9వ తరగతి చదువుతున్న కల్పన(14) తన ఇంటి వద్ద మృతి చెందింది. ఈ నెల 1న పదవ తరగతి విద్యార్థిని పువ్వల అంజలి(15) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి, ఆదివాసీ గిరిజన సంఘాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు అలాగే పాఠశాలను పరిశీలించి గురుకుల పాఠశాలలో కనీస సౌకర్యాలు లోపించాయని, కలుషిత నీరు త్రాగటం వలన విద్యార్థులకు వ్యాధి సోకి మృతి చెందారని అన్నారు. ఆదివాసి సంఘాలు విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా కలెక్టర్, వైద్యాధికారులు ఎటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. దీంతో విద్యార్థులందరికీ రక్త పరీక్షలు నిర్వహించి వెంటనే వాటి రిపోర్టులను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల్లో ఇప్పటికే 112 మందికి వ్యాధి సోకినట్లు ఇందులో 28 మంది పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మిగిలిన వారికి జిల్లా ఆసుపత్రి పార్వతీపురం, కురుపాం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం రాష్ట్రస్థాయి వరకు వ్యాపించడంతో గురుకులాల ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.గౌతమ్ శనివారం రాత్రి పాఠశాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని అలాగే రక్షిత మంచినీరు అందివ్వాలని ఆమె అధికారులకు ఆదేశించారు. ఇంతమంది విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ఇద్దరు విద్యార్థులు మృతి చెందినా గిరిజన మంత్రిగాని, ఎమ్మెల్యే గాని విద్యార్థులకు పరామర్శించలేదని, కనీసం పాఠశాలను సందర్శించి అక్కడ పరిస్థితులను చూసి చర్యలు తీసుకోలేదని సిపిఎం, సిపిఐ పార్టీల నాయకులు, ఆదివాసి సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మృతి చెందిన విద్యార్థినిలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఇద్దరు విద్యార్థినిల మృతి బాధాకరం: పవన్ కల్యాణ్**

కురుపాం గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిల మృతి బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. కురుపాం బాలికల గురుకులంలోని విద్యార్థినిలు అనారోగ్యానికి గురైన విషయం తెలిసి బాధపడినట్లు చెప్పారు. అక్కడ నెలకొన్న పరిస్థితిపై జిల్లా అధికారులు, వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. అక్కడి పిల్లలు పచ్చకామెర్లు సంబంధిత లక్షణాలతో అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఇద్దరు విద్యార్థినులు వేర్వేరు రోజుల్లో ఇంటి దగ్గర ఒకరు, మరొకరు ఆసుపత్రిలో మృతి చెందినట్లు పవన్ కల్యాణ్ వివరించారు. మృతి చెందిన విద్యార్థినిలు కుటుంబాలకు పవన్ కల్యాణ్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే.. విశాఖపట్నం కేజీహెచ్‌లో 37 మంది విద్యార్థినులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. అదనపు ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేసుకొని నిరంతరం వారి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. త్వరలో కురుపాం వెళ్ళి గురుకులంలో పరిస్థితిని పరిశీలిస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు.

# పర్యటనకు వెళ్తుండగా కాటేసిన మృత్యువు


ప్రమాదంలో మరణించిన రామ్‌సుధీర్, లావణ్య, గాయపడిన వారి కొడుకు ఉదయ్ అద్విక్ (ఫైల్)

>> మరణించగా వారి కొడుకు ఉదయ్ ఆద్విక్ తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడి చికిత్స పొందుతున్నాడు. తల్లిదండ్రులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారన్న విషయాన్ని కూడా అర్థం చేసుకోలేని అభం శుభం తెలియని ఆ పసివాడిని చూసి రక్త సంబంధీకులు, బంధువులు భగవంతుడా ఇంత చిన్న వయసులో ఎంత పెద్ద కష్టం ఇచ్చావు తండ్రి అంటూ విలపించడం అందరినీ కంటతడి పెట్టిస్తోంది.
విశాఖపట్టణానికి చెందిన రామ్ సుధీర్, లావణ్యలకు ఆరేళ్ల క్రితం వివాహంకాగా వారికి ఐదేళ్ల కొడుకు ఉదయ్ ఆద్విక్ ఉన్నాడు. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన రామ్ సుధీర్ పెనుకొండవద్దగల కియా కార్ల పరిశ్రమలో అసెంబుల్డ్ డిపార్టుమెంటులో గత మూడేళ్లుగా సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగరిత్యా అనంతపురంలోని టివి టవర్ ఎదురుగాగల శివసాయినగర్‌లో ఆ కుటుంబం నివాసముంటోంది. కియా కంపెనీలో రెగ్యులర్ ఉద్యోగి అయిన రామ్‌సుధీర్‌కు వీకెండ్స్ శని, ఆదివారాలు సెలవు కావడంతో భార్య లావణ్య, కొడుకు ఉదయ్ ఆద్విక్‌తో కలిసి ప్రముఖ చారిత్రక పర్యాటక ప్రాంతమైన కర్నాటకలోని హంపీకు కారులో బయలు దేరారు. అయితే వారు విడపనకల్లు శివార్లు పెట్రోల్ బంకువద్దకు చేరుకోగానే ఎదురుగా మృత్యువు రూపంలో వచ్చిన మరొక కారు ఢీకొట్టడంతో అప్పటిదాకా ఉన్న సంతోషం కాస్త విషాదంగా మారింది. ప్రమాదంలో ముగ్గురికీ తీవ్రగాయాలు కాగా ఉరవకొండ ఆసుపత్రికి తీసుకొచ్చిన కొద్దిసేపటికే లావణ్య మరణించగా అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి రామ్ సుధీర్ మరణించాడు. కాలు విరిగిపోయి బాలుడు ఉదయ్ ఆద్విక్ చికిత్స పొందుతున్నాడు.

**మిన్నంటిన రక్తసంబంధీకులు, బంధువుల రోధనలు:**

రోడ్డు ప్రమాదంలో మరణించిన లావణ్య మృతదేహానికి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో, రామ్ సుధీర్ మృతదేహానికి అనంతపురం ఆసుపత్రిలో ఆదివారం శవపరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి వచ్చిన లావణ్య తల్లిదండ్రులు సూర్యనారాయణ, కుమారి, సోదరుడు సుధాకర్, బంధువులు, అనంతపురం ఆసుపత్రిలో రామ్ సుధీర్ తల్లి విజయలక్ష్మి, (తండ్రి లేదు) ఇతర కుటుంబ సభ్యులు బోరున విలపించడం అందరినీ కలిచి వేసింది. ఎక్కడో విశాఖ పట్టణంలో పుట్టి పెరిగి ఉద్యోగ రిత్యా ఇక్కడికి వచ్చి మూడు పదుల వయసులోనే నిండు నూరేళ్లు నిండిపోయాయి అంటూ రోదించడం కంటతడి పెట్టిస్తోంది. ప్రత్యేక అంబులెన్స్‌లో ఇరువురి మృతదేహాలతోపాటు గాయపడిన చికిత్స పొందుతున్న పసివాడు ఉదయ్ ఆద్విక్‌ను విశాఖపట్టణం తరలించారు.

## వారం - వర్జ్యం

06-10-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
చతుర్దశి మ.12.24
పూర్వాభాద్ర ఉ.6.16, ఉత్తరాభాద్ర రా.4.01
వర్జ్యం : రా.3.42-6.36
దు.మ.12.20-1.08,
2) మ.2.43-3.31
రాహుకాలం - ఉ.7.30-9.00

## వారఫలం

**మేషం :** ఆర్థిక చిక్కుల నుండి తప్పుకోవడానికి గాను ఆర్థిక వనరులను అన్వేషిస్తారు.

**వృషభం:** స్త్రీల వలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. ఫలితాలు మాత్రం వెనువెంటనే రావు.

**మిథునం:**రాజకీయ పరపతి పెరుగుతుంది. కీళ్ళ బాధలు ఇబ్బంది పెడతాయి.

**కర్కాటకం:**శత్రు వర్గంలోని అనైక్యతను గుర్తించి వారితో ముఖాముఖీ పోరాడి లాభపడతారు.

**సింహం:**స్పెక్యులేషన్ నామ మాత్ర లాభాలను ఇస్తుంది. ధన లాభం.

**కన్య :** ఎవ్వరిని నమ్మకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగిన సూచన.

**తుల :** ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. వస్తు కోనుగోలు.

**వృశ్చికం:**కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆభరణాల కొనుగోలు.

**ధనుస్సు:** సంఘములోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మకరం:** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం తెలుసుకుంటారు.

**కుంభం:** షేర్లు, భూముల క్రయవిక్రయాలలో సొంత నిర్ణయాలు శ్రేయస్కరం.

**మీనం :** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. సోదరీసోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# విజయవాడ- హైదారాబాద్
## జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ



ఆదివారం విజయవాడ- హైదారాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ దృశ్యం

**విజయవాడ,అక్టోబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ- హైదారాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ నెలకొంది. దసరా సెలవులు ముగియడంతో హైదరాబాద్‌కు తిరిగివెళ్లే వాహనాలతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు బారులు తీరాయి. కీసర, గట్టుభీమవరం, చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా రద్దీ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతుండటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. విజయవాడ నగరంలోను పండుగ శెలవులకు వచ్చి వివిధ ప్రదేశాలకు తిరిగి వెళ్తున్న వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంది. బస్‌స్టేషన్ నుంచి ఫ్లైఓవరు చేరుకునే దారిలోను ట్రాఫిక్ అధికంగా ఉంది. గొల్లపూడి వన్ సెంటరులోను ఇదే పరిస్థితి.

# ఎపి కేడర్ ఐఎఎస్ అధికారి రాఘవేంద్ర మీనా బదలీ
## ఎజిఎంయూటి కేడర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు

**విజయవాడ,అక్టోబరు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి రాఘవేంద్ర మీనాను అరుణాచల్‌ప్రదేశ్-గోవా-మిజోరాం-కేంద్రపాలిత ప్రాంతాలు(ఎజిఎంయూటీ)కేడర్‌కు బదిలీ చేస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏజీఎంయూటీ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారిని సులేఖా జగర్వార్‌ను వివాహం చేసుకున్నారు. మీనా విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అనుమతితో బదిలీ చేసినట్లు సిబ్బంది వ్యవహారాల శాఖ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

# నకిలీ మద్యం దందా నడుపుతున్న టిడిపి

>> వ్యూహం ప్రకారం రద్దు చేసి, ఆ స్థానంలో టిడిపి నేతల సిండికేట్లకు అప్పగించారని ఆరోపించారు. “మద్యం దుకాణాలు, బెల్టు షాపులు, అక్రమ పర్మిట్ రూమ్‌లు అన్నీ టిడిపి నేతలవే. వారే నకిలీ మద్యం తయారు చేసి, వారి దుకాణాల ద్వారా అమ్మి, అక్రమ సంపాదనను పంచుకుంటున్నారు” అని జగన్ విమర్శించారు. మద్యం అమ్మకాలపై కాగ్ నివేదికలను ప్రస్తావిస్తూ జగన్ గణాంకాలను వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం అమ్మకాల ద్వారా రూ. 6,782.21 కోట్ల ఎక్సైజ్ ఆదాయం రాగా, 2025- 26లో టిడిపి ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా అమ్మకాలు పెంచినా కేవలం రూ. 6,992.77 కోట్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇది కేవలం 3.10 శాతం పెరుగుదల మాత్రమేనని, సహజంగా రావాల్సిన 10 శాతం వృద్ధి కూడా లేకపోవడం వెనుక భారీ దోపిడీ దాగి ఉందని ఆరోపించారు. ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయమంతా సిండికేట్ల రూపంలో టిడిపి నేతల జేబుల్లోకి వెళుతోందని ఆయన పేర్కొన్నారు. ములకలచెరువు ఘటనలో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని జగన్ ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న జిల్లా స్థాయి టిడిపి ఇన్‌ఛార్జిని కాపాడేందుకు, విదేశాల్లో ఉన్న వ్యక్తిపై నెపం నెట్టి కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతోనే రాత్రికి రాత్రే కేసును మార్చేశారని, ఈ దందాకు ప్రభుత్వ పూర్తి సహకారం ఉందని ఆరోపించారు. సొంత ఆదాయం కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం న్యాయమేనా అని జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

6-10-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 245 పేజీలు: 10+4 వెల: 6.50

రేపు నారావారిపల్లికి సిఎం చంద్రబాబు

'కల్తీ' నెయ్యి కేసులో ఇక కీలక వ్యక్తుల విచారణ! 2లో


ఆదివారం కురుపాం గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

## గురుకులంలో కామెర్ల కలకలం

### వారం రోజుల్లో ఇద్దరు విద్యార్థులు మృతి

### 112 మందికి ఆసుపత్రిలో చికిత్స

### కలుషిత నీరే కారణం: ప్రిన్సిపల్ సెక్రటరీ

**కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా), అక్టోబర్ 5 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో గల గురుకుల పాఠశాలలో వందల సంఖ్యలో విద్యార్థులకు పచ్చకామెర్లు సోకటంతో జిల్లాలో కలకలం రేగింది. ఇప్పటికే వారం రోజులు వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, విశాఖ, పార్వతీపురం, కురుపాం ఆసుపత్రులలో వందల సంఖ్యలో చికిత్స పొందడంతో తమ పిల్లలకు ఏం అవుతుందోనన్న భయంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కురుపాం మండలం శివన్నపేటలోగల గురుకుల పాఠశాలలో సుమారు 612 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో >>2

# దివ్యక్షేత్రంగా శ్రీశైలం


ఆదివారం శ్రీశైలం దేవాలయ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

### మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధికి చర్యలు

### తిరుమల తరహాలో భక్తులకు సౌకర్యాలు

### 2వేల హెక్టార్ల అటవీభూమి కేటాయించాలని కేంద్రానికి విన్నపం: సిఎం చంద్రబాబు

### సమీక్షలో సూచనలు చేసి డి.సిఎం పవన్

**విజయవాడ అక్టోబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆలయాల అభివృద్ధి వలన ఆయా ప్రదేశాలు, పర్యాటకరంగంలోను అద్భుతరీతిలో వృద్ధి సాధించవచ్చునని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అటవీప్రాంతాల సంరక్షణ విషయంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానాన్ని సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌తో దివ్య క్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఏటా లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే ప్రణాళికలపై దేవాదాయ, అటవీశాఖ అధికారులకు మార్గదర్శనం చేసారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం దేవాలయ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో వర్చువల్‌గానే డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో సిఎం చంద్రబాబు మాట్లాడారు. సిఎంతో పాటు సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయ శాఖ, అటవీ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. జ్యోతిర్లింగం, శక్తి పీఠం రెండూ కలిగిన దివ్య క్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీశైలం ఆలయ సమగ్రాభివృద్ధిపై సిఎం చర్చించారు.
తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వేర్వేరు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ క్షేత్రానికి వస్తున్న నేపథ్యంలో రద్దీకి తగ్గట్టు వారికి సౌకర్యాలు కల్పించాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం 2 వేల హెక్టార్ల అటవీ భూమిని దేవాదాయశాఖకు కేటాయించేలా కేంద్రఅటవీ మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. అలాగే ఈ నెల 16 తేదీన ప్రధాని మోడీ శ్రీశైల మల్లిఖార్జున స్వామిని దర్శించు కొనేందుకు శ్రీశైలం రానున్న దృష్ట్యా ఆయనతో ఆలయ అభివృద్ధిపై చర్చించాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను సైతం అనుసంధానించేలా ప్రణాళికలు >>2



## పశువులకు హాస్టళ్లు

### ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,అక్టోబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వినూత్న ఆలోచనలతో, స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతోంది. ఇక ఎపిలో ప్రజల కోసం మాత్రమే కాకుండా, పశువుల సంరక్షణ కోసం కూడా ఎపి ప్రభుత్వం తాజాగా కొత్త ఆలోచన చేసింది. పశువుల కోసం ప్రత్యేక హాస్టల్స్ నిర్మించేందుకు ఎపి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. రాష్ట్రంలోని 157 నియోజకవర్గాలలో పశువుల హాస్టల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చంద్రబాబు పేర్కొన్నారు.
పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. పశువుల కోసం సామూహిక షెడ్ల నిర్మాణం పైన దృష్టి సారించాలని పేర్కొన్న చంద్రబాబు ఈ షెడ్ల నిర్వహణ పశుపోషణ బాధ్యతలను డ్వాక్రా మహిళలతో నిర్వహించనున్నారు. పట్టణాలలో రోడ్లమీద తిరుగుతూ రోడ్ల మీద ఉండే పశువులకు ఆశ్రయం కల్పించి, వాటికి మేతను, ఇతర సదుపాయాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ హాస్టల్స్ నిర్వహణ బాధ్యతలను డ్వాక్రా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.
ఇటీవల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు ఈ విషయాన్ని నేరుగా వెల్లడించారు. పశువుల సంఖ్యను పెంచడం, పాల ఉత్పత్తిని వృద్ధి చేయడం, పశువులకు వచ్చే వ్యాధులను తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. పశువుల షెడ్ల ఏర్పాటుతోపాటు, పాల ఉత్పత్తి యూనిట్లు, పాల చిల్లింగ్ యూనిట్లు, దాణా బ్యాంకులు, పశువుల పేడతో బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కూడా ఆయన సూచించారు.

# నకిలీ మద్యం నిందితులపై కొరడా


ఆదివారం నకిలీ మద్యం వ్యవహారంపై సమీక్షిస్తున్న చంద్రబాబు

### నిష్పాక్షిక దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు ఆదేశం

### ఎక్సైజ్ తనిఖీల్లో కొందరు నకిలీ మద్యం బాటిళ్లతో పట్టుబడ్డారన్న మంత్రులు

### ఎ-1గా గుర్తించిన జనార్దన్‌కు విజయవాడలో బార్ లైసెన్స్ ఉంది

### నలుగురిని అరెస్టు చేసే అవకాశం

**విజయవాడ, అక్టోబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ప్రజల ప్రాణాలకు చేటు చేసే నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశించారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువులో నకిలీ మద్యం వ్యవహారంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టంచేశారు. ఈ వ్యవహారంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. నకిలీ మద్యం వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌తో ఆదివారం సాయంత్రంతరువాత క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇందులో భాగంగా ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు తెలిపారు. ములకలచెరువులో జరిపిన ఎక్సైజ్ శాఖ తనిఖీల్లో ముందుగా కొందరు వ్యక్తులు నకిలీ మద్యం బాటిళ్లతో పట్టుబడ్డారన్నారు. వారిని విచారించి సేకరించిన సమాచారం అధారంగా ములకల చెరువు గ్రామంలో సోదాలు నిర్వహించామని అధికారులు సిఎంకు వివరించారు. ములకలచెరువు సమీపంలోని కదిరినత్తునికోట గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రం బయటపడిందని అధికారులు సిఎంకు తెలియ జేశారు. నకిలీ మద్యం తయారు >>2



## చిత్తూరు మీదుగా బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే

### గంటన్నరలోనే చిత్తూరు నుంచి బెంగళూరుకు ప్రయాణం

**విజయవాడ,అక్టోబరు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** దక్షిణ భారతదేశంలోని మూడు ప్రధాన రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడును అనుసంధానం చేస్తూ నిర్మాణం జరుగుతున్న బెంగళూరుచెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే దాదాపు తుది దశకు వచ్చింది. అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న. ఈ హైవే అందుబాటులోకి వస్తే చిత్తూరు జిల్లావాసులు గంటన్నరలోనే బెంగళూరు లేదా చెన్నై చేరుకునే వీలుంటుంది. వి.కోట ప్రాంతం నుంచి అయితే కేవలం గంటలోనే బెంగళూరు చేరుకోవడం సాధ్యమవుతుంది. గరిష్ఠ వేగం గంటకు 120 కి.మీగా నిర్ధారించిన ఈ రహదారి, రాష్ట్రాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధికి దోహదమవుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 65 కి.మీ. మేర ఈ హైవే చిత్తూరు జిల్లా మీదుగా వెళ్తుంది. ఈ మార్గం పూర్తయితే చిత్తూరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాలకు పరిశ్రమలు, రవాణా రంగాల్లో పెద్ద అవకాశాలు లభించనున్నాయి. రహదారి నిర్మాణం పూర్తయ్యాక బెంగళూరు నుంచి చెన్నై మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం 6 గంటల నుంచి 1.5 గంటలకు తగ్గనుంది. ఇది దక్షిణ భారత వాణిజ్యానికి కీలకంగా మారనుందనే అంచనాలు ఉన్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే, బెంగళూరుచెన్నై మధ్య ప్రయాణ సమయం 75 తగ్గుతుంది. చిత్తూరు జిల్లాలో పరిశ్రమల స్థాపన వేగవంతమవుతుంది. రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. బెంగళూరు, చెన్నైకి వాణిజ్యం సులభం అవుతుంది. పర్యాటకం, పెట్టుబడులు పెరగడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఉత్సాహం లభిస్తుంది. ప్రత్యేకించి చిత్తూరు జిల్లా కేంద్రంగా దక్షిణ భారత పరిశ్రమలకు కొత్తకారిడార్‌గా ఎదగనుందనే అంచనాలు ఉన్నాయి. ప్రాజెక్టు అధికారులు >>2


ఆదివారం పైడితల్లి అమ్మవారి ర్యాలీలో పాల్గొన్న మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్

## ఘనంగా విజయనగర ఉత్సవ శోభాయాత్ర

### కనువిందు చేసిన జానపద కళలు

### జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, అక్టోబరు 5 ప్రభాతవార్త:** జానపద కళలతో కనువిందు చేస్తూ, కళా రూపాలతో మైమరిపింపజేస్తూ, విచిత్ర వేషధారణలతో ఆకట్టుకుంటూ విజయనగర ఉత్సవ శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది. విజయనగర ఉత్సవాల ప్రారంభానికి సంకేతంగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఉదయం మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కోట వద్ద ప్రముఖులు ఆశీనులై కళా రూపాలను తిలకించారు. ఈ ర్యాలీలో స్వాగత శకటం, రోలర్ >>2



## నకిలీ మద్యం దందా నడుపుతున్న టిడిపి

### -మాజీ సిఎం జగన్ ఆరోపణ

**విజయవాడ, అక్టోబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో అధికార టిడిపి నేతృత్వంలో వ్యవస్థీకృతంగా నకిలీమద్యం దందా జరుగుతోందని వైపాస్సార్సీ అధ్యక్షుడు, మాజీ సిఎం జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మద్యం సిండికేట్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని, ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు.
అన్నమయ్య జిల్లా ములకలచెరువులో టిడిపి నేతలు నిర్వహిస్తున్న కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీ పట్టుబడటమే రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలకు నిదర్శనమని జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను ఒక >>2

# రాజధానిలో 6 లేన్ల కారిడార్

### అమరావతి నుంచి జాతీయ రహదారికి కనెక్టివిటీ

**విజయవాడ,అక్టోబరు5.ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతిలో నిర్మించిన సీడ్ యాక్సెస్ రోడ్డు (ఇ3)ని జాతీయ రహదారి వరకూ విస్తరించేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎడిసిఎల్) కొత్త ప్రణాళికను రూపొందిస్తోంది. దొండపాడు నుంచి వెంకటపాలెం వరకూ నిర్మించిన ఈ రహదారిని అక్కడ నుండి మణిపాల్ వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిలో కలపనున్నారు. 45వ ప్యాకేజీలో భాగంగా రెండోదశలో సీతానగరం నుండి మణిపాల్ ఆస్పత్రి వరకూ సుమారు రూ.613.30 కోట్లతో దీనిలో 6 లైన్ల ఎలివేటెడ్ కారిడార్లు, బ్రిడ్జలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. 2024 చివర్లో ప్రభుత్వం ఈ అంచనాలు రూపొందించింది. అయితే ప్రాజెక్టులో స్వల్ప మార్పులతో గతంలో ఉన్న అంచనాలు సవరించేందుకు ప్రభుత్వం జిఓ ఆర్‌టి 1089 విడుదల చేసింది. ఎపిసిఆర్‌డిఎ అదనపు కమిషనర్ ఛైర్మన్‌గానూ, ఎడిసిఎల్ చీఫ్ ఇంజినీరు మెంబర్ కన్వీనర్‌గానూ వ్యవహరించే ఈ కమిటీలో ఆర్‌అండ్‌బి, పబ్లిక్‌హెల్త్, ఎపిసిఆర్‌డిఎ ఇఎన్‌సిలు, గుంటూరు ఆర్‌డిఒ సభ్యులుగా ఉంటారు. రెండోదశలో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ పనులకు గతంలో నిర్ణయించిన ధరలు సరిపోవని వాటిని సవరించాలని నిర్ణయించి వెంటనే కమిటీ కూడా ఏర్పాటు చేశారు. ఈ రోడ్డును సీతానగరం నుండి ఎన్‌టిఆర్ కట్ట వరకూ ఆధునిక పద్ధతుల్లో వైర్ బ్రిడ్జి, ఎలివేటెడ్ కారిడార్ రూపంలోనూ, మణిపాల్ ఆస్పత్రి వద్ద జాతీయ రహదారికి అండర్‌పాస్ నిర్మించి జాతీయ రహదారిలో ఇంటర్‌ఛేంజ్ పద్ధతిలో నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. ఈ ప్లానులో స్వల్ప మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

## పర్యటనకు వెళ్తుండగా కాటేసిన మృత్యువు

### కారు ప్రమాదంలో మరణించిన దంపతులు

### కాలు విరిగి అనాథగా మిగిలిన ఐదేళ్ల బిడ్డ

### విడపనకల్లు వద్ద దుర్ఘటన

**ఉరవకొండ, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదం అందమైన కుటుంబాన్ని చిదిమేసింది. వీకెండ్ కావడంతో భార్యాభర్తలు తమ ఐదేళ్ల కొడుకుతో కలిసి చారిత్రాత్మక పర్యాటక ప్రాంతమైన కర్నాటకలోని హంపీకు వెళుతుండగా విడపనకల్లువద్ద అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు రూపంలో మృత్యువు వారిని కబలించింది. ప్రమాదంలో భార్యాభర్తలు రామ్ సుధీర్, లావణ్య >>2

వార్త

ఎవరైనా కోపం తెచ్చుకోగలరు. కాని సరైన వ్యక్తిపై సరైన స్థాయిలో, సరైన సమయంలో, సరైన విధానంలో కోపగించుకోవడం మాత్రం అందరికీ సాధ్యం కాదు.

-అరిస్టాటిల్

# అర్హులకు అందలాలు అందేనా?

ప్రజాస్వామ్య పాలనలో మానవీయ కోణం ఎంతో అవసరం.ఆ నేపథ్యంలోనే పేద బడుగు బలహీన వర్గాలకు ఉచిత పథకాలు అమలవుతుంటాయి. అవన్నీ నిజమైన అర్హులకు అందితే ఎవరికీ ఏఅభ్యంతరం కలుగదు. ప్రధానంగా బిపిఎల్ వర్గాలకు అందితే స్వాగతించదగినదే. కానీ ప్రస్తుత పాలనల్లో భిన్న విధానాలు అనుసరించడం ఎన్నికలొచ్చినప్పుడు మాత్రమే కొన్ని ఉచిత పథకాలను ప్రకటించడం అసలు సిసలు పథకాలను సక్రమ అమలును పట్టించుకోకపోవడం వల్లనే ప్రభుత్వాలు విమర్శకు గురవుతున్నాయి. నాలుగు దశాబ్దాలుగా జరుగుతున్న ఎన్నికల ముందు తతంగాలలో మందిని తమకు అనుకూలంగా మార్చుకోవడం ప్రస్తుత రాజకీయ మంత్రాంగం మారింది. ఆనక అమలులోనూ చిత్తశుద్ధి కొరవడుతుందన్నది. ప్రజలను పరాన్నజీవులుగా తయారు చేయొద్దని ఉచితల పంపిణీపై ఈ దేశ అత్యున్నత ధర్మాసనం ఏనాడో అభిప్రాయపడింది. మరికొన్ని సందర్భాలలో ఉచితాలు అనుభవించడానికి అలవాటుపడి జనం తమ సొంత జీవనోపాధులపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారనే అనుభవాలను కూడా చూసాము. అయినా ఉచితాల విషయంలో ఏ రాజకీయ పార్టీ నిష్ఠగా ఉండలేకపోతోంది. ఇప్పుడు 2 నెలల్లో బీహారు ఎన్నికలు రాబోతున్నాయి. బీహార్ ఎన్నికల ప్రభ ఏ మాత్రం తగ్గిపోకుండా వివిధ రాజకీయ పార్టీలు టక్కు టమార గోకర్ణ విద్యలు ప్రవేశించడానికి ఏనాడో అంకురార్పణ చేశాయి. దేశంలో పేదలు అణగారిన వర్గాల కోసం ప్రభుత్వ పథకాలకు కొరత లేదు, కానీ వాటి కింద ఆశించిన ప్రయోజనాలు ఉద్దేశించిన లబ్ధిదారులకు అరుదుగా చేరుతాయనే అపప్రథ ఉండనే ఉంది. వాటి అమలును పటిష్ట పరచాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అది మాని ఎన్నికల సమయంలో కొత్తగా రాజకీయ సంకల్పం చెప్పుకోవడం జరుగుతోంది. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజున ఓటర్లకు డబ్బు పంపిణీ ఎలా జరుగుతుందో తెలియనిది కాదు. వచ్చే ఏడాది తమిళనాడుకు కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలు అనగానే బీహారు మాత్రమే గుర్తొచ్చే విన్యాసాలను ఇప్పటికే ఎన్నో చూసాం. ఎన్నికల కమిషన్ నిర్ణయాలు వివిధ రాజకీయ పార్టీలతో వ్యవహరిస్తున్న తీరును విపక్షాలు తప్పు పట్టే స్థాయికి చేరింది. అక్కడ ఓటర్ల సవరణ కార్యక్రమంలో అనుమానాస్పద అంశాలన్నీ విమర్శలకు గురవుతున్నాయి. వీటికి తోడు ఎన్నికల కమిషన్ అక్కడి విధానాలను ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించడంతో బీహారుప్రయోగాన్ని రాజకీయ పార్టీలెవరూ మరచిపోలేకపోతున్నారు. బీహారులోమళ్లీ అధికారం హస్తగతం చేసుకోవాలని ఆశిస్తున్న ప్రధాన పార్టీకి ఎన్నికల కమిషన్ ద్వారా ఏదో అనుచిత లబ్ధికలుగబోతోందన్న సందేహం ప్రజా బహుళ్యంలోకి బాగా వెళ్లిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ప్రస్తుత పాలనను బేరీజు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.అంతేగాక తాజాగా ప్రస్తుతప్రభుత్వాధినేత నితీష్‌కుమార్ తన నేతృత్వంలోని కూటమిప్రభుత్వం తరపున ప్రజా సంక్షేమ పథకాలు ప్రకటించారు.ప్రస్తుతం బీహార్లో ప్రభుత్వ ఉచితాల వర్షంకురుస్తోంది.గత పదేళ్లుగా అక్కడ అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి అకస్మాత్తుగా ప్రజలపై ప్రేమపుట్టుకొచ్చింది.బీహార్లో అనతి కాలం పనిచేసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది నితీష్ కుమార్. గత 20సంవత్సరాలుగా 278రోజుల స్వల్పకాలిక పాలనతో రాష్ట్రంలో అధికారంలోఉన్నారు. అకస్మాత్తుగా దూరదృష్టిగల నాయకుడిగా మారారు. దాదాపు అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికసహాయ పథకాలను ప్రకటించారు. ఏ వర్గాన్ని వదిలిపెట్టలేదు. చూస్తుంటే మొన్నటి మహారాష్ట్ర ఎన్నికలలో లడ్కీ బెహన్ యోజన పథకం ఇచ్చిన ఫలితాలనే ఇస్తాయనే నమ్మకం కలిగినా ఆశ్చర్యపడనక్కర్లేదు. వాటిలో గత నెల ఆగస్టు 1నుంచి నెలకు 125 యూనిట్ల వరకు ఉచితవిద్యుత్,ఎస్సీ,ఎస్టీ వర్గాలలో పనిచేసే 10,000మందికి పైగా 'వికాస్ మిత్ర'లకు ఒక్కొక్కరికి రూ 25 వేలు, టాబ్లెట్ల కొనుగోలు కోసం ప్రజలకు రూ10వేలు,30వేల మందికి పైగా విద్యావేత్తలకు రూ.10 వేలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలలో పనిచేస్తున్నారు.సీనియర్ సిటిజన్లకు పెన్షన్‌పెంచారు. రెండేళ్లపాటు నెలకు వెయ్యి రూపాయల మేరకు నిరుద్యోగభృతిని అందించబోతున్నారు.ముఖ్యమంత్రి మహిళా రోజ్గార్ యోజన కింద 75లక్షలమంది మహిళా వ్యవస్థాపకులకు ఒక్కొక్కరికి రూ.10వేలు అందిస్తుంది. దీని మొదటి విడత తరువాత 2లక్షలకు పెంచుతారు. వృద్ధులకు,వికలాంగులకు భరోసా ప్యాకేజీలు పెంచారు. కొన్ని వర్గాలకు భత్యాలు పెంచారు.టీచర్ల నియామకం జరుగుతోందని ముఖ్యమంత్రి ప్రకటించారు. అంగన్‌వాడి సేవికల జీతం 7 వేల నుంచి 9వేలకు పెంపు, కూడా ఇందులో భాగమే.దానికి ప్రతిగా ప్రతిపక్ష ఆర్‌జెడి పార్టీ నెలకు 200 విద్యుత్ యూనిట్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు, మహిళలకు ఆర్థిక సహాయం నేరుగా 2500 ఇస్తామన్నారు. ఇలా ఎన్నికల సమయంలో ఒకరికి పోటీగా మరొకరు ఉచితాలు ప్రకటించడం పరోక్షం గా ప్రలోభ పెట్టడమే. దేశంలో స్వేచ్ఛగా న్యాయంగా ఎన్నికలను నిర్ధారించడానికి స్వర్గం భూమిని కదిలించే ఎన్నికల సంఘం వేరేవిధంగా చూడటానికి ప్రతి కారణం ఉంది. ఎందుకంటే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాతే మోడల్ ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చే ముందు ఇలా పరీక్ష ఓట్ల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న ఈఉచిత ప్రచారాన్ని అంతం చేయక పోతే, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రచారంపై ఉన్న అంచనాలు అగాధం లోకి పడిపోతాయి. ఇలాంటి వాటిని నిరోధించేందుకు అనుచితంగా ప్రకటించేందుకు ఎన్నికల సంఘం కూడా యోచించాలి.



ఒకే రకం కూడా నువ్వు కార్యాచరణకు పూనుకోకుండా లక్షల సార్లు ఆలోచించడం వల్ల ప్రయోజనం ఉండదు.

గురునానక్



ప్రపంచంలో అన్నింటికన్నా కష్టమైన విషయం ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకోవడమే.

అలివర్ గోల్డ్‌స్మిత్

# మన ఆర్థిక వ్యవస్థపై అమెరికా షట్‌డౌన్ ప్రభావం?

**కొత్త హెచ్1బి వీసా పిటిషన్‌ను దాఖలు చేయడానికి లేదా ఉద్యోగాన్ని మార్చడానికి, ముందుగా లేబర్ కండిషన్ అప్లికేషన్ను డీఓఎల్ ధృవీకరించాలి. ఓఎఫ్ఎల్‌సీ పనిచేయక పోవడంతో కొత్త ఎల్సీ లు దాఖలు చేయడానికి వీలులేకుండా పోయింది. దీని అర్థం హెచ్1బి వ్యవస్థ నుండి అత్యధికంగా లబ్ధిపొందుతున్న నైపుణ్యం గల భారతీయ నిపుణులు వేలాది మంది అనిశ్చితిలో చిక్కుకున్నారు. వారి ఉద్యోగ మార్పిడులు, కొత్త నియామకాలు నిరవధికంగా ఆగిపోయాయి. అదేవిధంగా, శాశ్వత నివాసానికి అవసరం అయిన గ్రీన్ కార్డ్ దరఖాస్తుల ప్రక్రియ కూడా స్తంభించింది. ఈ ప్రక్రియకు కూడా డీఓఎల్ నుండి ధృవీకరణలు లేదా ప్రస్తు త వేతనాల నిర్ధారణలు అవసరం. ఇది ప్రవాస భారతీయులకు ఇప్పటికే కఠినంగా ఉన్న నిరీక్షణ సమయాన్ని మరింత పెంచుతోంది. షట్‌డౌన్ ఎక్కువ కాలం కొనసాగితే అమెరి కన్ కంపెనీలు ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన దేశ ఐటీ సేవల ఎగుమతులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి పెరిగి, భారత స్టాక్‌మార్కెట్లు నష్టపోవడం, రూపాయి విలువ తగ్గడం వంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావచ్చు.**

డి జయరాం

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తి అయిన అమెరికాలో ఒక వింత సమస్య తరచుగా తలెత్తుతుంది. అదే ప్రభుత్వ కార్యకలాపాల నిలుపుదల లేదా షట్‌డౌన్. ఇది కేవలం తాత్కాలిక పాలనాపరమైన ఇబ్బంది కాదు. రాజకీయ నాయకులు దేశ బడ్జెట్ విషయంలో ఒక నిర్ణయానికి రాలేకపోతే, దేశ కార్యకలాపాలే ఆగిపోయే ప్రమాదకరమైన సంక్షోభం ఇది. అమెరికాలో ప్రభుత్వ కార్యకలాపాలు సజావుగా సాగాలంటే అక్కడి పార్లమెంటు అయిన కాంగ్రెస్‌ఖర్చు పెట్టడానికి చట్టపరమైన అనుమతి ఇవ్వాలి. ఈ విధానం యాంటీడెఫిషియెన్సీ చట్టం (ఎడిఎ) అనే పాత చట్టంలో ఉంది. ఫెడరల్ ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు అందించేందుకు పార్లమెంట్ తప్పనిసరిగా ప్రతి సంవత్సరం ఒక బడ్జెట్‌ను లేదా తాత్కాలిక ఖర్చు బిల్లును ఆమోదించాలి. ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి కాంగ్రెస్ ఈ నిధుల బిల్లులను ఆమోదించడంలో విఫలమైతే, ప్రభుత్వంలో అత్యవసరం కాని విభాగాల సేవలు తాత్కాలికంగా మూసివేయబడతాయి. దీనినే ప్రభుత్వ షట్‌డౌన్ అంటారు. గత దశాబ్దాలలో ఈ పరిస్థితి తరచుగా సంభవించడం పెరిగింది. ఇది ఒక సాధారణ ప్రక్రియ లోపం కాస్తా, అపారమైననష్టం కలిగించే శక్తివంతమైన రాజకీయ అస్త్రంగా మారింది. కొన్ని నిధులను ఆమోదించి, మరికొన్నింటిని ఆమోదించకపోతే అది పాక్షిక షట్‌డౌన్ అవుతుంది. ఇది అధ్యక్షుడు ఇష్టపూర్వకంగా తీసుకునే నిర్ణయం కాదు. బడ్జెట్ కేటాయింపుల్లో కాంగ్రెస్ విఫలమైనప్పుడు చట్టంప్రకారం స్వయం చాలకంగా జరిగే ప్రక్రియ ఇది. అందుకే, ఈ వైఫల్యానికి కారణం, పరిష్కారం రెండూ కాంగ్రెస్ చేతుల్లోనే ఉంటాయి. నిజానికి, ఈ చట్టాన్ని డబ్బు వృథా కాకుండా ఉండాలనే ఉద్దేశంతో తెచ్చారు. కానీ ఇప్పుడు, రాజకీయ పార్టీలు తమ విధానపరమైన డిమాండ్లను నెరవేర్చుకోవడానికి బడ్జెట్ ఆమోదాన్ని అడ్డుకోవడం ద్వారా దీనిని ఒక రాజకీయఒత్తిడి సాధనంగా ఉపయోగిస్తున్నాయి. అంటే, డబ్బును నియంత్రించే చట్టం, ప్రభుత్వ కార్యకలాపాలను ఆపేసే సాధనంగా మారిందన్నమాట. షట్‌డౌన్‌కు అసలు అధికారం అమెరికా రాజ్యాంగంలోని ప్రాథమిక నిర్మాణంలో ఉంది. యుఎస్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 1, సెక్షన్ 9, క్లాజ్ 7 ప్రకారం, 'చట్టం ద్వారా చేసిన కేటాయింపుల పర్యవసానంగా తప్ప, ఖజానా నుండి డబ్బు తీయరాదు.' ప్రభుత్వ ఖజానాపై అంతిమ అధికారం పూర్తిగా కాంగ్రెస్‌కే చెందుతుంది. దీని అర్థం, ప్రభుత్వ కార్యకలాపాలు సాగడానికి కాంగ్రెస్ డబ్బును ఆమోదించాలి. ఒకవేళ ఆమోదించకపోతే, చట్టబద్ధంగా కార్యకలాపాలు ఆగిపోతాయి. కాంగ్రెస్ నిధులను ఆమోదించడంలో విఫలమైతే, చట్టాన్ని గౌరవించి, ఖర్చును ఆపడం తప్పనిసరి. అందుకే, షట్‌డౌన్ అనేది బడ్జెట్ ఆమోదం విఫలమైనప్పుడు ఆటోమేటిక్‌గా సంభవించే ఒక పరిణామం. ఈ షట్‌డౌన్‌కు ప్రధాన కారణం పార్టీల మధ్య ఉన్న తీవ్రమైన విభేదాలు. ఈ సంక్షోభం కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది తీవ్రమైన రాజకీయ విభేదాల ఫలితం. ఉదాహరణకు, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒకవైపు, డెమొక్రాట్‌పార్టీ మరోవైపు మొండి పట్టుదలకుపోవడం ఈ సంక్షోభానికి దారితీస్తుంది. సాధారణంగా, ఆరోగ్య సంరక్షణ నిధులు అంటే మెడికేయిడ్ కోతలు, వలస విధానాలు వంటి కీలక అంశాలపై రాజకీయ డిమాండ్లను నిధుల బిల్లుకు జతచేయాలని డెమొక్రాట్లు ప్రయత్నించడంవల్ల ప్రతిష్టంభన ఏర్పడుతుంది. డెమొక్రాట్‌లు ఆరోగ్య సంరక్షణ పథకాలకు నిధులు కొనసాగించాలని పట్టుబడుతుంటే, అధ్యక్షుడుట్రంప్ దీన్ని తన రాజకీయ ఆయుధంగా వాడుకుంటారు. డెమొ




క్రాట్ల పాలనలోని రాష్ట్రాలకు కేటాయించిన అభివృద్ధి నిధులను నిలిపివేయడం, అలాగే ప్రభుత్వ ఉద్యోగులలో తనకు వ్యతిరేకంగా ఉన్నవారిని తొలగిస్తానని బహిరంగంగా బెదరించడం వంటి చర్యలు అమెరికా రాజకీయాల స్థాయిని దిగజార్చాయి. 1980 తరువాత పాత ఎడిఎ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం మొదలుపెట్టాక షట్‌డౌన్‌లు తప్పనిసరి అయ్యాయి. ఈ విధంగా, బడ్జెట్ కేటాయింపుల్లో కాంగ్రెస్ వైఫల్యం చెందితే, ఆ పరిణామాలకు కారణం, పరిష్కారం రెండూ కాంగ్రెస్ చేతుల్లోనే ఉంటాయి. 1976వ సంవత్సరం నుండి అమెరికా 20 సార్లకు పైగా నిధుల కొరతను ఎదుర్కొంది. ఈ సమస్య ఇప్పుడు మరింత తరచుగా, ఎక్కువ రోజులు కొనసాగుతోంది. ఇది రాజకీయ నాయకులు పార్టీ ప్రయోజనాలను దేశ పాలన కంటే ముఖ్యమని భావిస్తున్నారనడానికి నిదర్శనం. చారిత్రక ఉదాహరణలను పరిశీలిస్తే, 1996లో బిల్ క్లింటన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 21 రోజులు ఈ షట్‌డౌన్ కొనసాగింది. 2013లో బరాక్ ఒబామా ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ఆరోగ్య సంరక్షణ చట్టాన్ని రద్దుచేయాలనే డిమాండ్‌పై 16 రోజుల పాటు షట్‌డౌన్ జరిగింది. ఇక, 2018-19లో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సరిహద్దు గోడ నిర్మాణానికి నిధులు ఇవ్వాలనే డిమాండ్‌తో రికార్డు స్థాయిలో 35 రోజులు షట్‌డౌన్ జరిగింది. షట్‌డౌన్ జరిగినా, ప్రాణాలు, ఆస్తులను కాపాడే జాతీయ భద్రత, పోలీసు సేవలు వంటివి కొనసాగుతాయి. సామాజిక భద్రత వంటి తప్పనిసరి కార్యక్రమాల నిధులు కూడా ఆగవు. అయితే, ఈ విభాగంలో పనిచేసే ఉద్యోగులు జీతం లేకుండా పనిచేయాలి. ఫెడరల్ పార్కులు, శాస్త్రీయ పరిశోధన, కొన్ని ప్రభుత్వ అనుమతులు ఇచ్చే కార్యాలయాలు మూసివేయబడతాయి. దాదాపు 7.5 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు జీతాలు లేకుండా బలవంతంగా సెలవులో ఉండాల్సివస్తుంది. రోజుకు సుమారు 400 మిలియన్ల డాలర్ల జీతం నష్టం జరుగుతుంది. జీతం తిరిగి వచ్చినప్పటికీ, ఈ మధ్యలో వచ్చే ఆర్థిక కష్టాలు, ఇంటి అద్దెలు కట్టలేని పరిస్థితి ఇబ్బంది పెడుతుంది. కాంట్రాక్టు ఉద్యోగులకు పోయిన జీతం తిరిగిరాదు.అమెరికా ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబట్టి, ఇక్కడి ఆర్థిక అనిశ్చితి వల్ల ప్రపంచ స్టాక్ మార్కెట్లు, విదేశీ మారక మార్కెట్లు, వస్తువుల మార్కెట్లలో అస్థిరత పెరుగుతుంది. అమెరికా ప్రభుత్వం తన బడ్జెట్‌ను నిర్వహించలేకపోవడం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.ఇది ప్రపంచ పెట్టుబడుల ప్రవాహాన్ని తగ్గిస్తుంది. అంతేకాక, ద్రవ్యోల్బణంవంటి కీలక ఆర్థికసమాచారాన్ని సేకరించే సంస్థలు ఆగిపోతాయి. ఈ సమాచారం లేకపోవడం వల్ల, ప్రపంచ బ్యాంకులతోసహా అంతర్జాతీయ సంస్థలు, ఫెడరల్ రిజర్వ్ వంటివి సరైన నిర్ణయాలు తీసుకోలేవు. షట్‌డౌన్ ఎక్కువ కాలం కొనసాగితే, అమెరికా వృద్ధి మందగించడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. తరచుగా షట్‌డౌన్‌లు రావడం వల్ల, అమెరికా ఒక స్థిరమైన, నమ్మదగిన దేశం అనే పేరును కోల్పోతుంది. అంతర్జాతీయ సహాయకార్యక్రమాలు, వీసాప్రక్రియలు వంటివి ఆగిపోవడంవల్ల విదేశీ సంబంధాలు దెబ్బతింటాయి. అత్యంత తక్షణ, బాధాకరమైన ప్రభావం హెచ్1బి వీసా, గ్రీన్ కార్డ్ ప్రక్రియల్లో ఏర్పడిన అంతరాయం. నిధుల కొరత కారణంగా యుఎస్ కార్మిక శాఖలోని ఫారిన్ లేబర్ సర్టిఫికేషన్ కార్యాలయం అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తుంది. కొత్త హెచ్1బి వీసా పిటిషన్‌ను దాఖలు చేయడానికి లేదా ఉద్యోగాన్ని మార్చడానికి, ముందుగా లేబర్ కండిషన్ అప్లికేషన్ను డీఓఎల్ ధృవీకరించాలి. ఓఎఫ్ఎల్‌సీ పనిచేయక పోవడంతో కొత్త ఎల్సీలు దాఖలు చేయడానికి వీలులేకుండా పోయింది. దీని అర్థం హెచ్1బి వ్యవస్థ నుండి అత్యధికంగా లబ్ధి పొందుతున్న నైపుణ్యం గల భారతీయ నిపుణులు వేలాది మంది అనిశ్చితిలో చిక్కుకున్నారు. వారి ఉద్యోగ మార్పిడులు, కొత్త నియామకాలు నిరవధికంగా ఆగిపోయాయి. అదేవిధంగా, శాశ్వత నివాసానికి అవసరం అయిన గ్రీన్ కార్డ్ దరఖాస్తుల ప్రక్రియ కూడా స్తంభించింది. ఈ ప్రక్రియకు కూడా డీఓఎల్ నుండి ధృవీకరణలు లేదా ప్రస్తుత వేతనాల నిర్ధారణలు అవసరం. ఇది ప్రవాస భారతీయులకు ఇప్పటికే కఠినంగా ఉన్న నిరీక్షణ సమయాన్ని మరింత పెంచుతోంది. షట్‌డౌన్ ఎక్కువ కాలం కొనసాగితే అమెరికన్ కంపెనీలు ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన దేశ ఐటీ సేవల ఎగుమతులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి పెరిగి, భారత స్టాక్ మార్కెట్లు నష్టపోవడం, రూపాయి విలువ తగ్గడం వంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావచ్చు. ●

# లైంగిక ఉన్మాదానికి కొరడా చట్టాలవసరం

మహమ్మద్ ఆరిఫ్

సొంత పెదనాన్న లైంగిక వేధింపులు భరించలేక ఇటీవల ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. హైదరాబాద్‌లో జరిగిన ఈ ఘటన పరిచయస్తులు, దగ్గరి బంధువుల నుంచి కూడా మహిళలకు రక్షణ లేదనే విషయాన్ని మరోసారి రుజువు చేసింది. బయటి వారి కంటే పరిచయస్తులు, బంధువుల నుంచే బాలికలకు ఎక్కువగా ముప్పు పొంచి ఉన్నట్టు ఈ ఘటన నిరూపిస్తున్నది. పాఠశాలలు,కాలేజీలు, ఆఫీసుల్లోనే కాదు సొంత ఇండ్లలో సైతం బాలికలు, మహిళలు లైంగిక వేధింపులకు గురవుతుండడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. లైంగిక వేధింపులపై నమోదవుతున్న కేసుల్లో 80 శాతానికి పైగా కేసులు ఇలాంటివే ఉండడం సమాజంలో పేరుకుపోయిన మానసిక రుగ్మతను తెలియజేస్తున్నది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదికల ప్రకారం భారతదేశంలో లైంగిక వేధింపుల కేసుల్లో చాలా వరకు నిందితులు బాధితులకు తెలిసినవారే అయి ఉంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రతిఏడాది లైంగిక వేధింపులకు సంబంధించి సుమారు 30వేల కేసులు నమోదవుతుంటే ఇందులో 80శాతానికి పైగా కేసుల్లో పరిచయస్తులు, బంధువులే నిందితులుగా ఉండడం గమనార్హం. బాలికలపై జరిగే లైంగిక వేధింపుల్లోనైతే 90 శాతానికి కంటే ఎక్కువ మంది నిందితులు వారికి తెలిసిన, నమ్మకమున్న వ్యక్తులే. అందులోనూ 30-40 శాతం మంది కుటుంబ సభ్యులే (తండ్రులు, సోదరులు, మామలు, పెదనాన్నలు, కజిన్స్) ఉంటున్నారు. ఈ గణాంకాలు బాలికలకు ఆప్తుల నుంచి పొంచి ఉన్న ప్రమాద తీవ్రతను తెలియజేస్తున్నాయి.లైంగిక వేధింపుల నుంచి పిల్లలను రక్షించడానికి తల్లిదండ్రులుఅనేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమున్నది. ముందుగా గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌గురించి వారికి నేర్పించాలి.ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే భయం లేకుండా తల్లిదండ్రుల వద్ద చెప్పుకునే స్వేచ్ఛావాతావరణం కల్పించాలి. అపరిచితులతోమాట్లాడడం, వారి నుంచి బహుమతులు తీసుకునే విషయాలపై వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలి. సోషల్ మీడియా, ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు, ఆన్‌లైన్ వేధింపుల గురించి తెలియజేయాలి. లైంగిక వేధింపుల నివారణకు ప్రభుత్వాలు నిర్భయ వంటి అనేక కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయి. బాలికలపై లైంగిక వేధింపులు జరగకుండా.. పోక్సో వంటి చట్టాలున్నాయి. అయితే గత కొన్ని సంవత్సరాల డేటా చూస్తే మాత్రం కేసుల నమోదులో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. 2020లో 28,046 లైంగిక వేధింపుల కేసులు నమోదైతే, 2021లో ఇది 31,677 కేసులకు పెరిగింది. 2022లో 31,982 కేసులు నమోదయ్యాయి. 2023తో పోల్చుకుంటే 2024లో కేసుల్లో 4.8 శాతం పెరుగుదల కనిపించింది.2025 జనవరి డేటా ఇంకా విడుదల కాకపోయినా ఇప్పటికే 25 వేలకు పైగా కేసులు నమోదైనట్టు ఒక అంచనా. తెలంగాణలోనూ 2023లో 817 లైంగిక వేధింపుల కేసులు నమోదు కాగా, 2024, 2025 ల్లోనూ ఈ కేసుల్లో పెరుగుదల కనిపించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఇదేస్థాయిలో లైంగిక వేధింపుల ఘటనలు వెలుగుచూడడం లేదనే చర్చ జరుగుతున్నది. వేధింపులకు గురైన బాధితురాలినే తప్పుపట్టే ధోరణిలో సమాజం వ్యవహరిస్తుండడంతో పరువుపోతుందనే భయంతో చాలా మంది ఫిర్యాదు చేయడానికే వెనుకాడుతున్నారు. ముఖ్యంగా దగ్గరి బంధువులే వేధింపులకు పాల్పడినప్పుడు కుటుంబ పరువుపోతుందని, బంధుత్వాలు చెడిపోతాయనే భయంతో చాలా మంది ఫిర్యాదు చేయకుండా మోనం వహిస్తున్నారు. కేసుల విచారణలో జాప్యం,నేర నిరూపణ తక్కువ స్థాయిలో ఉండడంతో చట్టాలపట్ల నేరస్తుల్లోనూ భయం కనిపించడంలేదు.2024లో లైంగిక దాడుల్లో కేసుల్లో కన్విక్షన్ రేటు 28శాతం మాత్రమే. ఎక్కువ కేసులు పెండింగులో ఉన్నాయి. మరోవైపు పోర్న్ వీడియోలు ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా అందుబాటులో ఉండడం కూడా లైంగిక వేధింపుల ఘటనలు పెరగడానికి పరోక్షంగా దోహదపడుతున్నాయని అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.లైంగిక వేధింపులను కేవలం చట్టపరమైన సమస్యగా మాత్రమేచూడొద్దు. ఇది సమాజంలో పాతుకుపోయిన ఒక మానసిక రుగ్మత. ఈ కేసులను నివారించాలంటే ఒకవైపు కఠినచట్టాలను అమలు చేస్తూనే బాధితులకు సకాలంలో న్యాయంజరిగేలా చూడాలి. ●

# యాచకులకు ఏవీ ప్రత్యామ్నాయ పథకాలు?

మేకిరి దామోదర్

భాగ్యవంతులకు నిత్యం పండుగలే.దేశం రాష్ట్రంఎంతో అభివృద్ధి చెందిందని పాలకులు చెప్పుకుంటున్న ఈ సమాజంలో పండుగలకు నోచుకోక, పూట గడవడమే దినగండంగా, భిక్షాటన చేస్తూ పేదరికంలో జీవితం గడుపుతున్న వారి స్థితిగతులను పరిశీలిద్దాం. దారిద్రంలో మగ్గుతు జీవితపు చరమాంకంలో కన్నవారి ఆదరణ లేని వృద్ధులు, విధి వంచితులైన చిన్నారులు, ఉపాధి లేక కడుపు నింపుకోవడానికి మరికొంతమంది భిక్షాటనను ఎంచుకుంటున్నారు. పట్టెడన్నం కోసం యాచకులు హైదరాబాద్ మహానగరంతో పాటు పెద్దపెద్ద పట్టణాల్లో ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ చలికివణుకుతున్నారు.బస్సు షెల్టర్లు, ప్రధాన కూడళ్లు, మెట్రోస్టేషన్లు,ఫ్లై ఓవర్ బేస్ మెట్లు, పార్కులు, ఫుట్‌పాతులే ఆవాసాలుగా వారు దుర్భర జీవనం సాగిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తూ దినదిన గండంగా బతుకు వెల్లదీస్తున్నారు. వారిని ఆదుకోవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయని విమర్శలున్నాయి. వీరుపడరాని పాట్లు పడుతున్నారు. లక్ష జనాభా దాటిన పట్టణాల్లో నిరాశ్రయ కేంద్రాలు ఏర్పాటుచేసి వసతిసౌకర్యం కల్పించాలని 2007లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఆయా చోట్ల నిరాశ్రయులను గుర్తించి వారి సంఖ్యకు అనుగుణంగా షెల్టర్ జోన్లు ఏర్పాటు చేయాలి.గతంలో 60 నిరాశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతానికి 11 కేంద్రాలున్నాయి. మరికొన్ని చోట్ల స్వచ్ఛంద సంస్థలు నిర్వహణ బాధ్యతలు అప్పగించిన లక్ష్యం నెరవేరలేదు. ఓ స్వచ్ఛంద సంస్థ అంచనా ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే సుమారు 5వేల మందికి పైగా ఎలాంటి ఆధారాలు లేనివారు, గూడు లేకుండా నివసిస్తున్నారు. రాజధాని ప్రస్తుతానికి పురుషులకు 8, స్త్రీలకు 3 షెల్టర్ జోన్లు ఉన్నాయి. వీటిలో 380 మంది వరకు నివాసం ఉంటున్నారు. మిగతావారు ఉండేందుకు నీడ లేకపోయిందని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వందకుపైగా నిరాశ్రయ కేంద్రం అవసరమని స్వచ్ఛంద సంస్థలఅంచనా!. అలాగే 5000 మందికి పైగా భిక్షాటనే వృత్తిగా జీవిస్తున్నారు. దీనితో నగరంలోని కూడల్లు, ప్రధాన వీధుల్లో రద్దీ సమయాల్లో యాచకులతో నిండిపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని గత ప్రభుత్వం అనాధాశ్రయాలను ఏర్పాటు చేసి పునరావాసం కల్పించింది. కొన్నాళ్లకు ఆ కార్యాచరణ అటుకెక్కింది. 2023 అధికారం



చేపట్టిన ప్రభుత్వం తిరిగి వీరందరికీ పునరావాసం కల్పించి, నగరాన్ని బెగ్గర్స్ ఫ్రీ సిటీగా మార్చాలని జిహెచ్ఎంసిలోని అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (యుసిడి)విభాగానికి బాధ్యతలు అప్పగించింది. రెండు నెలల క్రితం హడావుడి చేసిన యుసిడి నగరంలో 102 మంది బిచ్చగాళ్లను వివిధ షెల్టర్ హోమ్లకు తరలించింది. ఆ తర్వాత దీనిపై పెద్దగా దృష్టి సారించడంలేదు. దానితో వారంతా తిరిగి రోడ్లపై కనిపిస్తున్నారు. ఇండియాను బెగ్గర్స్ ఫ్రీగా చేయాలనే లక్ష్యంతో కేంద్రం 'స్మైల్' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ఉద్దేశం బిచ్చగాళ్లను గుర్తించి వారికి వైద్యరక్షణ, కౌన్సిలింగ్,విద్య,నైపుణ్యం అభివృద్ధి, ఉపాధి కల్పించాల్సి ఉంది. ఇలా చేసి బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చేబాధ్యతలు (జిహెచ్ఎంసి) తీసుకుంది. ఇదిలా ఉంటే బెగ్గింగ్ మైగ్రేషన్ అనే పదం కొత్తగా వినిపిస్తున్నాయి. హైదరాబాద్ నగరం ఈ తాకిడి గురవుతుంది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక,ఏపీతోపాటు ఉత్తరాది నుంచి హైదరాబాద్ నగరానికి ఇటీవల బిచ్చగాళ్ల వలసలు భారీగా పెరిగిపోతున్నాయి. సామాజికవేత్తలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా బెగ్గింగ్ వలసలకు భయపడుతుంది. పేదరికం, వృద్ధాప్యం, ఉపాధి లభించకపోవడం భిక్షాటనకు ప్రధాన కారణం అయినప్పటికీ సామాజిక శాస్త్ర అధ్యయనాల ప్రకారం బద్ధకం, శ్రమ పట్ల విరక్తివంటి మానసిక కారణాలతో పాటు తేలిగ్గా డబ్బు సంపాదించాలని ఉద్దేశంతో కూడా కొంతమంది వ్యక్తులు దీన్నివృత్తిగా ఎంచుకుంటున్నారు. మరి కొంతమంది అమానవీయంగా ముఠాగా ఏర్పడి చిన్నారులను,వృద్ధులను, అనాధలతో బలవంతభిక్షాటన చేయిస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రతి నగరం, పట్టణంలో ఎంతమంది బిచ్చగాళ్లు, నిరాశ్రయులున్నారని గుర్తించడం, వారికి గుర్తింపు కార్డు, ఆధార్‌వంటి సౌకర్యాలు కల్పించడం. వారికి ఎవరూ లేకపోతే షెల్టర్‌జోన్లు ఏర్పాటుకు ఆశ్రయం,ఉపాధి కల్పించడం. కుటుంబ సభ్యులు,బంధువులు ఉంటే వారికి అప్పగించడం వంటి చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న నిరాశ్రయ కేంద్రాలకు షెల్టర్ మేనేజ్మెంట్ కమిటీ, కార్యనిర్వాహకకమిటీ ఉండాలి. షెల్టర్ మేనేజ్మెంట్ కమిటీలో స్థానిక కౌన్సిలర్ లేదా కార్పొరేటర్, షెల్టర్ మేనేజర్, నిరాశ్రయుల నుంచి ముగ్గురికి చోటుకల్పించాలి. కావలసిన భోజన వసతి షెల్టర్లో ఫ్యాన్లు, టీవీ,మంచినీటి సదుపాయం,మరుగు దొడ్లు వంటి వాటిపై దృష్టిపెట్టాలి. కార్యనిర్వాహక కమిటీలో పురపాలికమిషనర్, స్థానిక పోలీస్, ట్రాఫిక్,మెప్మా అధికారులు ఉండాలి. వీరంతా ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై ఆ ప్రాంతాల్లోని నిరాశ్రయుల పరిస్థితులు,భిక్షాటన చేసేవారి అనాధలను పరిస్థితులువారికి సౌకర్యాలు అందుతున్న తీరును చర్చించాలి. అయితే ఈ నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవీయ కోణంలో పాలన అందించాలి. ●

# ప్రజావాక్కు



### పెరుగుతున్న నేరాలను అరికట్టాలి

జాతీయ నేరగణాంకాల నివేదికను 2023 సంవత్సరానికి గానూ భారత ప్రభుత్వం విడుదల చేసింది. ఆ అధికారిక గణాంకాలు వివిధ నేరాల పెరుగుదలను సూచిస్తోంది.అందులోముఖ్యంగా గిరిజనులపైజరిగిన నేరాల్లో, అంతకు ముందు ఏడాది కన్నా,28 శాతం పెరుగుదల కనబడడం తీవ్రఆందోళనకరం.మణిపూర్ మొదటి స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రెండో స్థానం పొందిన ఈ తరహా నేరాలు మిగతా రాష్ట్రాల్లో కూడా గణనీయంగానే నమోదైనాయి.పిల్లలపట్ల జరిగినవాటిలో తొమ్మిది శాతం పెరుగుదల, మహిళలపట్ల కూడా పెరుగుదలనే చూపిస్తున్నాయి. సైబర్ నేరాలైతే మరింత దూకుడుగా ఉన్నాయి. సాధారణంగా జరిగిన నేరాలన్నీ నమోదు కావు. పోలీసు స్టేషన్ దృష్టికి రానివి,నమోదు కానివి అధికంగానే ఉంటాయి. అధికారిక లెక్కలు పరిస్థితిని పైపైన చూపిస్తాయి. అసలు సమస్య ఇంకా తీవ్రంగానే ఉంటుంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### కాలమే సమాధానం చెప్పాలి

బీహార్ ఎన్నికల ముందట వలసలు సర్ ఒక ప్రధాన అంశంగా నిలుస్తున్నాయి.గంగానది ఒడ్డున ఉన్న సారవంతం అయిన నేలలు కలిగి, బుద్ధుని చారిత్రక ఆనవాళ్లు కలిగిన రాష్ట్రం, ప్రణాళికలు సరిగాలేకపోవడం, ప్రభుత్వ పాలసీలు రూపకల్పన సరిగాలేకపోవడం మూలంగా వలసలు ఇబ్బడి ముబ్బడిగా సాగుతున్నాయి.అధికారమే పరమావధిగా నితీష్ కుప్పిగంతులు వేయడం లాలూ దాణా కేస్‌లోఉండడం అచ్చేదిన్ పేరిట బిజెపి అవకాశవాద రాజకీయాలు చేయడం మూలంగా బీహార్ ప్రజలు వలసల బాట ఎంచుకున్నారు. దాదాపు 77 లక్షల మంది ప్రజలు వలసలబాట పట్టారు.

- భారత అవినాష్, జనగామ

### వికలాంగులకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని వికలాంగులకు సంబంధించిన ఇండ్ల స్థలాలు కబ్జాలుచేస్తున్నారు.అందులో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు.పోలీస్‌స్టేషన్‌లో రెవిన్యూ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినాకూడా పట్టించుకోవడం లేదు. వికలాంగులకు వారి కుటుంబాలకు న్యాయం చేయాలి.2016వికలాంగుల చట్టం ప్రకారం వికలాంగుల ఇళ్లస్థలాలు అక్రమించినవారిపై కఠినచర్యలు తీసుకోవాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### ప్రజల సహకారంతోనే మార్పు సాధ్యం

సెప్టెంబర్ 26న ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం జరుపుకున్నసందర్భంగా ఒక నిజం మనకుస్పష్టమవుతోంది. పర్యావరణం అంటే మనందరి ప్రాణాధారం. అది కేవలం ప్రకృతితో సంబంధం ఉన్న విషయంకాదు,మన ఆరోగ్యం, మన భవిష్యత్తు అంతా దానిపైనే ఆధారపడి ఉన్నాయి. కాలుష్య గాలి, మలిన జలాలు, నాశనమవుతున్న భూమి ఇవన్నీ ప్రకృతిని మాత్రమే కాదు, మనసమాజాన్నీ నిశ్శబ్దంగా దెబ్బతీస్తున్నాయి. అనారోగ్యాలు పెరుగుతున్నాయి. జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి.మార్గరెట్ మీడ్ చెప్పినట్లుగా పర్యావరణం నాశనం అయితే, సమాజం నిలబడదు అనే మాటలు నేటి పరిస్థితులకు పూర్తిగా సరిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ వంతుబాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వాలు విధానాలు తీసుకువస్తాయి, కానీ నిజమైన మార్పు ప్రజల సహకారంతోనే సాధ్యం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పెరుగుతున్న పబ్లిక్ న్యూసెన్స్‌లు

మన పురాణకాలంలో చెడుపై మంచి సాధించిన విజయంగా ప్రజలంతా భావించి దీపాలను వెలిగించి ఆనందంగా దీపావళి పండుగ చేసుకోవటం, అప్పటి నుండి ప్రతిసంవత్సరం పిల్లలు పెద్దలు దీపావళి రోజు టపాసులు కాలుస్తూ పండుగ జరుపుకోవటం ఆనవాయితీగా మారిందని పెద్దలు చెబుతారు. ఐతే ఈ రోజుల్లోఆ దీపావళి టపాసుల వినియోగం నానాటికి పెరిగిపోతూ ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా ముప్పుగా తయారైంది. ఊరేగింపులకూ,శుభకార్యాలకు,అశుభ కార్యాలకు సైతం సాంప్రదాయక వాయిద్యాల స్థానంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భారీశబ్దాలతో టపాసులు, బాంబులు పేలుస్తుంటే వాటి వలన వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా గుండె జబ్బులున్న వారికి ప్రమాదకరంగా మారుతున్నాయి.

- టి. సాంబశివరావు, గుంటూరు

### సీట్ల కొరత

భారత దేశంలో డిమాండ్ ఉన్న కోర్సులు చదువుకునేందుకు సీట్లకొరత అలాగే చదివిన చదువులకు ఉద్యోగాల కొరత ఉంది.ఎంబీబీఎస్, ఇంజనీరింగ్,ఎంబీఏ, తదితర ఉన్నత చదువులు విదేశాల్లో చదవలసిన పరిస్థితి ఉంది. డిమాండ్ ఉన్న కోర్సుల సీట్‌లను భారత్‌లో పెంచితే విదేశాలకు వెళ్లే అవకాశం ఉండదు. అలాగే ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పించాలి. దానిని వెంటనే అమలులో పెట్టాలి.

-డి చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# శ్రీవారి భక్తులపై జిఎస్‌టి భారం తగ్గింపు!

## మారనున్న గదుల అద్దె సుంకం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కేంద్రప్రభుత్వం తీసుకున్న జిఎస్‌టి స్లాబ్స్ తగ్గింపు అమలులోకి రావడంతో దాని ప్రభావం ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం వసతి కల్పన విభాగంలో కూడా భక్తులపై అద్దెలు సుంకం భారం తగ్గనుంది. ఇప్పటికే అద్దె గదుల విషయంలో తడిసిమోపెడవుతున్న భారం భక్తులపై పడకుండా తగ్గించాలని టిటిడి నిర్ణయం తీసుకుంది. దీనివల్ల భక్తులకు కేటాయిస్తున్న గదుల అద్దె సుంకం తగ్గనుంది. ఈ విషయాన్ని ఇప్పటికే టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ గత శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ వెల్లడించారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనంకోసం దేశవిదేశాల నుండి తిరుమలకు రోజువారీగా లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. కొండపై ఉన్న పరిస్థితుల్లో 30వేలమందినుండి 40వేలమంది వరకు భక్తులకు మాత్రమో వసతి సౌకర్యం కల్పించే అవకాశం ఉంది. ఇంకా చాలావరకు కాటేజీలు, విశ్రాంతి గృహాలు ఆధు నీకరణ, పునఃనిర్మాణం పనులు సాగుతున్నాయి. ఇప్పటి పరిస్థితుల్లో తిరుమలలో 7,300 వరకు గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో పద్మా వతి విచారణ




కార్యాలయం పరిధిలో ప్రము ఖులు, ముఖ్యులు బసచేసే విధంగా 750గ దులు, ముఖ్యులతోబాటు సామాన్యభక్తులు బసచేసే కాటేజీ,విశ్రాంతి గదులు ఎంబిసి పరిధిలో 683గదులు, సిఆర్ఓ, టిబి కౌంటర్‌ల పరిధిలో ఆరువేల వరకు గదులు ఉన్నాయి. సిఆర్ఓ, ఎంబిసి విచారణ కార్యాలయాల పరిధిలో 50 రూపాయల అద్దె గదుల నుండి వెయ్యిరూపాయలు, 1,800రూపాయల వరకు అద్దె గదులు కేటాయింపు జరుగుతుంది. వీటన్నిటిపై గత మూడేళ్ళుగా భక్తులకు ఐదుశాతం జిఎస్‌టి భారం చెల్లించాల్సి వచ్చింది. తాజాగా కేంద్రం జిఎస్‌టి కొన్ని రకాల వస్తువులు, ప్రజలు వినియోగించుకునే పలు రకాల వాటిపై తగ్గించడంతో ఆ ప్రభావం తిరుమల, తిరుపతిలో టిటిడి వసతి గృహాల గదుల అద్దెలపై చూపుతుంది.

గదుల కోసం వసూలు చేస్తున్న అద్దెలపైన జిఎస్‌టిని తగ్గిస్తున్నట్లు ఇఒ సింఘాల్ కీలక ప్రకటన చేయడంతో సామా న్యభక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అద్దెగ దులపై పన్నులను తగ్గిస్తున్నట్లు టిటిడి తెలి పింది. దీనివల్ల భక్తులు చెల్లించే గదుల అద్దెలు తగ్గాయి. ఇదే సమయంలో భక్తుల నుండి ఎక్కు వగా వస్తున్న విజ్ఞప్తుల మేరకు సాధ్యమైనంత వరకు నిరీక్షణ లేకుండా కేటా యించేలా చూడనున్నారు. వసతి కల్పనవిభాగం ఇప్పటికే రెండువందల శాతం గదుల ఆక్యుపెన్సీ రేటును కూడా సాధించింది. ఇదేగాక టిటిడి తిరుమలలో మూడునాలుగు విశ్రాంతి గృహాలు, కాటేజీలు ఆధునీకరించే పనులు మొద లుపెట్టింది. సామా న్యభక్తులకు వసతి కల్పిం చేందుకు వీలుగా కేంద్రీయ విచారణ కార్యాల యం(సిఆర్ఓ)ను ఆధునీకరించే పనులు కూడా చేపట్టనుంది. 50రూపాయలు, 100 రూపాయలు అద్దెగదులు పూర్తిగా సామాన్యభక్తులకు అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# పిహెచ్‌సి వైద్యుల డిమాండ్లు పరిష్కరిస్తాం

## స్వస్థ్ నారీ శిబిరాల్లో 57.11 లక్షల మందికి ఉచిత వైద్య పరీక్షలు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,అక్టోబరు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** పిహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్దంగా ఉందని, దీని గురించి సిఎం చంద్రబాబుతో చర్చిస్తామని వైద్యారోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. వెంటనే విధుల్లో చేరాలని వారిని కోరారు. ఈ మేరకు మంగళగిరి లోని తన క్యాంపు కార్యాలయంలో ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్,ప్రజారోగ్య శాఖ సంచాలకురాలు డాక్టర్ పద్మావతి,వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ రఘునందన్‌లతో శనివారం రాత్రి అత్యవసరంగా సమావేశ మయ్యారు. 'ఇన్ సర్వీస్ కోటా డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది. టైంబౌండ్ పదోన్నతులు,ట్రైబల్ ఎలవెన్స్,నోషనల్ ఇంక్రిమెంట్ల గురించి చర్చించి,ప్రభుత్వానికి సిఫార్సు చేసేందుకు ఇప్పటికే కమిటీ వేశామని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ పిహెచ్‌సి వైద్యులు గత నెల 28



నుంచి ఆందోళన చేస్తున్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 17 నుంచి ఈ నెల 2 వరకు నిర్వహించిన స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరాల్లో 57.11 లక్షల మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 26 జిల్లాల్లో నిర్వహించిన 25,192 వైద్య శిబిరాల్లో మహిళలు, పిల్లలు, వైద్య సేవలు పొందారని మంత్రి పేర్కొన్నారు. 'ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం' నినా దంతో ప్రధానమంత్రి నరేంద్రమోడి దేశ వ్యాప్తంగా ఏక కాలంలో నిర్వహించిన శిబిరాలతో ప్రజలకు మేలు జరిగిం దన్నారు. రాష్ట్రంలోని 12.01 లక్షల మందికి బీపీ నిర్ధారణ పరీక్షలు, 11.42 లక్షల మందికి మధుమేహ, 9.70 లక్షల మందికి హిమోగ్లోబిన్, 2.69 లక్షల మందికి టీబీ, 37,561 మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. 83,541 మంది పిల్లలకు టీకాలు వేశారని, 10,225 మంది రక్తదానం చేశారని చెప్పారు. 'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' (పీఎంజేఏవై),ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) కార్డులు 1.73 లక్షల మందికి పంపిణీ చేశారని వెల్లడించారు. అత్యధికంగా 3,603 శిబిరాలతో అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ స్థానంలో, 3,237 శిబిరాలతో పశ్చిమ గోదావరి జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచాయని వివరించారు.

# శిశు గృహంలో పసికందు మృతి

## విచారణకు ఆదేశించిన మంత్రి సంధ్యారాణి

**విజయవాడ, అక్టోబరు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** అనంతపురం ఐసీడీఎస్ శిశుగృహంలో పసకందు మృతిపై మంత్రి సంధ్యారాణి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె విచారణకు ఆదేశించారు. సిబ్బంది మధ్య వివాదాలతో బిడ్డకు పాలు పట్టకపోవడమే మృతికి కారణమని ఆరోపణలున్నాయి. మరో వైపు సంబంధిత అధికారులు పసిబిడ్డ మృతికి అనారోగ్యమే కారణమని చెబుతున్నారు. ఘటనపై ఐసీడీఎస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని మంత్రి సంధ్యారాణి ఆదేశించారు. భాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

# తిరుమల సమాచారం

## సాయంత్రమే తిరుమలలో వయోవృద్ధుల దర్శనాలు

### పుకార్లునమ్మొద్దని టిటిడి విజ్ఞప్తి



**తిరుమల,అక్టోబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని వయోవృద్దులు, దివ్యాంగులు ,పలురకాల అనారోగ్యాలబారితో ఉన్న భక్తులకు ప్రతిరోజూ సాయంత్రం 3గంటలకు టిటిడి స్వామివారి దర్శనం కల్పిస్తున్న విషయం విదితమే. ఈ దర్శనాలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను నమ్మొద్దని, రోజుకు వెయ్యిమందికి ముందుగానే జారీచేసిన టోకెన్లప్రకారం ఆలయం వెలుపల దక్షిణమాఢవీధిలో ఉన్న షెడ్డులో కూర్చోబెడుతారు. వీరందరికీ సకల సేవలు అందుతాయి. ఆలయంలోపల ఎక్కడా ఎలాంటి తోపులాట లేకుండా ఈ భక్తులకు శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. వీరికి 50రూపాయలు లడ్డూ ఒకటి ఉచితంగా జారీ చేస్తున్నారు. అయితే కొందరు ఈ దర్శనాలపై పుకార్లు ప్రచారం చేస్తుండటంతో ఆదివారం టిటిడి తాజాగా ప్రకటన చేసింది. సామాజిక మాధ్యమాల్లో ప్రసా రమవుతున్న తప్పుడు పుకార్లను నమ్మ వద్దని, భక్తులు సరైన సమాచారానికి "డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.తిరుమల. ఒఆర్‌జి,టిటిదేవ స్థానమ్స్. ఎపి.ఇన్"ను సంప్రదించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.



## శ్రీవారి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి

**తిరుమల,అక్టోబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** పెరటాసి మాసంలో ఏడుకొండల వేంకటేశ్వర స్వామి దర్శనం ఆనందదాయకమని పలువురు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ సమయంలో కర్నూలు, హిందూపురం ఎంపిలు బి.నాగరాజు, బికె పార్థసారధి, సినీనటుడు అశోక్ గల్లా, నటి గౌరీప్రియ, దర్శకుడు రఘులు వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజల మన్ననలు పొందిన ప్రభుత్వం: మంత్రి సవిత

**తిరుమల,అక్టోబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** కూటమిప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమపథకాలు ప్రజలు చూస్తున్నారని, తెలుసుకున్నారని రాష్ట్రమంత్రి సవిత అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. ఇదీ మంచిప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందుతున్నామని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోందని మంత్రి తెలిపారు. అభివృద్ధి ఎజెండాగా సిఎం చంద్రబాబు పాలనసాగుతోందన్నారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చిన మంత్రి సవిత ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం



తిరుపతిలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 16నెలల కాలంలో అభివృద్ధిని చూసి వైసిపి నేతలు ఓర్వలేకపోతున్నారని, మూడేళ్ళు కాదు కదా 30 ఏళ్ళ తరువాత కూడా జగన్ అధికారంలోకి రాలేదని సవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

# కపిలతీర్థంజలాశయం నీటిని సంరక్షిస్తాం

## తిరుపతిని మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం: మంత్రి నారాయణ



**తిరుమల,అక్టోబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** స్మార్ట్ సిటీ, యాత్రాస్థలం తిరుపతినగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్ది, అవసరమైన చోట్ల నూతనంగా అధునాతన రోడ్లు, డ్రైన్‌లు నిర్మాణం చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్రమంత్రి పి.నారాయణ తెలిపారు. కపిలతీర్థం జలాశయం నీరు వృధాగా రోడ్లపై.నగరంలోకి రాకుండా సంరక్షించే చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతిని అన్ని విధాలా అభివృద్ధిచేసేందుకు ప్రణాళికలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో కూటమి ప్రభుత్వం సిద్దంగా ఉందని, ఎటువంటి అనుమానాలు వద్దన్నారు. అమరావతి నిర్మాణం పనులు కూడా వేగంగా సాగుతున్నాయన్నారు. ఏడుకొండల వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో అనుకున్న లక్ష్యాలను చేరుకునేలా స్వామివారు తోడుగా ఉంటారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆదివారం ఉదయం అనుచరులతో కలసి మంత్రి నారాయణ తిరుమలకు వచ్చారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నేడు సిఎం చంద్రబాబుచే స్వచ్ఛతా అవార్డులు ప్రదానం

**విజయవాడ,అక్టోబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6వ తేదీ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛతా అవార్డులు ప్రదానం చేయనున్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల్లో ఉత్తమ పనితీరు కనపరిచినసంస్థలు, వ్యక్తులు, ప్రభుత్వ శాఖలకు ఈఅవార్డులను ప్రదానం చేయనున్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రేపు సాయంత్రం 5 గంటలకునిర్వహించనున్న స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమంలో భాగంగా వీటిని అందించనున్నారు. మొత్తం 21 కేటగిరీల్లో రాష్ట్రస్థాయిలో 69 అవార్డులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రదానంచేయనున్నారు. జిల్లా స్థాయిలో 1,257 అవార్డులు విజేతలకు అందించనున్నారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు గానూ రాష్ట్ర స్థాయిలో 6 మున్సిపాలిటీలు, 6 గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయి. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తాడిపత్రి, బొబ్బిలి, పలమనేరు,ఆత్మకూరు, కుప్పం మున్సిపాలిటీలు, స్వచ్ఛ గ్రామ పంచాయితీలుగా ఎంపికైన అనకాపల్లిజిల్లాచౌడువాడ, ప్రకాశంజిల్లాఆర్‌ఎల్ పురం, కోనసీమలోని లోల్ల, కృష్ణా జిల్లాలోని చల్లపల్లి, కడపజిల్లాలోని చెన్నూరు, చిత్తూరు జిల్లాలోని కనమకులపల్లె అవార్డులు అందుకోనున్నాయి.

# గిరిజన విద్యార్థినుల మరణాలపై సమగ్ర దర్యాప్తు చేయండి: ఎస్ఎఫ్ఐ

**విజయవాడ,అక్టోబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినుల మరణాలను అరికట్టాలని, విద్యార్థినుల అనారోగ్యానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి రామ్మోహన్, కె ప్రసన్నకుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పువ్వుల అంజలి, తోయక కల్పన అనారోగ్యంతో మరణించడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. అనారోగ్యానికి గురైన 120 మంది విద్యార్థినులకు విశాఖపట్నంలో వైద్యం అందిస్తున్నారని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా వసతిగృహం లేకపోవడం, ఆరోగ్యంపై దృష్టి సారించేందుకు ఎఎన్ఎంలు లేకపోవడం ప్రధాన కారణమని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచక పోవడం వల్ల సరైన పౌష్టిక ఆహారం అందక పోవడమే విద్యార్థుల అనారోగ్యానికి కారణమని తెలిపారు. ఇది ప్రభుత్వ అసమర్ధతేనని విమర్శించారు. ప్రతియేటా గిరిజన విద్యార్థులు మరణిస్తుంటే ప్రభుత్వానికి పట్టదా? అని ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాలల్లో తక్షణమే అదనపు వసతిగృహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం లను నియమిస్తామని ఎన్నికలకు ముందు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి హామీ ఇచ్చారని, తక్షణమే ఈ హామీని అమలు చేసి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనల కార్యక్రమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు.



# రేపు దత్తమందిరంలో ఆశ్వయుజపౌర్ణమి చండీహోమం

**తిరుపతి,అక్టోబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** దసరా ముగిసిన తరువాత ఆశ్వయుజ పౌర్ణమి ఘడియల్లో మొగిలిచెర్ల దత్తాత్రేయమందిరంలో ఛండీహోమం జరిపిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఈ హోమంకు ఎంతో విశిష్టత వుందని, దత్తాత్రేయ మందిరానికి వచ్చి ఈ ఛండీ హోమంలో ప్రత్యక్షంగా పాల్గొనేవారు 7వతేదీ మంగళవారం ఉదయం నెల్లూరుజిల్లా కందుకూరు మీదుగా లింగసముద్రం మండలం మొగిలిచెర్ల గ్రామంలోని మందిరంకు 8గంటలకు ఆలయంకు రావాలని, పరోక్షంగా పాల్గొనదల చిన భక్తులు 9908973699, 9440266380 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

# మన సంస్కృతిని పరిరక్షించేది మాతృభాషే..

## 'సదాస్మరామి' పుస్తకావిష్కరణ సభలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్

**విజయవాడ, అక్టోబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** మన సంస్కృతిని కాపాడేది మన మాతృభాష మాత్రమే, అమ్మ భాషను గౌరవించేవారే నిజమైన సాహితీ మిత్రులు అని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. గుంటూరులోని భారతీయ విద్యాభవన్ బొమ్మిడాల కృష్ణమూర్తి ఆడిటోరియంలో జరిగిన 'సదాస్మరామి' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ సదాస్మరామి పుస్తకంలో రచయిత మండలి బుద్ధప్రసాద్ 39 మంది సాహితీ ఉద్దండుల వివరాలను ప్రస్తావించారన్నారు. అడవి బాపిరాజు నుంచి సుసర్ల దక్షిణామూర్తి వరకు, రాపాక ఏకాంబరాచార్యుల వైశిష్ట్యం నుంచి యద్దనపూడి సులోచనారాణి నవలా ప్రస్థానం వరకు సవివరంగా తెలిపారన్నారు. 'తెలుగు భాష చాలా గొప్పది. మనం తెలుగువారిలా పుట్టినందుకు గర్వించాలి. అలాంటి భాష నశిస్తే జాతి నశిస్తుందని



'సదాస్మరామి' పుస్తకావిష్కరిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్,మండలి బుద్ధప్రసాద్,

గుర్తెరగాలన్నారు. కులమతాలు,ప్రాంతీయ విభేదాలు,పక్కన పెట్టి జాతి వైభవానికి కృషి చేయాలని పుస్తక రచయిత,అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మద్రాసులో ఏ ఉద్యమం జరిగినా తెలుగు నాయకుల పాత్ర స్పష్టంగా ఉందని, వారి గురించి జాతీయ స్థాయిలో చెప్పుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిల్చిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఛైర్మన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, వీవీఐటీ విశ్వవిద్యాలయం పబ్లికేషన్ డివిజన్ సమన్వయకర్త మోదుగుల రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాతపద్ధతిలోనే అంగప్రదక్షిణ టోకెన్లు

## విడుదల దిశగా టిటిడి పునరాలోచన

**తిరుమల,అక్టోబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** వందలసంఖ్యలో భక్తుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు తిరుమలతిరుపతిదేవస్థానం అధికారులు అంగప్రదక్షిణ టోకెన్లు విడుదల విషయంపై మళ్ళీ పునరాలోచనలో పడింది. ఇప్పటికే అంగప్రదక్షిణ టోకెన్లు జారీని ఆఫ్‌లైన్‌లో తిరుమలలోని కౌంటర్లకు స్వస్తిపలికి పూర్తిగా ఆన్‌లైన్ చేసిన విషయం విదితమే. ఆన్‌లైన్‌లో రోజువారీగా 750 అంగప్రదక్షిణ టోకెన్లు ఉచితంగా భక్తులకు మూడునెలల ముందుగానే విడుదల చేస్తోంది. ఒక్క శుక్రవారం రోజు మినహా యించి వారంలో అన్ని రోజులు వేకువజామున 1.30గంటలకు అంగప్రదక్షిణ భక్తులకు అవకాశం కల్పించారు. అయితే ఇటీవల కొందరు టిటిడి అధికారులు తీసుకున్న నిర్ణయంతో అంగప్రదక్షిణ టోకెన్లు కూడా ఆన్‌లైన్‌లో ముందువచ్చిన వారికి ముందు అన్నట్లుగాక లక్కీడిప్ విధానం అమలులోకి తీసుకువచ్చారు. ఈ విధానం వల్ల టోకెన్లు



మూడునెలల ముందుగానే ఆన్‌లైన్‌లో లక్కీడిప్ విధానం ద్వారా గతనెల 18వతేదీ నుండి విడుదలవుతున్నాయి. భక్తులు తిరిగి ఈ సేవ పొందేందుకు 90రోజులు గడువు ఉండేది. కొత్తవిధానంతో 180రోజులకు పొడిగించారు. అయితే ఈ విధానం వల్ల సామాన్యభక్తులు చాలావరకు ఇబ్బందులు పడుతున్నారని, టోకెన్లు అందుకోలేకపోతున్నామనే అసంతృప్తిని ఫిర్యాదుల రూపంలో టిటిడి డయల్ యువర్ ఇఒకు తెలియజేశారు. లక్కీడిప్‌ద్వారా అంగప్రదక్షిణ టోకెన్లు కేటాయింపు విధానాన్ని పునఃపరిశీలించాలని భక్తులు కోరారు. పాతపద్దతిని అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు. అందిన సూచనలు, అభ్యర్థనలను పరిగణనలోనికి తీసుకుని పాతవిధానంలోనే తిరిగి అంగప్రదక్షిణ టోకెన్లు జారీచేస్తామని హామీ ఇచ్చారు. భక్తుల నుండి అందుతున్న సూచనలు, అభిప్రాయాల ఆధారంగానే వారికి సౌకర్యవంతంగా నిర్ణయాలు తీసుకుంటామని ఇఒ స్పష్టం చేయడంతో అంగప్రదక్షిణ టోకెన్లు జారీని ఈనెలలో పాతవిధానంలోనే కేటాయించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా గతంలో ఒక్కశనివారం రోజుకు మాత్రం స్థానిక భక్తులకు 300 టోకెన్లు ఆఫ్‌లైన్‌లో జారీచేసే విధానంపై కూడా ఇఒ పునఃసమీక్షించే అవకాశం లేకపోలేదు. ఆపదమొక్కుల వాడు తిరుమల ఏడుకొండలస్వామికి ఎంతో భక్తితో భక్తులు చెల్లించుకునే మొక్కుల్లో వేకువజామున చేపట్టే అంగప్రదక్షిణ కూడా ఎంతో పవిత్రమైంది. కాగా రానున్న 2026 జనవరినెలకు సంబంధించి అంగప్రదక్షిణ టోకెన్లకోసం పాత విధానంలోనే విడుదల చేయనున్నారనేది స్పష్టమైంది. శుక్రవారం మినహా మిగిలిన అన్ని రోజులు 750 టోకెన్లు ,శనివారం మాత్రం ఆన్‌లైన్‌లో 500 టోకెన్లు జారీచేయడం జరుగుతోంది.

# తల్లిని చంపిన కసాయి

## అతి ప్రేమే కొంప ముంచిందా.. సరిలేని మానసిక స్థితి..

**ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 5, ప్రభాతవార్త:** ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో తల్లిని కన్న కొడుకే దారుణంగా హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి (దివ్యాంగురాలు) దంపతులకు ఒక్క గానొక్క కుమారుడు ఉన్నాడు. లక్ష్మీదేవి స్థానిక ఈశ్వర్‌రెడ్డినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. కుమారుడు యశ్వంత్‌రెడ్డిని గారాబంగా పెంచుకున్నారు. ఉద్యోగ వేటలో హైదరాబాదులో 4సంవత్సరాలు పాటు ఉన్నాడు. తల్లి పంపించే డబ్బులతో అక్కడే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. అయితే అక్కడ స్నేహితుల సలహాలతో సినీ హీరోగా మారాలనే ఉద్దేశంతో ఆ ప్రయత్నాలు కూడా చేయడం జరిగింది. పండగలు, పెళ్లిళ్ల ఇతర కార్యక్రమాలకు ఇంటికి రావాలని తల్లిదండ్రులు కోరినా వచ్చేవాడు కాదని తెలుస్తోంది. దసరాకు ఇంటికి రావాలని తల్లిదండ్రులు కోరారు. అయితే కుమారుడు అందుకు నిరాకరించి రాలేదు. అయితే ఈనెల ఇవ్వాల్సిన డబ్బులు తల్లిదండ్రులు పంపించకపోవడంతో ఆదివారం తెల్లవారుజామునే ఇంటికి చేరుకుని డబ్బులు పంపించలేదని తల్లిదండ్రులతో గొడవ పెట్టుకున్నాడు. తల్లి మందలించడంతో అది మనసులో ఉంచుకొని తండ్రి బాత్‌రూంలో ఉండడంతో గడియపెట్టి కూరగాయలు కోసుకునే కత్తితో ఆమె గొంతుకోసి దారుణంగా హత్య చేసి బాత్‌రూంలో



లక్ష్మీదేవి(ఫైల్)

ఉన్న తండ్రికి అమ్మను హత్య చేశాను చూసుకో వెళ్లి నింపాదిగా చెప్పడం విశేషం. భార్య మృతదేహాన్ని చూసి భర్త బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం తెలపడంతో వన్ టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని యశ్వంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఏది ఏమైనా యశ్వంత్‌రెడ్డిమానసికస్థితి సరిగాలేదని ఉద్యోగం రాకపోవడంతో మనోవేదకు గురైనట్లు తండ్రి తెలిపి కన్నీరు మున్నీరుగా విలపించాడు.

# ఆటో డ్రైవర్లను మోసగించిన ప్రభుత్వం

## 13 లక్షల మందికి హామీ ఇచ్చి, 2.90 లక్షల మందికే పరిమితం: షర్మిల ఆరోపణ

**విజయవాడ,అక్టోబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆటో డ్రైవర్ల సేవలో పథకంపేరిట చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఘరానా మోసం చేసిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుత అమలుకు పొంతన లేదని, ఇది డ్రైవర్లను ఘోరంగా మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు. ఖాకీ చొక్కాలు వేసుకుని,ఆటోల్లో తిరిగినట్లు ఫొటోలకు పోజులిచ్చి, వారి కుటుంబాలను ఉద్ధరించినట్లు కాకమ్మ కబుర్లు చెప్పి, డ్రైవర్ అన్నలకు మసిపూసి మారేడుకాయ చేశారన్నారు. ఆటో డ్రైవర్లను మోసగించడంలో గత వైసీపీ ప్రభుత్వానికి, నేడు కూటమి ప్రభుత్వానికి తేడాలేదన్నారు. రాష్ట్రంలో బ్యాడ్జి కలిగిన ప్రతి డ్రైవర్ కి ఏటా 15 వేలు ఇస్తాం అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఓనర్ కం డ్రైవర్ కింద 2.60 లక్షల మందికి మాత్రమే వాహన మిత్ర ఇచ్చిందని నాడు మీరు ఎద్దేవా చేశారు. 13లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉంటే 10శాతం మందికి కూడా పథకం దక్కలేదని మండిపడ్డారు. అర్హతలతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరిని ఆదుకుంటామని హామీలు ఇచ్చారు. అన్ని మాటలు చెప్పి 15 వేల పథకాన్ని కేవలం 2.90 లక్షల మందికే ఎలా ఇచ్చారు చంద్రబాబు గారూ? అని షర్మిల తన ప్రకటనలో పేర్కొన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# వడలిలో అక్షయపాత్ర సభ్యుల సేవా కార్యక్రమం

**పెనుగొండ:అక్టోబర్ 5( ప్రభాతవార్త ):** పెనుగొండ మండలం వడలి గ్రామంలో అక్షయపాత్ర సేవా సంస్థ సభ్యులు మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ కూడలి వద్ద, పిట్లవేమవరం గ్రామానికి చెందిన మల్లిడి సత్యనారాయణరెడ్డి ఇంటిలో జరిగిన కుటుంబ కార్యక్రమం అనంతరం మిగిలిన ఆహార పదార్థాలను వృథా కాకుండా, వాటిని సేకరించి నిరుపేదలకు పంచడం జరిగింది. ఈ సేవా కార్యక్రమంలో అక్షయపాత్ర సభ్యులు ఉప్పలపాటి చంటి, చిటికెన లక్ష్మణరావు, మేకా సురేష్ సక్రమంగా పాల్గొన్నారు. సేకరించిన ఆహారాన్ని గ్రామ పరిసర ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి చంటి మాట్లాడుతూ, మన వద్ద మిగిలిన ఆహారం వృథా కాకుండా ఆకలితో ఉన్నవారికి అందించడం మనందరి సామాజిక బాధ్యత. చిన్నచిన్న సేవా కార్యక్రమాలు పెద్ద మార్పు తీసుకురావగలవు. అందరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి" అని అన్నారు. కార్యక్రమానికి సమాచారం అందించి సహకరించిన



కర్రి శ్రీనివాసరెడ్డి , బ్రదర్స్ కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు అక్షయపాత్ర సభ్యుల సేవా భావాన్ని ప్రశంసించారు.

# తమ్మిలేరు ఆయకట్టు చెరువులకు మహర్దశ

## - సద్వినియోగం అవుతున్న జైకానిధులు - ఆరేళ్ల తర్వాత మోక్షం

**ప్రభాతవార్త చాట్రాయి :** తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న చెరువులకు మహర్దశ కలిగింది. సుమారు ఆరేళ్ల తర్వాత జైకా నిధులు( జపాన్ బ్యాంక్ నిధులు ) ఖర్చు చేస్తుండటంతో తమ్మిలేరు పరిధిలో ఉన్న పోలవరం చెరువులకు మోక్షం కలిగింది. గత తెలుగుదేశం ప్రభుత్వం లోనే నిధులు మంజూరు అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం లో పనులు చేయుటంలో నిర్లక్ష్యం వహించడంతోపాటు రివర్స్ టెండరింగ్ విధానాన్ని అనుసరించడంతో నిధులు నిరుపయోగమయ్యాయి. తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలో రావడంతో జైకా నిధులను సద్వినియోగం చేయాలని మంత్రి పార్థసారథి కి ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు విన్నవించడంతో ఎట్టకేలకు పనులు ప్రారంభమై పూర్తి కావస్తున్నాయి. తమిళనాడు ఆయకట్టు పరిధిలో లక్ష్మీ సాగారం, నల్లకుంట, చల్లగుళ్ల వారి చెరువు, గండి చెరువు మరమ్మతులు చేస్తుండడంతో సుందరవందనంగా తయారవుతున్నాయి. ఎన్నో ఏళ్ల నుండి ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిధిలావస్థకు చేరిన చెరువులు పటిష్టంగా తయారవుతున్నాయి. చెరువులకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులకు మరమ్మతులు చేయటం వల్ల నీటి సామర్థ్యం పెరుగుతుందని అంతేకాకుండా చెరువు కట్టలు పటిష్టంగా వేశారని రైతులు అంటున్నారు.



**తమ్మిలేరు అభివృద్ధికి కృషి చేస్తా : రమేష్**

తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తమ్మిలేరు ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షులు యర్రా రమేష్ అన్నారు. తమ్మిలేరు కు సంబంధించి అన్ని చెరువులు మరమ్మతులు చేయించమని చెరువుల్లో కూడా నీరు పుష్కలంగా నింపినట్లు ఆయన చెప్పారు.

**రైతుల కోసమే కూటమి ప్రభుత్వం : మరిడి**

రైతులకు అన్నీ విధాలుగా మేలు చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరిడి చిట్టిబాబు అన్నారు. జైకా నిధులను జగన్ ప్రభుత్వం విస్మరించిందని ఆనిధులతోనే ప్రస్తుతం తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టును నందనవనంగా తయారు చేస్తున్నామని రైతులకు దీని వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు.





# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను

## వినియోగించుకోండి:కలెక్టర్ నాగరాణి



**భీమవరం అక్టోబర్ 5 ప్రభాతవార్త** :ప్రజా సమస్యల కోసం కాల్ సెంటర్ 1100 సేవలను నాగరాణి పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS) ను ఈ సోమవారం పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా అక్టోబర్ 6న కలెక్టరేట్ లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు లినమోదు చేసుకోవడానికి మీకోసం. ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ " అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించు కోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### ఈనెల 6వ తేదీన జిల్లా ఇంచార్జ్ మంత్రి

# నాదెండ్ల మనోహర్ ఏలూరు జిల్లాలో పర్యటన

**ఏలూరు ప్రభాతవార్త:** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ఈనెల 6వ తేదీ ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు సర్. సి.ఆర్.రెడ్డి డిగ్రీ కాలేజ్ ఆడిటోరియం లో జరిగే 'స్వచ్ఛాంధ్ర అవార్డుల' పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొంటారు.



# గోతులు పోసిన వంద రోజులకే మాయం

## నాసిరకంగా తాత్కాలిక మరమ్మతులు



**చాట్రాయి,అక్టోబర్ 5,ప్రభాతవార్త :** ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఆర్ అండ్ బి రోడ్డు తాత్కాలిక మరమ్మతులు మున్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయాయి. పనులు నాసిరకంగా చేయటంతో మరమ్మతులు చేసిన వంద రోజులకే గోతులు పడే పరిస్థితి ఏర్పడింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉ ఒడగా గోతులు మయంగా ఉన్నాయి అంటూ ప్రజలు గగ్గోలు పెట్టగా తెలుగుదేశం పార్టీ అధికారంలో కి వచ్చిన తర్వాత గోతులను పూడ్చేందుకు తాత్కాలిక మరమతులకు శ్రీకారం చుట్టారు. అయితే కొన్ని గోతులు పోసినప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు అమ్యామాలు తీసుకొని నాణ్యతను విస్మరించడంతో తిరిగి గోతులమయంగానే మారుతున్నాయి. గోతులు పూడ్చే సమయంలో కనీసం అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవటంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ గోతులు పడకుండా నాణ్యత పరిణామాలు పాటించాల్సిన అవసరం ఉండగా అధికారులు పట్టించుకోలేదని విమర్శలు



సర్వత్రా వినపడుతున్నాయి. చాట్రాయి మండలంలో పోసిన అన్ని రోడ్డులో గోతులు తిరిగి కనపడుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలన చేసి చర్యలు తీసుకుని తిరిగి గోతులు పూడ్చేందుకు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# కార్మిక పని గంటలు పెంపును వ్యతిరేకించండి

## - సిపిఐఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

**చాట్రాయి, అక్టోబర్5, ప్రభాతవార్త :** కార్మికుల పనిగంటలు పెంతటాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి హరినాథ్ డిమాండ్ చేశారు. ఏఐసిసి టి యు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా 10 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో తెచ్చిన చట్ట సవరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లుపై ఈ నెల 6న నూజివీడు ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఐసీసీ టీయూ ఆధ్వర్యంలో పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ జరిగే ధర్నాని విజయవంతం చేయాలని హరినాథ్ కోరారు.కార్పొరేట్లకు బడా కంపెనీలకు ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద కారు చౌకగా శ్రామికుల శ్రమ దోచుకోవటానికి చంద్రబాబు సిద్ధం కావడం కార్మిక ద్రోహానికి పాల్పడటమేనన్నారు. రక్తం చిందించి చికాగోలో పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని కొనసాగించే వరకు ఏఐసీసీటీ యు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పోరాడుతుందని అయన హెచ్చరించారు. మహిళలు రాత్రి షిప్ లలో పని చేయించుకునే విధంగా సవరించటం ద్వారా వారి భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని హరినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసిటియు ఏలూరు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య, లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, కళావతి,భవాని సీతామాలక్ష్మి,జూట్రు కమల, బత్తిన అరుణకుమారి, షేక్ గౌసియా, చౌటపల్లి అరుణ,కలపాల రామలక్ష్మి, ర వేముల చంటి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినందుకు ఘన సత్కారం

## భాష్యం ఉపాధ్యాయులకు 'గురుబ్రహ్మ' పురస్కారం

**పెనుగొండ ప్రభాతవార్త :** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరి టాలెంట్ టెస్ట్ విద్యారంగ పత్రిక (ఎడ్యుకేషన్ స్పెషల్) ఆధ్వర్యంలో ఆదివారం నాడు రాజమండ్రి ఆనంద రీజన్సీ పందిరి హాల్‌లో ఆదర్శ గురువులకు సత్కార సమారోహం ఘనంగా నిర్వహించనున్నారు. విద్యార్థుల ప్రతిభను పోటీ పరీక్షల ద్వారా వెలికితీసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, శాస్త్ర ఉపాధ్యాయులను ఈ సందర్భంగా 'గురుబ్రహ్మ' పురస్కారం తో సత్కరించనున్నారు. ఈ పురస్కారానికి పెనుగొండ భాష్యం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాలి వెంకట అప్పారావు, తెలుగు ఉపాధ్యాయిని సీతారత్నం ఎంపికయ్యారు.



విద్యారంగంలో వారి సేవలు, విద్యార్థుల ప్రగతికి అందించిన మార్గదర్శనం ఈ గౌరవానికి కారణమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గౌరవ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, గౌరవ పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురంధరేశ్వరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితర ప్రముఖులు హాజరై అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా భాష్యం జోనల్ ఇంచార్జ్ ఏ. శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇంచార్జ్ రాణి రోజాజీ, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు. "ఇది మా పాఠశాల గౌరవానికి, ఉపాధ్యాయుల అంకితభావానికి అద్దం పడే ఘనత" అని నాలి వెంకట అప్పారావు హర్షం వ్యక్తం చేశారు.

# 6, 7 తేదీలలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు

# జాటోత్ హుస్సేన్ ఏలూరు జిల్లాలో పర్యటన



**ఏలూరు, ప్రభాతవార్త :** జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ ఈ నెల 6,7 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారు. అక్టోబర్ 6, 2025 (సోమవారం) ఉదయం 07.30 ని.లకు రాజమహేంద్రవరం నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి గోపాలపురం, కొయ్యలగూడెం, కన్నాపురం, బుట్టాయిగూడెం, దోరమమిడి, అలివేరు మీదుగా మోధెల గ్రామానికి చేరుకుంటారు. ఉదయం ఉ.11.30 మోధెలలో స్థానిక షెడ్యూల్డ్ తెగల సంఘాల ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మ.2.00 గంటలకు రామన్నగూడెం మీదుగా లంకపాకల ఆశ్రమ పాఠశాల చేరుకొని పాఠశాలను సందర్శిస్తారు. సా.4.30 ని.లకు లంకపాకల నుండి కోటరామచంద్రాపురం చేరుకొని అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. కోటరామచంద్రాపురంలో రాత్రి బస చేస్తారు. ఈనెల 7వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు – కోటరామచంద్రాపురంలో పునరావాస కార్యక్రమాల ప్రణాళిక అంశంపై అధికారులతో సమావేశమవుతారు. , అనంతరం మ.2.00 ల నుంచి ఏలూరు జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్, అటవీ అధికారి, విద్యుత్ శాఖ మరియు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశంలో పాల్గొంటారు. అదేరోజు సా.5.30 ని.లకు కోటరామచంద్రాపురం నుండి రోడ్డు మార్గం ద్వారా రాజమహేంద్రవరం బయలుదేరి వెళతాయారు.

## వరకట్నం వేదికపై కేసు నమోదు

**అత్తిలి– అక్టోబర్ 4 (ప్రభాత వార్త):** అత్తిలి మండలం స్కిన్నెర పురం కు చెందిన ఒక యువతి ని వివాహం చేసుకొని కట్నం కోసం వేధి స్తున్న భర్త అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పి శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఈ సంవత్సరం ఫిబ్రవరి 14న ఎండగండి గ్రామానికి చెందిన గంగుల సతీష్ కుమార్ తో ఆమెకు వివాహం జరిగిందని తెలిపారు. వివాహ సమయంలో 40 లక్షల నగదు, 36 కాసుల బంగారం, ఐదు కిలోల వెండి పూజా సామాగ్రి కింద ఇచ్చినట్లు తెలిపారు. నిందితుడు జర్మనీలో ఉద్యోగం చేయడంతో పుట్టింటి నుండి ఆస్తులు నమ్మి డబ్బు తేవాలని అత్తమామలు వేధించేవారని తెలిపారు. గత నెల 17న నిందితుడు అత్తమామల ఇంటికి వచ్చి బెదిరించడం తో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిందని అన్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

## అన్నను గాయపరిచిన తమ్మునిపై కేసు

**అత్తిలి– అక్టోబర్ 4 ( ప్రభాత వార్త):** అత్తిలి మండలం ఒరిగేడు గ్రామానికి చెందిన ఉల్లి పెద్దిరాజు అనే వ్యక్తిని సోదరుడు ఆస్తి విషయమై గొడవపడడంతో సోదరుడు కృష్ణ పై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్ఐ పి. ప్రేమ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం శుక్రవారం పెద్దిరాజు సైకిల్ పై కిరాణా దుకాణం కు వెళుతుండగా నిందితుడు తన షాపులో ఉండి పెద్దిరాజును దూషించడంతో పాటు, కొట్టడంతో సైకిల్ విరిగిందని కాళ్లకు దెబ్బలు తగలడంతో పెద్దిరాజు ఆసుపత్రిలో చేరాడు. ఆస్పత్రి నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు కృష్ణ పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పేరుపాలెం బీచ్ లో యువకుడు గల్లంతు

మొగల్తూరు అక్టోబర్ 5 : (ప్రభాతవార్త) కేపీ పాలెం నార్త్ గ్రామపంచాయతీ పరిధి బీచ్ సమీపంలో ఆదివారం సాయంత్రం విజయవాడకు చెందిన మాడెపల్లి ప్రవీణ్ (38) గల్లంతయ్యాడు, తన స్నేహితులతో కలిసి బీచ్ కి విహారయాత్రకు వచ్చి సముద్ర స్నానం చేస్తుండగా, అలల ఉధృతకు సముద్రంలోని కి కొట్టుకొని పోయాడు, సమాచారం అందుకున్న పోలీసులు, మరియు మెరైన్ సిబ్బంది, గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు

# ఉపాధ్యాయుల వల్లే ఉత్తమ సమాజం....

## - 120 మంది ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను సత్కరించిన మంత్రి రామానాయుడు.

## - ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు.






**పాలకొల్లు ప్రభాతవార్త:** సమాజంలో అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని....జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో గొప్పది. తల్లిదండ్రులు జన్మనిచ్చి పెంచి పెద్ద చేస్తే ఉపాధ్యాయులు వీరిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతారు. తద్వారా ఆదర్శవంతమైన ఉత్తమ సమాజం ఏర్పడుతుందని రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పూలపల్లి బైపాస్ రోడ్ లో లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో ఘనంగా జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 120 మంది ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను మంత్రి రామానాయుడు సత్కరించారు. ఆయన గజమాలవేసి సాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తన తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన ధర్మారావు ఫౌండేషన్ ద్వారా గత 14 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఇంజనీరు, సైంటిస్టు, డాక్టరు, రాజకీయవేత్తలను తయారు చేసేది ఒక్క ఉపాధ్యాయులేనని అందువల్లనే ఉపాధ్యాయులంటే ఎంతో గౌరవం అని తెలిపారు. తాను కూడా రాజకీయాలకు రాక ముందు నర్సాపురం వై ఎన్ కళాశాలలో అధ్యాపకునిగా పది సంవత్సరాలు పాటు పని చేశానన్నారు. తాను ఎమ్మెల్యే, మంత్రి అని చెప్పుకునేదానికన్నా అధ్యాపకుని అని చెప్పుకోవడానికే ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. పాలకొల్లు నియోజకవర్గ నుంచి మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందాలంటే ఉపాధ్యాయులే కీలకమని అటువంటి ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్య, ఇబ్బంది వచ్చినా అధికారంలో ఉన్న లేకపోయినా మీ వాయిస్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా బాధ్యత దిశగా తీసుకుంటున్నాను అన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాల విధ్వంసానికి గురి చేయడంతో పాటు అప్పులు చేసి ప్రజలపై జగన్ భారం మోపాడన్నారు. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్దుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు కలిసి మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలలోను ముందుకు తీసుకెళుతున్నారన్నారు. అటువంటి మంచి ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ ఆశీర్వదిరించాలని కోరారు. నేడు విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యావ్యవస్థను గాడిలో పెట్టి అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. డీఎస్సీ అంటే చంద్రబాబు, చంద్రబాబు అంటేనే డీఎస్సీ అన్నారు.దేశం లో 2 లక్షల టీచర్ పోస్టులు

7వ పేజీలో

# ఫ్రీ బస్సు పెట్టి ఆటో డ్రైవర్లకు కడుపు కొట్టి ఆ ఆటో డ్రైవర్లు కు

# 15 వేలు ఇవ్వడం ఏలా సేవ అవుతుంది..?

## - జోగాడ ఉమామహేశ్వరరావు

**పాలకొల్లు ప్రభాతవార్త :** ఆటో డ్రైవర్లకు మాత్రమే కాదు లారీ డ్రైవర్ లకు కూడా ఇస్తాం అంటూ మ్యానిఫెస్టోలో చెప్పేరు కదా.. మరి ఇవ్వని హామీని కూడా ఇస్తున్నాం అంటూ కూటమి నాయకులు. గొప్పలు చెప్పడం చూస్తుంటే..ఈ మాట కూడా అబద్ధం అని..,చెప్పక తప్పదు.. ఆటో డ్రైవర్లు సేవలో అంటూ 15000/- ఇచ్చి ఆటో డ్రైవర్లను కూడా మోసం చేసింది ఈ కూటమి ప్రభుత్వం ఆటో వైసిపి నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న పథకాలన్నీ కొనసాగిస్తానని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లు హామీను ఇచ్చారు కదా.. ఈ కూటమి ప్రభుత్వం అదికారంలోకి వచ్చి ఏడాది న్నర కావస్తున్నా ప్రభుత్వం వాహన మిత్ర పథకంలో బాగంగా గత ఏడాది ఆటో డ్రైవర్లు కు పదివేలు ఇవ్వలేదు... అలాగే ఈ ఏడాది పది వేలు ఇవ్వాలి..ఆ లెక్కన చూస్తే.. ఈ రెండు సంవత్సరాలు కలిపి ఇరవై వేలు ఇవ్వాలి.. ఇచ్చింది ఎంత 15 వేలు.. తగ్గింది ఎంత 5 వేలు..అంటే తెలుగు దేశం పార్టీ ఆద్వర్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసినట్లే కదా..?? అంటూ జోగాడ ఏద్దేవా చేశారు.



నరసాపురం జనసేన పార్టీ కార్యాలయంలో, పవన్ కళ్యాణ్ ఆశయాలు మరియు బొమ్మిడి నాయకర్ నాయకత్వ ఆకర్షితులై, నరసాపురం 3వ వార్డుకు చెందిన నల్లి కృష్ణ ప్రసాద్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ,నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆయనకు జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ స్వాగతం పలికారు.
జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.
ప్రభాతవార్త నరసాపురం



# జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం

**భీమవరం అక్టోబర్ 5ప్రభాతవార్త :**జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంబానికి ఆర్థికంగా కొంత ప్రయోజనం ఉంటుందని భీమవరం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్ అన్నారు. సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ అవగాహాన్ని కార్యక్రమాన్ని ఆదివారం భీమవరం రైతు బజార్ లో నిర్వహించారు. తగ్గిన ధరల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా అధికారులతో కలిసి ప్రచార కార్యక్రమాలు



నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వినియోగదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

# నక్కావారి కుటుంబంలో కన్నీరు మున్నీరు

## వరుసగా ఇద్దరు సోదరుల మృతి- గ్రామాన్ని కలచివేసిన దుఃఖం

పెనుగొండ,( ప్రభాతవార్త ): పెనుగొండ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామ సొసైటీ అధ్యక్షులు నక్కా వేదవ్యాస శాస్త్రి కుటుంబంలో వరుసగా చోటుచేసుకున్న మరణాలు గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఒకే కుటుంబంలో కొద్ది రోజుల వ్యవధిలో ఇద్దరు సోదరులు హార్ట్ అటాక్‌తో కన్నుమూయడం అందరినీ కలిచివేసింది. సెప్టెంబర్ 28న శాస్త్రి అన్న నక్కా బాలాజీ హఠాన్మరణం చెందారు. హార్ట్ అటాక్ కారణంగా ఆయన తుదిశ్వాస విడిచిన వార్త గ్రామంలో విషాదాన్ని నింపింది. బాలాజీ గ్రామంలో మంచి పేరు సంపాదించిన వ్యక్తి. ఆయన మరణం కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను తీవ్రంగా కలిచివేసింది. ఈ విషాదం నుంచి కుటుంబం ఇంకా కోలుకోకముందే, అక్టోబర్ 4న మరో విషాదం చోటుచేసుకుంది. శాస్త్రి గారి చిన్న సోదరుడు నక్కా మురళి తణుకు సుధా హాస్పిటల్లో మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హార్ట్ అటాక్‌తో మృతి చెందారు. ఈ వరుస మరణాలతో నక్కా కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. "అన్న మరణం బాధ ఇంకా చెదరకముందే మురళి కూడా మనల్ని విడిచి వెళ్లిపోవడం చాలా బాధాకరం" అంటూ నక్కా వేదవ్యాస శాస్త్రి కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన మాటలు అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాలను తాకాయి. గ్రామ ప్రజలు వారి ఇంటికి వెళ్లి పరామర్శిస్తూ, కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో విచారసంతాపం వ్యక్తం చేస్తూ నక్కా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మెట్టిరేవు గ్రామంలో ముగిసిన శ్రీదేవి నవరాత్రుల మహోత్సవములు

మొగల్తూరు అక్టోబర్ 5 ( ప్రభాతవార్త ) : కే.పీ.పాలెం నార్త్ గ్రామపంచాయతీ పరిధి మెట్టి రేవు గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం నందు (30 వార్షికోత్సవం) దసరా మహోత్సవాలు గత నెల 22వ తేదీ సోమవారం గ్రామానికి చెందిన బొడ్డు త్రిమూర్తులు లక్ష్మీ కుమారి దంపతులచే కలశస్థాపనతో ప్రారంభమై ఆదివారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా అమ్మవారి ఆలయ ఆవరణలో సుమారుగా 8 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు.

# రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు

చింతలపూడి.. ప్రభాత వార్త : చింతలపూడి మండలం పరిసర గ్రామాలలో ఉన్న స్వయం సేవకులు మరియు హిందూ బంధువులందరూ స్థానిక వి కె ఎం ఫంక్షన్ హాల్ నందు సమావేశం నిర్వహించడం జరిగినది. విశ్వనాథ్ ఏలూరు జిల్లా ప్రచారక్ మాట్లాడుతూ 100 సంవత్సరంలలో ఆర్ఎస్ఎస్ చేసిన కార్యక్రమాలు మరియు వ్యక్తి నిర్మాణం , కుటుంబ నిర్మాణం , పర్యావరణ పరిరక్షణ హిందువులందరూ సంఘటితం అవడం , పంచపరివర్తన్ తదితర అంశాల మీద సభను ఉద్దేశించి ప్రసంగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చిల్లపల్లి మోహన్ రావు , రావిపాటి సతీష్, హరికృష్ణ , మణి కుమార్ వరప్రసాద్ తంటేపూడి,సరిపూడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మను కలిసిన భూపతి రాజు రవీంద్ర రాజు



మావుళ్ళమ్మ మేమెంటో అందజేయడం జరిగింది.

పెనుమంట్ర–ప్రభాతవార్త :భీమవరంలో కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను వారి భీమవరం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు శనివారం కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ను భీమవరంలో మావుళ్ళమ్మ గుడి వద్ద ఉన్న గ్రామ కచేరి చావిడి స్థలములో నిర్మిస్తున్న జిల్లా గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి తప్పకుండా సంఘం భవన నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని రవీంద్ర రాజు తెలిపారు. అనంతరం మంత్రిని సాలువతో సత్కరించి మావుళ్ళమ్మ మేమెంటో అందజేయడం జరిగింది.

# కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు -పెనుగొండ ఆటో డ్రైవర్లు



**పెనుగొండ :అక్టోబర్ 5( ప్రభాతవార్త ):** పెనుగొండ పట్టణంలో శ్రీ వాసవి లక్ష్మీ బాలాజీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు కూటమి ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలిపారు. పెనుగొండ బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మరియు ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం చేశారు. కష్టకాలంలో ఆటో డ్రైవర్లకు 15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించినందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు "ప్రభుత్వం మాకు అండగా నిలిచింది, మా కుటుంబాలకు ఊరట ఇచ్చింది" అంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగు దేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు పిప్పళ్ళ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్ బాలం నాగయ్య, సెక్రటరీ కోట్ల బాబ్జి, సభ్యులు సత్యనారాయణ, కవురు గంగయ్య, భావన ప్రసాద్, కుక్కల దుర్గారావు, పూడి బాలసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని వీక్షించి ఆటో డ్రైవర్ల ఉత్సాహాన్ని అభినందించారు.

# పెనుగొండ శాంతి ధామ్‌లో శ్రద్ధా సమర్పణ

## 9మంది దంపతుల గోమాత పూజ, హెూమం



**పెనుగొండ అక్టోబర్ 05 ( ప్రభాతవార్త):** పెనుగొండ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించిన గోమాత పూజ, వాసవి హెూమం. శరన్నవరాత్రుల పుణ్యకాలంలో ఆధ్యాత్మికతకు అద్దం పడుతూ, ఈరోజు పెనుగొండ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు నగరంనుండి విచ్చేసిన 9 మంది దంపతులు గోమాత పూజ, అభిషేకం, దంపతి పూజలో పాల్గొని వాసవి హెూమంలో తమ ఆధ్యాత్మిక సమర్పణను చాటారు. సంపూర్ణ కుటుంబ సమేతంగా హాజరైన ఈ దంపతులు, వాసవి దేవికి తమ కోరికలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా "జై వాసవి జై జై వాసవి దేవి" నినాదాలతో క్షేత్రం మార్మోగింది. శాంతి ధామ్ పరిసరాలు పుష్పాలంకారాలతో, దీపాల వెలుగులతో, మంగళ వాయిద్యాల నాదంతో శోభాయమానంగా మారాయి. ఇదే సమయంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుండి వచ్చిన భక్తులు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మాలధారణ చేసి, కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనాన్ని పొందారు. శ్రద్ధా భక్తులతో కూడిన ఈ యాత్ర, వారి ఆధ్యాత్మిక జీవనంలో మరపురాని ఘట్టంగా నిలిచింది. ఈ శరన్నవరాత్రుల సందర్భంగా పెనుగొండ క్షేత్రం భక్తుల సందడి, ఆధ్యాత్మిక కార్యక్రమాల వైభవం, వాసవి అమ్మవారి మహిమను ప్రతిబింబిస్తూ, తెలుగు సంస్కృతికి అద్భుతమైన దృశ్యాన్ని అందించింది.

# కోమటి తిప్ప గ్రామంలో జనసేన పార్టీలో చేరిక వైకాపా నేతలు



మొగల్తూరు అక్టోబర్ 5( ప్రభాతవార్త) కోమటి తిప్ప గ్రామంలో పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, బొమ్మిడి నాయకర్ నాయకత్వానికి ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఈ గ్రామానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకుడు ప్రస్తుతం మొగల్తూరు మండల పార్టీ అధ్యక్షుడు కొల్లాటి గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది అధికారికంగా జనసేన పార్టీలో చేరారు.

# పేరుపాలెం గ్రామంలో అమ్మవారి నిమజ్జన ఊరేగింపు



మొగల్తూరు అక్టోబర్ 5( ప్రభాతవార్త) పేరుపాలెం నార్త్ గ్రామం శివాలయం సెంటర్ కౌరువారిపాలెం రోడ్డులో శ్రీ శ్రీ దేవి నవరాత్రి మహోత్సవములు (21 వ వార్షికోత్సవం) ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భముగా శనివారం ఉదయం ఉత్సవ కనకదుర్గ అమ్మవారిని అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఉంచి అమ్మవారి ఊరేగింపు జరిపారు. పేరుపాలెం నార్త్ డివిఆర్ యూత్ ఆర్థిక సహకారంతో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. కడలి సత్య శేషు కుమార్ లక్ష్మీ దంపతుల ఆర్థిక సహకారంతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న కమిటీ సభ్యులకు భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమ్మవారి నిమజ్జన ఊరేగింపు వివిధ రకాల బుట్ట బొమ్మలతో చిత్ర విచిత్ర వేషాలతో బాణాసంచా దారి పొడవునా కాలుస్తూ డిజె సౌండ్ తో తీన్మార్ డప్పులతో బ్రహ్మాండమైన ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు కవురు అమర్నాథ్ (బాబ్జి),కౌవురు సత్యసాయి బాబు, కడలి శేషు కుమార్, పాల సత్యనారాయణ,కవురు వెంకటరామయ్య, పస్తుల మురళి, అమ్మవారి ఊరేగింపులో భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు. బుధవారం ఉదయం దసరా ముగింపు అన్న సంతర్పణ ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు

# గోదావరి నదిలో అమ్మవారి నిమజ్జనం



వేలేరుపాడు, అక్టోబర్ 5,ప్రభాత వార్త : రుద్రంకోట గ్రామములో మహాలక్ష్మి అమ్మ వారి వద్ద ఉన్న మండపంలో ఉన్న దుర్గా దేవి అమ్మవారు శరన్నవరాత్రులు సందర్భంగా తొమ్మిది రోజులు పూజలు అందుకొని ఆదివారం సాయంత్రం భవానిలు, భక్తులు, గ్రామ ప్రజలు నడుమ భక్తి పాటలతో మహిళలు చిన్నారులు , భవానీలు నృత్యములతో అమ్మవారిని రుద్రం కోట గ్రామములో ఊరేంగించుతూ పుణ్యనది అయిన పవిత్ర గోదావరిలో దుర్గాదేవి అమ్మవారిని నిమజ్జం చేయటం జరిగినది. ఈ కార్యక్రమం లో భవానీలు, గ్రామ ఉప సర్పంచ్ గుద్దేటి. పావని, గ్రామ ప్రజలు పాల్గున్నారు. పోలీస్ సిబ్బంది నుండి హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు ఎటువంటి ఆటంకాలు జరగకుండా బందోబస్తు నిర్వహించడం జరిగినది.

# కరకట్టలో పోలీస్ బందోబస్తు మధ్య అమ్మవారి ఊరేగింపు

కైకలూరు అక్టోబర్ 5 (ప్రభాతవార్త): కైకలూరు పట్టణంలోని కరకట్ట నందు దసరా మహోత్సవాలు ముగింపులో భాగంగా శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు భారీ పోలీసు బందోబస్తు మధ్య జరిగింది. ఇటీవల దానగూడెంలో జరిగిన సంఘటనపై ముందస్తు జాగ్రత్తగా కైకలూరు టౌన్ పోలీసులు అప్రమత్తమై డ్రోన్ కెమెరాలు ఏర్పాటుచేసి ఆర్మీ బలగాలతో కఠినమైన బందోబస్తు నిర్వహించారు. ఒకే రోజు వైయస్సార్ కాలనీలో అమ్మవారు ఊరేగింపు మరోపక్క దాన గూడెంలో గొంతానమ్మ పండుగ ఉండటంతో ఏలూరు డి.ఎస్.పి పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కైకలూరు రూరల్ సీఐ వి రవికుమార్ పర్యవేక్షణలో కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట్ కుమార్ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ వెంకట్ కుమార్ మాట్లాడుతూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు విగాదం కలిగించాలని చూస్తే వారి పైన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఇటీవల జరిగిన సంఘటనపై పోలీసులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు డ్రోన్ కెమెరాలు, భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంపై పట్టణ ప్రజలు పోలీసులను అభినందించారు.

# ఉపాధ్యాయుల వల్లే ఉత్తమ సమాజం....

భర్తీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు. వన్ క్లాస్, వన్ టీచర్ విధానంలో విద్యా సంస్కరణలకు లోకేష్ శ్రీకారం చుట్టారన్నారు. గత వైసిపి పాలనలో జగన్ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించాడన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఉపాధ్యాయులకు మద్యం షాపుల వద్ద డ్యూటీలో వేసి వేధించిందన్నారు. నాడు జగన్ చేసినట్టు మరుగుదొడ్ల ఫోటోలు తీసి అప్లోడ్ చేసే పని నేడు ఉపాధ్యాయులకు లేదన్నారు. రాజమండ్రి ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం రిటైర్డ్ వైస్ ఛాన్సర్ ఎం ముత్యాల నాయుడు మాట్లాడుతూ మంత్రి రామానాయుడు చేపడుతున్న సేవా కార్యక్రమాలతో పాటు మంత్రిగా పనితీరును ప్రశంసించారు. ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోకూటమి నాయకులు మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కూటమి శ్రేణులు , ప్రజలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి రామానాయుడు విందు ఏర్పాటు చేశారు.

# బాలత్రిపుర సుందరి అమ్మవారి గ్రామోత్సవం



భీమవరం అక్టోబర్ 5 ప్రభాతవార్త : భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, స్థానిక మహిళా భక్తులచే కోలాట ప్రదర్శనలు, బాణాసంచా కాల్పుల నడుమ అమ్మవారిని పురవీధులలో ఊరేగించినట్లు ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, ఏర్పాట్లను పర్యవేక్షించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 9 నుండి 16వ తేదీ వరకు తపాలా వారోత్సవాలు

భీమవరం అక్టోబర్ 5ప్రభాతవార్త : శ్రీవిజ్ఞాన వేదిక, భీమవరం పోస్టల్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈనెల 9వతేదీ నుండి 16వ తేదీ వరకు భారతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను భీమవరం హెడ్ పోస్ట్ ఆఫీస్ లో శనివారం హెడ్ పోస్ట్ మాస్టర్ పోలమూరి రాజు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో తపాలా శాఖ ఎంతో కీలకమైనదని, పోస్టల్ శాఖలో ఉన్న అనేక పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ ఏపీవో లెనిన్ బాబు మాట్లాడుతూ పోస్టల్ శాఖ ద్వారా అందించే పలు రకాల సేవలను గురించి వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వారం రోజులపాటు తపాలా శాఖ కార్యకలాపాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# భీమవరం లోనేడే స్వచ్ఛతా అవార్డులు కార్యక్రమం



కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.

భీమవరం అక్టోబర్ 5ప్రభాతవార్త :స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర జిల్లా స్థాయి అవార్డులను అక్టోబర్ 6న అందజేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు ఒక రాష్ట్ర స్థాయి అవార్డును, 49 జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. రేపు రాష్ట్రస్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదగా రాష్ట్రస్థాయి అవార్డును ప్రధానం చేయడం జరుగుతుందని, అలాగే జిల్లా స్థాయిలో అక్టోబర్ 6న భీమవరం జిల్లా కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ నందు సాయంత్రం నాలుగు గంటలకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 49 స్వచ్ఛత అవార్డులను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొననున్నట్లు తెలిపారు. అవార్డులు పొందిన అన్ని శాఖల అధికారులు, అవార్డు గ్రహీతలు హాజరై అవార్డులను స్వీకరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.

# వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు

## ఫారెస్ట్ రేంజర్ కె రామలింగా చార్యులు

కైకలూరు అక్టోబర్ 5 (ప్రభాతవార్త): వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దని కైకలూరు అటవీశాఖ రేంజర్ కే రామలింగా చార్యులు కోరారు. ఆదివారం మండలంలోని కొల్లేటికోట బీట్ పరిధి పందిరిపల్లి గూడెంగ్రామంలో డిఆర్ఓ రంజిత్ ఆధ్వర్యంలో వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్ఆర్ఓ రామలింగాచార్యులు, రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే యేసు రాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ వన్యప్రాణలను వేటాడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద 1972 ప్రకారం శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. వన్యప్రాణులు సంరక్షణ మరియు పక్షుల సంరక్షణ, వాటిని సంరక్షించే కార్యాచరణ గురించి,ప్లాస్టిక్ ని ఉపయోగించడం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. రొయ్యల చెరువులో ఉపయోగించేటువంటి యాంటీబయోటిక్స్ ఫెస్టిసైడ్స్ గురించి వాటి వల్ల జరిగే అనర్థాలు గురించి,ప్లాస్టిక్ వల్ల కొల్లేరు నీరు ఎంతో కలుషితం అయిందని పేర్కొన్నారు. వన్యప్రాణులను ఎలా సంరక్షించుకోవాలో వాళ్ళందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది. గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కోలాహలంగా అమ్మవారి ఊరేగింపు వెయ్యి మందికి అన్నదానం



కైకలూరు అక్టోబర్ 5 (ప్రభాతవార్త) : కైకలూరు పట్టణం కరకట్ట కాలనీ నందు దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగింపు సందర్భంగా దాతల సహకారంతో ఆదివారం వెయ్యి మందికి అన్నదానం చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గత నెల 22 నుంచి ఈనెల 2వ తేదీ వరకు కరకట్ట నందు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపారు. అమ్మవారికి భక్తులు అడుగడుగునా హారతులు ఇచ్చి, పసుపు నీరు వారబోసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. ఎటువంటి డీజేలు లేకుండా సాంప్రదాయ బద్ధంగా తీన్మార్ దప్పులతో అమ్మవారి గ్రామోత్సవం ముందుకు సాగింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రులు ప్రతి ఏడాది లాగానే ఘనంగా పూజలు నిర్వహించి దాతల సహకారంతో అన్నదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సత్తెమ్మ తల్లి యూత్ వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతం







మొగల్తూరు ప్రభాతవార్త : మొగల్తూరు ప్రభాతవార్తమొగల్తూరు మండలంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ సత్తెమ్మ తల్లి యూత్ వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు పురస్కారాలు అందజేశారు ప్రభుత్వ విప్ మరియు నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ యువతలో క్రీడాపట్ల ఉన్న ఆసక్తి అభినందనీయమని, ఇలాంటి క్రీడా పోటీలు యువత శారీరకంగా, మానసికంగా పటిష్టంగా మారేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు హాజరై పోటీలు విజయవంతంగా సాగేందుకు సహకరించారు.

# ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు మార్గదర్శకులు.



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 18 మంది రిటైర్డ్ ఉపాధ్యాయులు, వివిధ హైస్కూల్లోని ఉపాధ్యాయులను సత్కరించామని తెలిపారు. యిర్రింకి సూర్యారావు, వబిలిశెట్టి రామకృష్ణ, భూపతిరాజు బుజ్జిరాజు, విజ్జురోతి రాఘవులు, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం అక్టోబర్ 5 ప్రభాతవార్త : ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు మార్గదర్శకులుగా ఉండాలని, వారి పిల్లలు ఏ రంగంలో రాణిస్తారో ముందుగా తెలియజేయాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల, పాఠశాల హైస్కుల్లోని 18 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రాచీనకాలం నుంచి సమాజానికి గురువులే ఆదర్శ మూర్తులని, విద్యార్థి భవిష్యత్ కు గురువులే పునాది రాళ్ళు అని అన్నారు. గురువులు విద్యా బోధనలతో తమ విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపుతారనే నమ్మకంతో తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి పంపుతారని, గురువులు చేసిన త్యాగానికి, సేవలను సమాజం ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు తమ విద్యా బోధనతో సమాజంలో మార్పు తెచ్చి సమసమాజ స్థాపనకు కంకణ బద్ధులు కావాలని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అంతర్జాతీయ

# వరి సాగుపై శిక్షణ మరియు సందర్శన కార్యక్రమం





పెనుమంట్ర–ప్రభాతవార్త : మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నందు శిక్షణ మరియు సందర్శన కార్యక్రమం ఇంచార్చ్ ఎడిఆర్ డా.బి.సహదేవ రెడ్డి అధ్యక్షత జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వర రావు విచ్చేసారు. ఈ సందర్భంగా డా.బి.సహదేవ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సార్వా లో సాగుచేస్తున్న పి.ఆర్ 126 రకం కోతలు జరుగుతుండగా, మిగిలిన ప్రాంతాలలో పిలకలు కట్టే దశనుండి చిరుపొట్ట దశలో ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం చాలా ప్రాంతాలలో ఆరోగ్యంగా ఉండగా, అక్కడక్కడా ఆకు ముడుత, బాక్టీరియా ఆకు ఎండు తెగులు, దోమ పోటు ఆశించినట్లుగా గుర్తించామని తెలిపారు. డా.ఎం.గిరిజారాణి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం మీద ఈ సంవత్సరం వరి విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. దాళ్వా రకాలైన ఎం.టి.యు 1293, ఎం.టి.యు 1282 రకాలు నవంబర్ నెలాఖరుకల్లా రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరో చిరు సంచి రకం ఎం.టి.యు 1426 కూడా కొద్ది మొత్తంలో రైతులకు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకు వారి డివిజన్ లలో సాగుచేస్తున్న చిరుసంచి రకాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటి పనితీరు శాస్త్రవేత్తలకు తెలియజేయాలని కోరారు. తదుపరి జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ లో జిల్లాలో 2.12 లక్షల ఎకరాలలో వరి సాగు అయ్యిందని, జిల్లా మొత్తం మీద ప్రస్తుతానికి పంట చాలా ఆరోగ్యంగా ఉన్నదని తెలిపారు. తాడేపల్లిగూడెం డివిజన్ లో సుమారు 5000 ఎకరాలలో వరి తరువాత మినుము సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డా.ఎం.వి.కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త (విస్తరణ విభాగం) వారు సమన్వయకర్తగా వ్యవహరించి కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు.


# ఐక్యతను చాటిన నాటి తారల నేటి కలయిక

దక్షిణ భారత సినిమా పరిశ్రమలో ప్రతి సంవత్సరం ఎంతో అద్భుతంగా జరిగే" అక్టోబర్ 4, 2025న చెన్నైలో జరిగింది. మూడు సంవత్సరాల విరామం తర్వాత జరిగిన ఈ సమావేశం, అందరికీ అద్భుతమైన ఎమోషనల్ మూమెంట్‌గా నిలిచింది. గతేడాదే నిర్వహించాలనుకున్నా, చెన్నైలో జరిగిన భారీ వర్షాలు,



వరదల కారణంగా ఆ రీయూనియన్ వాయిదా పడింది. ఈసారి ఆ వేడుక స్నేహం, ఐక్యత, హృదయపూర్వకమైన సమావేశం విజయవంతంగా జరిగింది. రాజ్‌కుమార్ సేతుపతి, శ్రీప్రియ దంపతులు తమ ఇంట్లోనే ఈ రీయూనియన్‌ను ఆతిథ్యం ఇచ్చారు. లిస్సీ లక్ష్మి, పూర్ణిమ భగ్యరాజ్, ఖుష్బూ సుందర్, సుహాసిని మణిరత్నం ఈ కార్యక్రమాన్ని కోఆర్డినేట్ చేశారు. ఇంటి ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ సమావేశం, ఆ తారల మధ్య ఉన్న నిజమైన అనుబంధాన్ని ప్రతిబింబించింది. మొత్తం 31 మంది నటులు ఈ రీయూనియన్‌లో పాల్గొన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు హిందీ పరిశ్రమ నుండి కూడా స్టార్స్ వచ్చారు. సాయంత్రం అంతా నవ్వులు, జ్ఞాపకాలు, అనుభవాలు పంచుకుంటూ ఆత్మీయంగా గడిచింది. 80ఎస్ స్టార్స్ రీయూనియన్ గురించి మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశారు. 80ఎస్ స్టార్స్ రీయూనియన్ స్నేహితులతో ప్రతి రీయూనియన్ మధుర జ్ఞాపకాల వీధిలో ఒక నడకలా ఉంటుంది. నవ్వులు, ఆప్యాయత, పాత జ్ఞాపకాలు తలుచుకుంటూ ఆనందం, ప్రేమతో గడుస్తుంది. ఎన్ని సార్లు కలిసినా, ప్రతి సారి కొత్తగా, మొదటిసారి కలిసినట్టే సంతోషంగా అనిపిస్తుంది' ఈసారి ఇది ఉత్సవం కాదు" అని సుహాసిని మణిరత్నం అన్నారు. ఇది సంవత్సరాలుగా పరిచయమైన స్నేహితుల కలయిక ఒకరికొకరు మద్దతుగా ఉండటానికి, కృతజ్ఞత తెలిపేందుకు," అని లిస్సీ లక్ష్మి తెలిపారు. ఇలా ప్రతి ఏడాది జరిగే ఈ 80ఎస్ రీయూనియన్ స్నేహం, ఐక్యత, భిన్నత్వంలో ఏకత్వం విలువలకు ప్రతీకగా నిలుస్తోంది.

## శ్రేష్ట్ మూవీస్ 'ఆర్యన్ 'గ్రాండ్ రిలీజ్



విష్ణువిశాల్ డార్క్ అండ్ సస్పెన్స్ ఫుల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఆర్యన్ అక్టోబర్ 31న శ్రేష్ట్ మూవీస్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన హీరో విష్ణు విశాల్, విష్ణు విశాల్ స్టూడియోస్, శుభ్ర ఆర్యన్ రమేష్ లతో కలిసి నిర్మించిన 'ఆర్యన్' అనే గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. మేకర్స్ ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చింది. ఆర్యన్ చిత్రం అక్టోబర్ 31న విడుదల కానుంది. హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో శ్రేష్ట్ మూవీస్ ద్వారా విడుదల చేయనున్నారు. అనేక బ్లాక్ బస్టర్లను అందించిన ప్రొడక్షన్ , డిస్ట్రిబ్యూషన్ బ్యానర్ మద్దతుతో ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ గతంలో విక్రమ్, అమరన్, థగ్ లైఫ్ వంటి చిత్రాలను విడుదల చేశారు. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. విష్ణు విశాల్ ఫైర్ చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. హరీష్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, గిబ్రాన్ సంగీతం, శాన్‌లోకేషన్ డిటర్. ట్రైలర్, ఆడియోలాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్‌లు త్వరలో అనౌన్స్ చేస్తారు. తారాగణం: విష్ణు విశాల్, సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానసచౌదరి, నిర్మాణం, విష్ణు విశాల్ (విష్ణు విశాల్ స్టూడియోస్)దర్శకత్వం: ప్రవీణ్ కె, నిర్మాతలు : శుభ్ర, ఆర్యన్ రమేష్, విష్ణు విశాల్

# మిరాయ్ టీమ్‌ను అభినందించిన దిల్‌రాజు

సూపర్‌హీరో తేజా సజ్జా బాక్సాఫీస్ వద్ద విజయయాత్ర కొనసాగిస్తున్నారు. ఆయన తాజా చిత్రం మిరాయ్ ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన కలెక్షన్ తో దూసుకెళ్తోంది. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ సీజన్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. తాజాగా ప్రముఖ నిర్మాత దిల్ రాజు మిరాయ్ టీంని అభినందించారు. మిరాయ్ సినిమా విజయాన్ని పురస్కరించుకొని సూపర్‌హీరో తేజసజ్జా కోసం తమ ఇంట్లో ఆత్మీయంగా ఒక వేడుక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తేజసజ్జాతో పాటు డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. ఇది అభిమానం, అభినందనలతో కూడిన ఒక అద్భుతమైన సందర్భంగా నిలిచింది. మిరాయ్ ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్ లో 150 కోట్లు పైగా వసూలు చేసింది. నార్త్ అమెరికాలో 3 మిలియన్ డాలర్ల మార్క్‌ని దాటింది. రితికా నాయక్ హీరోయిన్‌గా, మనోజ్ మంచు, శ్రీయా శరణ్ ముఖ్యపాత్రల్లో నటించిన ఈ చిత్రం, యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ప్రెజెంటేషన్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం మిరాయ్ థియేటర్స్‌లో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది .



# సైకోమైథలాజికల్ థ్రిల్లర్'అరి'




ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. లింగ గుణపనేని కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ఖిమై నేమ్ ఈజ్ నో బడీఖి అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "పేపర్ బాయ్" చిత్రంతో ప్రతిభావంతమైన దర్శకుడుగా పేరు తెచ్చుకున్న జయశంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఖఅరి సినిమా ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10వ తేదీన వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. సైకలాజికల్, మైథలాజికల్ ఎలిమెంట్స్ కలిసి ఓ డిఫరెంట్ థ్రిల్లర్ మూవీగా అరిఉండబోతున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఒక లైబ్రరీ, అక్కడ రివీల్ అయ్యే ఏడు జీవితాలను ఆసక్తికరంగా ట్రైలర్ లో చూపించారు. అరి సినిమా ట్రైలర్ ఎలా ఉందో చూస్తే భూలోకంలో జన్మించాలని శ్రీకృష్ణుడు సంకల్పించగానే ఆ విషయం స్వర్గ లోకంలో తెలిసి ఆరుగురు దేవతలు తమనూ భూలోకం తీసుకెళ్లమని శ్రీకృష్ణుడిని వేడుకున్నారు, అవే అరిషడ్వర్గాలు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు..ఖి అనే డైలాగ్ తోఖఅరి సినిమా ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఇక్కడ అందరి కోర్కెలు తీర్చబడును అని ఓ యూనివర్సిటీ లైబ్రరీ నుంచి వెలువడిన ప్రకటన చూసి సినిమాలోని ప్రధాన పాత్రధారులు వచ్చి తమ కోర్కెలు చెబుతుంటారు. ఈ ప్రపంచంలో మనషులందరిలో ఉండే అరిషడ్వర్గాలకు వారి కోర్కెలు ప్రతీకలుగా కనిపిస్తాయి. ఈ పాత్రధారుల నేపథ్యం ఏంటి ?, అందరి కోర్కెలు తీర్చే బాధ్యతను తీసుకున్నది ఎవరు ?,ఎందుకు ?, తన దగ్గరకు వచ్చే వారికి ఆయన ఇచ్చే టాస్క్‌ ఏంటి ? అనేది థియేటర్స్ లో చూడాల్సిందే. పరిత్రాణాయ సాధూనాం.. అనే భగవద్గీత శ్లోకంతో ట్రైలర్ ఆసక్తికరంగా పూర్తవుతుంది. నటీనటులు వినోద్ వర్మ , అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్, వైవా హర్ష, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర, శుభలేక సుధాకర్, సురభి ప్రభావతి, అక్షయా శెట్టి, రిధిమా పండిట్, పి.అనిల్ కుమార్, నవీనా రెడ్డి, తమిళ బిగ్ బాస్ ఫేమ్ పావని రెడ్డి, జెమినీ సురేష్, ఐ డ్రీమ్ అంజలి, మనిక చిక్కాల, సుమన్, ఆమని, ప్రవళ్లిక చుక్కల, సురభి విజయ్, బ్యాంకు శ్రీనివాస్, సమీర్, మాణిక్ రెడ్డి, రాజ్ తిరందాస్, గాయత్రి భార్గవి, మీనా కుమారి, లావణ్య రెడ్డి, ఇంటూరి వాసు, జబర్దస్త్ సద్దాం, నీలా ప్రియ, యోగి ఖత్రి తదితరులు టెక్నికల్ టీమ్ మ్యూజిక్ : అనుప్ రూబెన్స్ ఎడిటర్ : జి. అవినాష్‌లిరిక్స్ : కాసర్ల శ్యాం, వనమాలి, కళ్యాణ్ చక్రవర్తి, కొరియోగ్రఫీ భాను, జీతుప్రొడక్షన్ డిజైనర్ : రాజీవ్ నాయర్‌స్టైలిస్ట్ : శ్రీజ రెడ్డి చిట్టిపోలు, సిరి చందనసినిమాటోగ్రఫీ : కృష్ణ ప్రసాద్.

# 'హైలెస్సో' పవర్‌ఫుల్ ఫస్ట్‌లుక్



సుడిగాలి సుధీర్‌గా అందరికీ సుపరిచితుడైన సుధీర్ ఆనంద్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరోగా ఐదవ చిత్రం. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ విలన్‌గా కనిపించబోతున్నారు. దసరా సందర్భంగా సుధీర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఇంటెన్స్ అండ్ డివైన్ వైబ్ తో వున్న పోస్టర్ అదిరిపోయింది. ఫస్ట్‌లుక్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటించగా, ప్రముఖ కన్నడ నటి అక్షరగౌడ కీలక పాత్రలో కనిపించనున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. యంగ్ అండ్ టాలెంటెడ్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. అనుదీప్ దేవ్ సంగీతం అందించగా, సుజాత సిద్ధార్థ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఎడిటర్‌గా చోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి, చింతా శ్రీనివాస్ రైటర్. హై లెస్సో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.

తారాగణం: సుధీర్ ఆనంద్, శివాజీ, నటాషా సింగ్, నక్ష శరణ్, అక్షర గౌడ, మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య.

# 'ఓ చెలియా' నుండి మెలోడీ పాట విడుదల



అందమైన ప్రేమ కథలకు ఆడియెన్స్ నుంచి ఎప్పుడూ సపోర్ట్ లభిస్తూనే ఉంటుంది. ఓ అద్భుతమైన ప్రేమ కథతో ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవీ ప్రొడక్షన్స్ బ్యానర్ల మీద రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్న చిత్రం ఓ చెలియా. నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని ఎం. నాగ రాజశేఖర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు.

ఇప్పటికే సినిమాకు సంబంధించిన పోస్టర్లు, గ్లింప్స్, సాంగ్స్, టీజర్ ఇలా అన్నీ కూడా సోషల్ మీడియాలో బాగానే ట్రెండ్ అయ్యాయి. ఇక తాజాగా మరో మెలోడీ సాంగ్‌ను టీం రిలీజ్ చేసింది. హీరోనవీన్ చంద్ర చేతులు మీదుగా కొంచెం కొంచెంగా అంటూ సాగే మెలోడీ పాటను టీం విడుదల చేయించింది. ప్రస్తుతం ఈ పాట శ్రోతల్ని ఎంతో ఆకట్టుకుంటోంది. ఎంఎం కుమార్ బాణీ వినడానికి ఎంతో శ్రావ్యంగా ఉంది. సుధీర్ బగాడి సాహిత్యం అయితే అందరికీ అర్థమయ్యేలా ఉంది. వాగ్దేవి, మనోజ్ పాడిన ఈ యుగళ గీతం, వారి గాత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ లిరికల్ వీడియోని చూస్తుంటే హీరో హీరోయిన్ల మధ్య ఎంత ఘాడమైన ప్రేమ అల్లుకుని ఉందో అర్థం అవుతోంది. ఇక ఈ పాటను రిలీజ్ చేసిన అనంతరం హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, ఓ.. చెలియా నుంచి మంచి మెలోడీ సాంగ్‌ను రిలీజ్ చేశాను. కొంచెం కొంచెంగా అంటూ సాగే ఈ పాట అందరినీ ఆకట్టుకునేలా ఉంది. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

## ఓంకార్ రాజుగారి గది 4 'శ్రీచక్రం" అనౌన్స్‌మెంట్

మిరాయ్ భారీ విజయం తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మరో సినిమాటిక్ స్పెక్టికల్ రాజుగారి గది 4: "శ్రీచక్రం"తో రెడీ అవుతోంది. రాజుగారి గదిని కల్ట్ హారర్‌కామెడీ ఫ్రాంచైజీగా మార్చిన విజనరీ ఫిల్మ్ మేకర్ ఓంకార్ దర్శకత్వం వహిస్తున్న ఈ నాల్గవ భాగం ఈ సిరీస్‌ను నెక్స్ లెవల్ కి తీసుకెళ్లనుంది. దసరా శుభ సందర్భంగా ఈరోజు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని అనౌన్స్ చేసింది.



అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ఎర్రటి చీరలో ఒక మహిళ, ఉగ్రమైన, దైవిక కాళిని గుర్తుచేసే దేవత విగ్రహం ముందు ఎగురుతోంది. ఈ అద్భుతమైన ఇమేజరీ పవిత్రమైన, అతీంద్రియాల మధ్య సాగే చిత్రానికి టోన్ సెట్ చేస్తుంది. "ఎడివైన్ హర్రర్ బిగిన్స్" అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో శ్రీచక్రం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది. గ్రాండ్ విజువల్స్, ఎస్ఎస్ థమన్ పవర్ ఫుల్ మ్యూజిక్, ఓంకార్ సిగ్నేచర్ స్టోరీ టెల్లింగ్‌తో, శ్రీచక్రం యూత్, కుటుంబ ప్రేక్షకులను అలరించే మాస్ థియేట్రికల్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది. పురాణ విశ్వాసాలు, హిడెన్ సీక్రెట్స్, మరచిపోయిన వారసత్వాలపై ఆధారంగా రూపుదిద్దుకున్న డివైన్ హారర్‌కామెడీ శ్రీచక్రం. ప్రత్యేకమైన అనుభూతిని అందించేందుకు ఈ చిత్రం సిద్ధమైంది. ఇది ఆధ్యాత్మిక యాత్రలా సాగుతూ, మిస్టిసిజంతో నిండి, సస్పెన్స్ థ్రిల్స్, మాస్ హ్యూమర్ మూమెంట్స్ తో ఎంటర్‌టైన్ చేసే గొప్ప అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటర్. శ్రీ నాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్ కాగా, అజ్జు మహాకాళి డైలాగ్ రైటర్. ఆర్‌జిజి4 –శ్రీచక్రం భయపెట్టే క్షణాలు, నవ్వించే సన్నివేశాలు, భక్తి, భయం కలిసి మరచిపోలేని హారర్ అనుభవాన్ని ఇవ్వనుం ఎందుకంటే ఒకసారి 'శ్రీచక్రం' తెరుచుకున్నాక దాన్ని మూయడం అసాధ్యం. ఈ చిత్రం దసరా 2026కి థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'సీమంతం' టీజర్ రిలీజ్

'సిమంతం' టీజర్‌ను ప్రముఖ దర్శకుడు తేజ విడుదల చేశారు. ఇది ఓ క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది.

గర్భిణీ మహిళలపై హత్యలు. అనే మూడుతో కథ సాగనుందని టీజర్ సూచిస్తోంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం సుధాకర్ పాణి. వహించారు. వజ్రయోగి, శ్రేయ భారతి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాత ప్రశాంత్ టాటా, సహ నిర్మాత గాయత్రి సౌమ్య గుడిసేవ. సంగీతాన్ని ఎస్. సుహాస్ సమకూర్చారు. తేజ. మాట్లాడుతూ ,బీజీఎం, విజువల్స్ చాలా ఇంటెన్స్‌గా ఉన్నాయి. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ చాలా బాగా ఉన్నాయి అన్నారు. సినిమా త్వరలో విడుదల కానుంది, మూవీ: 'సిమంతం' మూవీ కాన్సెప్ట్ :సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్. తారాగణం హీరో : వజ్రయోగి ,హీరోయిన్ : శ్రేయభర్తీ తదితరులు. టెక్నికల్ టీం: డైరెక్టర్ : సుధాకర్ పాణి, బ్యానర్ : టీఅర్ డ్రీమ్ ప్రొడక్షన్స్ ప్రొడ్యూసర్: ప్రశాంత్ టాటా, సహ నిర్మాత: గాయత్రీ సౌమ్య గుడిసెవా, డీఓపీ : శ్రీనివాస్ విన్నకోట ఎడిటర్: అమర్ రెడ్డి ,మ్యూజిక్: ఎస్. సుహాస్‌ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: వీరవల్లి శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ : వీరవల్లి మురళికృష్ణ.



# ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'సంతాన ప్రాప్తిరస్తు'




యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ "సంతాన ప్రాప్తిరస్తు" మూవీతో స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ సింగర్‌గా మారారు. ఈ చిత్రంలో ఆయన అనుకుందొకటిలే. పాటను పాడటం విశేషం. "సంతాన ప్రాప్తిరస్తు" చిత్రంలో గర్భగుడి వెల్‌నెస్ సెంటర్ నిర్వహించే డాక్టర్ భ్రమరం పాత్రలో వెన్నెల కిషోర్ నవ్వులు పంచనున్నారు. తన దగ్గరకు చికిత్స కోసం వచ్చిన కథానాయకుడికి ధైర్యం చెబుతున్న సందర్భంలో డాక్టర్ భ్రమరం పాత్ర నేపథ్యంగా ౖఅనుకుందొకటిలే.. పాటను ఆకట్టుకునేలా రూపొందించారు. అనుకుందొకటిలే.. పాట ఎలా ఉందో చూస్తే అనుకుందొకటిలే అయ్యిందొకటిలే, అయిపోలేదులే, గేరే మార్చులే, భ్రమరం ఫార్ములా ఫెయిలే అవదులే, కళ్లే మూసుకో, నన్నే నమ్ముకో అంటూ వినోదాత్మకంగా సాగుతుందీ పాట. ఈ పాటను సునీల్ కశ్యప్ కంపోజ్ చేయగా, బాలవర్ధన్ లిరిక్స్ అందించారు. వెన్నెల కిషోర్ ప్రొఫెషనల్ సింగర్‌లా పాడి ఆకట్టుకున్నారు. విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. .

# 'డ్యూడ్' హై ఎనర్జీ ఫన్ ట్రాక్ సింగారి సాంగ్ రిలీజ్



వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పాన్ ఇండియా మూవీ డ్యూడ్‌తో అలరించడానికి రెడీ అవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. 'పేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. రీసెంట్‌గా విడుదలైన బూమ్ బూమ్, బాగుండు పో సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. మ్యూజిక్ ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ సింగారిసాంగ్‌ని రిలీజ్ చేశారు. ఈ పాటను స్వయంగా సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ స్వరపరచి పాడారు. ఎనర్జిటిక్ బీట్స్, క్యాచి లిరిక్స్, యూత్ ఎనర్జీ ఈ సాంగ్ ని ఒక ఫన్ ప్యాకేజ్‌లా మార్చేశాయి. రామజోగయ్య శాస్త్రి రాసిన ఆకట్టుకునే లిరిక్స్ సాంగ్‌కి అదనపు ఉత్సాహం తీసుకొచ్చింది. ఫన్ ఫుల్ గా వినిపించే ఈ ట్రాక్ అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రదీప్ అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో సాగే సన్నివేశాలు పాటకు మరింత మజాను తెచ్చాయి. సాయి అభ్యంకర్ తన ఫస్ట్ ఫీచర్ ఫిల్మ్ మ్యూజిక్ తోనే మంచి ఇంప్రెషన్ క్రియేట్ చేశాడు. ఇప్పటికే అన్ని భాషల యువతరంలో సాంగ్స్ పాపులర్ అవుతున్నాయి.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని నికేత్ బొమ్మి, ఎడిటర్ భరత్ విక్రమన్, ప్రొడక్షన్ డిజైనర్ లతా నాయుడు. డ్యూడ్ అక్టోబర్ 17న దీపావళి సందర్భంగా, తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# విజయ్ టివికెతో బిజెపి అవగాహన!

## సంయమనం పాటించాలంటూ సలహా



**చెన్నై, అక్టోబరు 4:** కరూర్ తొక్కిసలాట తర్వాత చిక్కుల్లో పడిన సినీ నటుడు, టివికే అధినేత విజయ్‌ను మచ్చిక చేసుకుని వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని లబ్ధి పొందాలని బిజెపి తహతహలాడుతోంది. ఇందులో భాగంగా కరూర్ ఘటనపై డిఎంకే ప్రభుత్వం టివికేని ఇబ్బంది పెట్టాలని చూస్తే తాము అండగా ఉంటామని బిజెపి సీనియర్ నాయకుడు ఒకరు విజయ్‌కి కబురు పంపించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కరూర్ ఘటనలో డిఎంకెని కూడా బాధ్యురాలిని చేయాలని తాము భావిస్తున్నామని, విజయ్ సంయమనం పాటించాలని ఆ నాయకుడు సూచించినట్లు వారు చెప్పారు. తన భవిష్యత్తు రాజకీయ ర్యాలీలపై సందిగ్ధంలో పడిన విజయ్‌ని తమ దారిలోకి తెచ్చుకుని ప్రజలలో ఆయనకు ఉన్న మాస్ ఇమేజ్ ద్వారా ఎన్నికల లబ్ధి పొందాలన్నది బిజెపి ఆలోచనగా కనిపిస్తోంది. కరూర్‌లో ఇటీవల జరిగిన ఘోర దుర్ఘటనపై శనివారం తీవ్ర విచారం వ్యక్తం చేసిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఈ ఘటనకు ఎవరు బాధ్యులో నిగ్గుతేల్చి, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై మద్రాసు హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను, చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని ఎక్స్ పోస్టులో స్టాలిన్ తెలిపారు. ఇదిలాఉంటే కరూర్‌లో విజయ్ ర్యాలీ దుర్ఘటనపై బిజెపి నేతలు కొంతమేర తటస్థవైఖరితో ఉండటాన్ని పరిశీలకులు గమనించారు. ఈ సంఘటనను అస్త్రంగా మలుచుకుని తమిళనాడులో టివికెతో అవగాహనకు వచ్చి డిఎంకెను ఓడించాలన్న లక్ష్యంతో బిజెపి అగ్రనేతలున్నట్లు తెలుస్తోంది. ఇందుకు తగినట్లుగానే బిజెపి మాజీ చీఫ్ అన్నామలై వ్యాఖ్యలు కూడా ఇటీవల అదే తరహాలో ఉన్నాయని నాయకులు చెపుతున్నారు. అయితే టివికెనుంచి ఇదే విషయమై ఎలాంటి స్పష్టత రాలేదు. ముందు విచారణ పూర్తి అయి నిర్దోషులుగా వచ్చిన తర్వాతనే ఎలాంటి వ్యాఖ్యలయినా చేయాలని పార్టీ సీనియర్ కేడర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు బిజెపి ఇంఛార్జ్‌గా నియమితులైన జయ్ పాండా ఈనెల 6న రాష్ట్ర పర్యటనకు రానున్నారు.

ఈ సందర్భంగా తమిళనాడులోని బిజెపి సీనియర్ నేతలు, పదాధికారులతో సమావేశం కానున్నారు. అటు, ఢిల్లీలో ఉన్న తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై.. కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన వివరాలు, దాని రాజకీయ ప్రభావంపై పార్టీ నాయకులకు నివేదిక ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేపై వ్యతిరేకత స్పష్టంగా ఉంటుందని భావిస్తోన్న బీజేపీ విపక్ష ఓట్ల చీలిపోకూడదనే వ్యూహంతో టివికెపై దృష్టి సారిస్తున్నారు.




## నలుగురి హత్యలపై న్యాయవిచారణ జరపాలి

### లేదంటే నేను జైలులోనే కొనసాగేందుకు సిద్ధమే!

### పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్

**లేహ్, అక్టోబరు 5:** లడఖ్‌కు రాష్ట్రహోదాకోసం డిమాండ్ చేస్తూ ఇటీవల లేహ్ ప్రాంతంలో జనం నిరసనలకు దిగగా అల్లర్లు చెలరేగాయి. ఆ అల్లర్లలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 90 మందికి పైగా గాయపడ్డారు. దాంతో లధఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన జైలు నుంచి ఓ సందేశంపంపారు. లధఖ్ ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై స్వతంత్ర్య దర్యాప్తు జరిపించాలని, లేదంటే తాను జైల్లోనే ఉండిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని వాంగ్‌చుక్ తన సందేశంలో హెచ్చరించారు. కాగా, వాంగ్‌చుక్ ప్రస్తుతం జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. సోదరుడు కాత్సే తాన్ డోర్జే లేతో పాటు న్యాయవాది ముస్తఫా హాజీలు ఆయనను కలిసిన సందర్భంగా ఈ సందేశాన్ని పంపారు. తాను శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నానని, తన కోసం ప్రార్థిస్తున్న వారికి ధన్యవాదాలు అని తన సందేశంలో వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నానని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాననిఅన్నారు. నలుగురి హత్యలపై న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. లేదంటే తాను జైలులోనేఉండేందుకు సిద్ధంగా ఉన్నాననిచెప్పారు. లధఖ్‌కు రాష్ట్రహోదా కోసం ప్రజలు, లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్‌చేస్తున్న డిమాండ్‌లకు మద్దతిస్తున్నానని పేర్కొన్నారు. ఈసందర్భంగా శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్నారు. అహింసా మార్గంలోనే మన పోరాటాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ప్రజలకు సూచించారు. కాగా సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే లేహ్‌లో ఆందోళనలు జరిగాయని ఆరోపించిన కేంద్రం జాతీయ భద్రతాచట్టం కింద ఆయనను అరెస్ట్ చేయించింది. ఈ చట్టం కింద అరెస్టయిన వ్యక్తిని విచారణ చేయకుండా 12 నెలలపాటు నిర్బంధించేందుకు చట్టం అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే తన భర్తను విడుదల చేయాలంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జే ఆంగ్మో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది.

## కోళ్లు, గొర్రెల వివరాలు అడగవద్దని చెప్పా

### కుల గణనపై కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్

**బెంగళూరు, అక్టోబరు 5:** కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కులగణన పూర్తి కావడానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉండడంతో.. అధికారులు సర్వేను మరింత వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కులగణనకు వెళ్లే అధికారులకు ముందే తాను పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలను వారికి ఎన్ని కోళ్లు, గొర్రెలు, మేకలున్నాయి? ఎంత బంగారం ఉందనే వ్యక్తిగత ప్రశ్నలు, వివరాలు అడగవద్దని సూచించానన్నారు. సర్వే చేస్తున్న సమయంలో ప్రజలు పంచుకోలేని వ్యక్తిగత ప్రశ్నలు అడగవద్దని చెప్పినట్లు తెలిపారు. కానీ సర్వే నిర్వహించే అధికారులు స్వతంత్ర కమిషన్‌కు చెందిన వారు కాబట్టి.. ఆ సమయానికి వారు ఏమి చేస్తున్నారో తెలియదన్నారు.

రూ. 420 కోట్ల అంచనా వ్యయంతో నిర్వహిస్తున్న ఈ సర్వేలో 60 ప్రశ్నల ప్రశ్నాపత్రం ఉందని.. అందులో అడిగే అన్ని ప్రశ్నలకు కచ్చితంగా సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని శివకుమార్ అన్నారు. సమాధానం చెప్పడం ఇష్టం లేకపోతే అధికారులు వారిని బలవంతం చేయకూడదని కోర్టు సైతం పేర్కొన్నట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన అభ్యంతరాలను, ఖర్చును ప్రస్తావిస్తూ, ఎవరు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కులగణనను పూర్తి చేస్తామన్నారు.

2015లో కర్ణాటక వెనకబడిన వర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలోనే ఆమోదించింది. నిపుణలు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాష్ట్రంలో మరోసారి కులగణనను చేపట్టింది. సెప్టెంబరు 22న ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 7న ముగియనుంది.




## దగ్గుమందు తాగి 11 మంది చిన్నారుల మృతి

### చీటీ రాసిన డాక్టరు అరెస్టు

**భోపాల్, అక్టోబరు 5:** మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో 11 మంది చిన్నారుల మృతికి కారణమైన దగ్గుమందు రాసిన డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగిన పక్షంరోజుల్లోనే చిన్నారులు కిడ్నీ ఫెయిల్ అయి మృతిచెందారు. ఈనేపథ్యంలో కాఫ్ సిరప్‌సూచించిన డాక్టర్ ప్రవీణ్‌సోనీని పరాసియా ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు ఆదివారం ప్రకటించారు. ప్రభుత్వ డాక్టర్ అయిన ప్రవీణ్ చింద్వారాలో ప్రైవేట్ క్లినిక్ నడుపుతున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం తన వద్దకు వచ్చిన చిన్నారులకు ఆయన కోడ్రిఫ్ సిరఫ్‌ను సూచించారు. దీంతో 11మంది చిన్నారులు అస్వస్థతకు గురై మరణించారు. ఈ నేపథ్యంలో కోల్డ్రిఫ్‌సిరప్‌అమ్మకాలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. డాక్టర్‌పై కేసునమోదుచేసిన పోలీసులు అదుపులోకి తీసుకుంది. ఆసిరప్‌ను ఉత్పత్తి చేస్తున్న శ్రీసన్ ఫార్మా స్యూటికల్స్‌పై ప్రభుత్వం కేసు నమోదుచేసింది. ఈ డ్రగ్ కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలతో కలుషితమైనట్లుగా అనుమానిస్తున్నారు.

## మణిపూర్‌లో ప్రభుత్వ పునరుద్ధరణకు బీరేన్‌సింగ్ కసరత్తు

**ఇంఫాల్,అక్టోబరు 5:** మణిపూర్ మాజీ సిఎం బీరేన్ సింగ్ నేతృత్వంలో బిజెపి ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాంవేశారు. ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్న ఆరాష్ట్రంలో ప్రభుత్వం పునరుద్ధరణ కోసం ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తెచ్చేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. బిజెపి ఎమ్మెల్యేలు హెచ్ డింగో, రాబిన్‌ద్రో, ఎస్ రంజన్, మాజీ మంత్రి గోవిందాస్ కొంథోజామ్, హిల్ ఏరియాస్ కమిటీ చైర్మన్ డింగాంగ్లంగ్ గంగ్మేయ్ ఈబృందంలో ఉన్నారు. హోంమంత్రి అమిత్ షా, జెపినడ్డా, ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రధాని బిజీ షెడ్యూల్ దృష్ట్యా ఆయనను వారు కలుస్తారా లేదా అన్నది సందేహంగా ఉన్నది. కాగా, బిజెపి కేంద్ర నాయకత్వాన్ని కలవడం, మణిపూర్‌లో కొత్తప్రభుత్వాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేయడం లక్ష్యంగా తాము ఢిల్లీకి చేరినట్లు బీరేన్‌సింగ్ తెలిపారు. రెండేళ్లుగా జాతి హింసతో ఆ రాష్ట్రం రగిలిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. మరోవైపు ఆగస్టులో పార్లమెంటు ఆమోదంతో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలల పాటు కేంద్రం పొడిగించింది. అయితే ఆ రాష్ట్రం కేంద్ర పాలనలో ఉన్నప్పటికీ అసెంబ్లీని రద్దు చేయలేదు. అసెంబ్లీని సస్పెన్షన్‌లో ఉంచారు.


## పాక్‌తో భారత్‌కు ఇబ్బందికలిగే ఒప్పందమేమీ రష్యాకులేదు!

### క్రెమ్లిన్ ప్రతినిధి వెల్లడి

**మాస్కో, అక్టోబరు 5:** ఫైటర్ జెట్ ఇంజిన్ల సరఫరా, తయారీకోసం పాకిస్తాన్‌తో రష్యా ఒప్పందం జరిగిందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని నిజానికి పాకిస్థాన్‌తో అలాంటి ఒప్పందమేదీ చేసుకోలేదని భారత్‌కు ఇబ్బందికరంగా అనిపించేంత పెద్ద ఒప్పందాలను తాము ఆదేశంతో చేసుకోలేదని రష్యా స్పష్టం చేసింది. భారత్‌కు ఇబ్బందికరంగా మారే చర్యలు తాము చేపట్టబోమని స్పష్టం చేసింది.

పాకిస్థాన్‌తో అలాంటి ఒప్పందం జరిగినట్లు ఎలాంటి ఆధారం లేదు. రానున్న కొద్ది రోజుల్లో రష్యా, భారత్ మధ్య పెద్ద ఒప్పందాలు జరుగుతాయని విశ్లేషించే పరిశీలకులకు ఈ వార్తల్లో లాజిక్ కనిపించదు. భారత్ ఇబ్బందిగా ఫీల్ అయ్యేంత పెద్ద ఒప్పందం పాకిస్తాన్‌తో రష్యా చేసుకోలేదు. పాక్‌తో ఆ స్థాయి సహకారం లేదు. భారత్, రష్యాల మధ్య చాలా ఉన్నత స్థాయిలో పరిచయాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంలో ఇరు దేశాల సహకారాన్ని చెడగొట్టేలా ఎవరో ప్రయత్నాలు చేస్తున్నారని క్రెమ్లిన్ వర్గాలు చెప్పినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం రష్యా ఇంజిన్లను సరఫరా చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. పాక్‌లో ఉన్న చైనా తయారీ ఫైటర్ జెట్లలో వాడే ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందని పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ వార్తలు దేశంలో పొలిటికల్ హీట్‌ను పెంచాయి. ప్రభుత్వ వైఖరిపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాయి.

బిజెపిపై కాంగ్రెస్ తీవ్రవిమర్శలుచేసింది. ప్రధాని నరేంద్ర మోడీ రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపార భాగస్వామిగా చెబుతారని కానీ ఆ దేశం మన శత్రువుకు మద్దతునిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపణలు గుప్పించారు. మోడీది వ్యక్తిగతమైన దౌత్యం అని



ఎద్దేవాచేశారు. రష్యా, పాక్‌మధ్య ఒప్పందం ఇతర దేశాలతో సంబంధాల విషయంలో ప్రధాని వైఫల్యాన్ని సూచిస్తుందని మండిపడ్డారు. ఆయన జాతీయ ప్రయోజనాలకంటే తనకు పేరు వచ్చే విషయాలకే ప్రాధాన్యతనిస్తారని ఘాటుగా వ్యాఖ్యానించారు. రష్యా ఎందుకు పాక్‌కు సహకారాన్ని అందిస్తుందో ప్రభుత్వం చెప్పితీరాలన్నారు.

## భారీ వర్షాలకు విరిగిపడిన కొండచరియలు

### 17 మంది మృతి, మరికొందరికి గాయాలు



**డార్జిలింగ్, అక్టోబరు 5:** పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో మృతుల సంఖ్య 17కు చేరింది. వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. మరికొందరికి తీవ్ర గాయాలయినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు బాలసోన్ నదిపై దూదియా వద్ద సిలుగుడిమరిక్ ప్రాంతాలను కలిపే ఇనుప వంతెన కుప్పకూలింది. దాంతో రాకపోకలు నిలిచిపోయాయి. కలింపాంగ్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా పరిస్థితి దారుణంగా మారింది. 717 జాతీయ రహదారిపై కొండచరియలు విరిగి పడడంతో సిక్కిం–సిలిగురి మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. తీస్తా, మాల్ పర్వత ప్రాంత నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. భూటాన్‌లో భారీ వర్షాలతో బెంగాల్‌కు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది. ప్రజలందరూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు డార్జిలింగ్‌లోని పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు తూర్పు నేపాల్‌లోని కోషి ప్రావిన్స్‌లో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. ఇలామ్ జిల్లాలో ఐదుగురు మరణించగా పటేగాన్, మన్సేబుంగ్, డ్యామా, ధుసుని, రత్మాటే, ఘోసాంగ్ ప్రాంతాలలో మరో తొమ్మిది మంది మరణించారని అధికారులు తెలిపారు. సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుండటంతో హెలికాప్టర్లను రంగంలోకి దింపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు

## హమాస్ నిరాయుధీకరణలో వెనక్కితగ్గేదిలేదు

### ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు

**జెరూసలెం, అక్టోబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు హమాస్ పాక్షికంగా అంగీకరించిన మరుసటి రోజే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను నిరాయుధీకరణ చేసే విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ఈ లక్ష్యాన్ని మంచి మాటలతో అయినా లేదా సైనిక చర్యతో అయినా సాధించి తీరతామని ఆదివారం స్పష్టం చేశారు. ఈ పరిణామం గాజా శాంతి చర్చల భవిష్యత్తుపై కొత్త సందేహాలను రేకెత్తిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో తెరపైకి వచ్చిన శాంతి ప్రణాళికలో భాగంగా యుద్ధాన్ని ముగించడం, బందీల విడుదల, గాజా పునర్నిర్మాణం వంటి కొన్ని అంశాలకు హమాస్ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో నెతన్యాహు విడుదల చేసిన ఒక వీడియో సందేశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ ప్రణాళిక ప్రకారం దౌత్యపరంగా లేదా మా సైనిక మార్గంలో హమాస్‌ను నిరాయుధీకరణ చేస్తాం. గాజాను నిస్సైనికీకరణ చేసి తీరతాం. ఇది సులభంగా జరగవచ్చు లేదా కఠినంగానైనా మేం చేసి చూపిస్తామని నెతన్యాహు హెచ్చరించారు. గాజాలో ఇజ్రాయెల్ సైన్యం నియంత్రణలో ఉన్న ప్రాంతాల నుంచి పూర్తిగా వైదొలగే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. మరోవైపు, బందీల విడుదల విషయంలో నెతన్యాహు ఆశాభావం వ్యక్తం చేశారు. మనం ఒక గొప్ప విజయం అంచున ఉన్నాం. రాబోయే కొద్ది రోజుల్లో, సుక్కోత్ పండుగ సమయంలోపే మన బందీలందరూ (మరణించిన వారితో సహా) తిరిగి వస్తారనే శుభవార్తను మీకు అందించగలనని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ అంశంపై సోమవారం ఈజిప్టులో ఇజ్రాయెల్, హమాస్ ప్రతినిధుల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. శాంతి చర్చలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ హెచ్చరికలను సైతం



లెక్కచేయకుండా ఇజ్రాయెల్ జరిపిన తాజా వైమానిక దాడుల్లో ఆరుగురు మరణించినట్లు గాజా అధికారులువెల్లడించారు. ఇదిలా ఉండగా, ప్రాథమికంగా వెనక్కి వెళ్లేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, హమాస్ ధ్రువీకరించిన వెంటనే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

## కేరళ అదృశ్య వ్యక్తికి రూ.25 కోట్ల బంపర్ లాటరీ

**తిరువనంతపురం, అక్టోబరు 5:** కేరళకు చెందిన ఓ వ్యక్తి జాక్ పాట్ కొట్టాడు. కేరళ తిరువోణం బంపర్ లాటరీలో గుర్తుతెలియని వ్యక్తి రూ.25 కోట్లు గెలుచుకున్నాడు. అయితే లాటరీ ఫలితాలు ప్రకటించి ఒక రోజైనా లాటరీ మొదటి బహుమతి విజేత ఎవరో ఇంకా మిస్టరీగానే ఉంది. విజేతకు లాటరీ టికెట్ (టిహెచ్ 577825) ఎర్నాకుళంలోని నెట్టూర్‌కు చెందిన లాటరీ ఏజెంట్ లతీఫ్ విక్రయించారని వెల్లడైంది. అయితే లాటరీ ప్రైజ్‌ను అందుకునేందుకు విజేత ఇంకా ముందుకు రాకపోవడం గమనార్హం. మరోవైపు, లాటరీలో రూ.25 కోట్లు గెలుచుకున్న వ్యక్తి నెట్టూర్ ప్రాంత వాసేనని తెలుస్తోంది. అజ్ఞాత వ్యక్తికి లాటరీ టికెట్‌ను డ్రాకు కేవలం ఒక రోజు ముందు అమ్మానని



లతీఫ్ చెప్పాడు. అయితే దానిని ఎవరు కొన్నారో తనకు కచ్చితంగా తెలియదన్నాడు. తొలుత కొబ్బరి నూనె వ్యాపారి అయిన లతీశ్, ఇప్పుడు లాటరీ ఏజెన్సీని నడుపుతున్నాడు. రూ.25 కోట్ల విజేతకు టికెట్ అమ్మడం ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ సంవత్సరం తిరువోణం బంపర్ (బీఆర్92) టికెట్లను అమ్మడం పట్ల లతీశ్ చాలా సంతోషంగా ఉన్నాడు. లాటరీలో మొదటి బహుమతి టికెట్‌ను లతీఫ్ అమ్మడం గత మూడు నెలల్లో ఇది రెండో సారి. ఈ క్రమంలో తాను సాధించిన ఘనత గురించి లతీశ్ ఆనందం వ్యక్తం చేశాడు. నేను అమ్మిన టికెట్ బహుమతి గెలుచుకున్నందుకు నేను 100 శాతం సంతోషంగా ఉన్నాను. నేను దేవునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలని లతీశ్ అన్నాడు. రూ. 25 కోట్ల బంపర్ బహుమతిని అమ్మే ఏజెంట్‌కు దాదాపు 10 శాతం అంటే రూ. 2.5 కోట్ల కమీషన్ లభిస్తుంది. ట్యాక్స్ రూ. 6.6 కోట్లుపోనూ రూ.15.40 కోట్లు ఉంటుంది. మొత్తం ఆదాయం రూ.15 కోట్లు దాటినందున పన్నుపై 37శాతం సర్ ఛార్జ్ (సుమారు రూ2.5 కోట్లు)ను విధిస్తారు. ఇవన్నీ పోనూ మిగతా డబ్బులు లాటరీ విజేతకు దక్కుతాయి. బంపర్ లాటరీ టికెట్లు రిలీజ్‌మరోవైపు, పూజ బంపర్ లాటరీ టికెట్లను కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ విడుదల చేశారు. తిరువనంతపురంలోని గోర్కీ భవన్‌లో జరిగిన తిరువోణం బంపర్ డ్రా వేడుకకు ముందు ఈ టికెట్లను రిలీజ్ చేశారు. ఈ పూజ బంపర్ లాటరీ డ్రాలో మొదటి బహుమతి విజేతకు రూ.12 కోట్లు అందుతాయి. ఈ బంపర్ లాటరీ టికెట్ ధర రూ.300గా నిర్ణయించారు. 3,32,130 మంది బహుమతులు అందజేయనున్నారు. పూజ బంపర్ లాటరీ డ్రా నవంబర్ 22న మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుంది.

## సంక్షిప్తంగా..

### కరూర్ తొక్కిసలాట పక్కా ప్రణాళికతో చేసిందే: ఖుష్బూ

**చెన్నై, అక్టోబరు 5:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై నటి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖుష్బూసుందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా ప్రణాళికతో, కావాలని చేసినట్లు కన్పిస్తోందని ఆరోపిస్తూ.. తమిళనాడు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తొక్కిసలాట ఘటనలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని ఖుష్బూ పేర్కొన్నారు. ఇది ఎవరో కావాలని సృష్టించినట్లు ఉందన్నారు. విజయ్ ర్యాలీకి ప్రభుత్వం సరైన స్థలం ఇవ్వలేదని విమర్శించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయారని.. మౌనంగా ఉన్న సిఎం స్టాలిన్ దీనిపై మాట్లాడాలన్నారు. ర్యాలీలో పోలీసులు లాఠీచార్జి ఎందుకు చేశారని ఆమె ప్రశ్నించారు. దీనిని సంబంధించిన చాలా విడియోలు బయటకు వచ్చాయన్నారు. కరూర్ విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి టివికెకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు.

### భారత్ నుంచి అంటార్కిటికాకు రవాణా విమానం!



**పనాజీ, అక్టోబరు 5:** భారత్‌నుంచి నేరుగా అంటార్కిటికాకు తొలిసారి రవాణా విమానం వెళ్లింది. దీనిలో భారీ సైన్స్‌పరికరాలను పంపించారు. ఇందుకోసం రష్యా తయారీ ఐఎల్–76 అనే భారీ విమానం వినియోగించారు. దీనిని డ్రోనింగ్ మౌడ్ ల్యాండ్ అండ్ ఎయిర్ నెట్‌వర్క్ నిర్వహిస్తోంది. ఈ విమానంలో మొత్తం 18 టన్నుల దుస్తులు, ఔషధాలు, నిత్యావసరాలను పంపించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ విమానం గోవాలోని మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి వెళ్లింది. ఇది దక్షిణాఫ్రికాకు వెళ్లి.. అక్కడి కేప్‌టౌన్ నగరం మీదుగా తన గమ్యాన్ని చేరుకోనుంది. మన దేశం అంటార్కిటికాలో భారతీ, మిత్ర అనే రెండు రీసెర్చి బేస్‌లను నిర్వహి స్తోంది. 1981 నుంచి భారత్ అంటార్కిటికాలో ప్రయోగాలు చేస్తోంది. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ మార్పులు, అనుమతుల కోసం సుదీర్ఘకాలం ఎదురుచూడాల్సి రావడం, సముద్ర మార్గంలో తరలింపు ఆధారపడదగ్గది కాకపోవడం వంటివి నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చికి ఆందోళనకరంగా మారాయి.

### అలనాటి బాలివుడ్‌నటి సంధ్యాశాంతారామ్ కన్నుమూత



**ముంబయి, అక్టోబరు 5:** ప్రముఖ హిందీ సినీ నటి, దిగ్గజ దర్శకుడు వి. శాంతారామ్ సతీమణి సంధ్యా శాంతారామ్ (94) కన్నుమూశారు. వయోభారంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆమె తన స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారని సమాచారం. ఆమె మరణం పట్ల చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. సంధ్యా శాంతారామ్ సినీ రంగంలో సుదీర్ఘకాలం పాటు తనదైన ముద్ర వేశారు. ఆమె హిందీతో పాటు మరాఠీ సినిమాల్లో కూడా విజయవంతంగా నటించారు. అమర్ భూపాలి, ఝనక్ ఝనక్ పాయల్ బాజే, నవరంగ్, పింజారా వంటి చిత్రాలు ఆమెకు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. ఈ చిత్రాలలో ఆమె పోషించిన పాత్రలు, ముఖ్యంగా ఆమె నృత్య ప్రదర్శనలు ఆమెను కలల నటిగా నిలిపాయి. నృత్యకళలో ఆమె చూపిన ప్రత్యేక ప్రతిభ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. సంధ్యా శాంతారామ్ మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

### ఖలిస్థానీ వేర్పాటువాదసంస్థలకు కెనడానుంచే నిధులు!

**టొరంటో, అక్టోబరు 5 :** ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థలకు తమ దేశం నుంచే నిధులు అందుతున్నాయన్న వాస్తవాన్ని కెనడా ప్రభుత్వం తొలిసారి అధికారికంగా అంగీకరించింది. దేశంలోని మనీలాండరింగ్, ఉగ్రవాద ఫండింగ్‌పై విడుదల చేసిన ఒక కీలక నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా తెలిపింది. సేవా సంస్థల ముసుగులో జరుగుతున్న ఈనిధుల మళ్లింపుపై కెనడా ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. కెనడా ఆర్థిక శాఖ ఇటీవల విడుదల చేసిన అసెస్‌మెంట్ ఆఫ్ మనీలాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ రిస్క్స్ ఇన్ కెనడా 2025నివేదికలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ సిక్ యూత్ ఫెడరేషన్ వంటి ఖలిస్థానీ వేర్పాటువాద గ్రూపులతో పాటు హమాస్, హెజ్‌బొల్లా వంటి సంస్థలు కూడా కెనడాలోని వ్యక్తులు, సంస్థల నుంచి ఆర్థిక సహాయం పొందుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది.

## బాక్సింగ్ ఫెడరేషన్ కప్‌లో సెమీస్‌కు భారత్ మహిళా బాక్సర్లు



**న్యూఢిల్లీ:** బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కప్-2025లో భారత్ మహిళా బాక్సర్లు అద్భుత ప్రతిభ కనపరిచి సెమీస్‌కు చేరుకున్నారు. వీరిలో మంజు రాణి, అంకుషిత, అరుంధతి, ప్రియ, పర్వీన్ ఉన్నారు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత మంజు రాణి (రైల్వేస్) 5:0 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. అలాగే ప్రపంచ యూత్ ఛాంపియన్ అంకుషిత బోరో (అస్సాం), మాజీ యూత్ వరల్డ్ ఛాంపియన్ అరుంధతి చౌదరి (సర్వీసెస్), అండర్22 రజత పతక విజేత ప్రియా (హర్యానా), ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత పర్వీన్ హుడా (ఎస్ఎఐ) కూడా ఆధిపత్య విజయాలతో సెమీఫైనల్‌ను నిర్ధారించారు. ఇక పురుషుల విభాగంలో, ప్రపంచ కప్ బ్రెజిల్ కాంస్య పతక విజేత మనీష్ రాథోడ్ (ఎఐపి), అండర్ 22 ఆసియా కాంస్య పతక విజేత రాకీ (ఎఐపి), ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత అమిత్ పంఘల్ (సర్వీసెస్) తమ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మహ్మద్ హుసాముద్దీన్ (సర్వీసెస్) తన ఖ్యాతిని నిలబెట్టుకున్నాడు. బిఎఫ్ఐ కప్ ఎలైట్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో తన ప్రారంభ బౌట్‌లో సర్వీసెస్‌కు చెందిన హర్ష్‌పై 5:0 తేడాతో ఆధిపత్యం చెలాయించాడు.

## అమెరికా చేతిలో భారత్ చిత్తు

### గుకేష్, అర్జున్, దివ్య, సాగర్ టీం ఓటమి



**న్యూఢిల్లీ:** చెక్‌మేట్ టోర్నమెంట్‌లో అమెరికా చెస్ జట్టు చేతిలో భారత్ చెస్ జట్టు ఓటమి చెందింది. యుఎస్ఎ వర్సెస్ ఇండియా అనే విలక్షణమైన మ్యాచ్‌లో భారత చెస్ జట్టు 0-5 తేడాతో బలమైన యుఎస్ఎ జట్టుచేతిలో చిత్తయింది. డల్లాస్, టెక్సాస్‌లోని ఆర్లింగ్టన్, ఈ స్పోర్ట్స్ స్టేడియంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఈ ఈవెంట్ లో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్, ఎరిగైసి అర్జున్, ఇటీవల మహిళల ప్రపంచ కప్ ఛాంపియన్ దివ్య దేశ్‌ముఖ్, హికారు నకమురా, షాబియాన్ కరువానా వంటి అగ్ర ఆటగాళ్లతో కూడిన భారత్, అమెరికా దేశాల టాప్ చెస్ స్టార్లు తలపడ్డారు. ఫాబియానో కరువానాతో తలపడిన అర్జున్ భారత్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ పావులు కదపడంలో వెనుకబడిపోయాడు. ఆ తర్వాత వాజ్ అడెవుమి చేతిలో ఓడిపోయాడు. ఇటీవల పట్టాభిషేకం చేసిన యిప్‌తో జరిగిన మ్యాచ్‌లో దివ్య ఒత్తిడిలో తడబడింది. ఫలితంగా ఈ మ్యాచ్‌లో యిప్ 3-0 ఆధిక్యాన్ని యుఎస్ఎకి అందించాడు. ఆ తర్వాత రోజ్‌మన్‌తో జరిగిన పది నిమిషాల ఆటను షా డ్రాగా ముగించాడు. ఇక గుకేష్ వరుసగా పది, ఐదు నిమిషాల మ్యాచ్‌లలో నకమురాతో డ్రా చేసుకున్నాడు. దీంతో భారత్ 0-5 తేడాతో ఓడిపోయింది.

ఆట



### ఫెనెస్టా ఓపెన్‌లో ఛాంపియన్స్‌గా

# మనీష్, వైష్ణవి

**న్యూఢిల్లీ:** ఫెనెస్టా ఓపెన్ నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2025, పురుషుల, మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ ప్లేయర్లు మనీష్ సురేష్ కుమార్, వైష్ణవి అడ్కర్ ఛాంపియన్లుగా నిలిచారు. న్యూఢిల్లీలో జరిగిన తమిళనాడుకు చెందిన మనీష్, మహారాష్ట్రకు చెందిన వైష్ణవి వరుసగా పురుషుల మరియు మహిళల సింగిల్స్ టైటిళ్లను కైవసం చేసుకుని తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో, మనీష్ 6-4, 6-2 తేడాతో కీర్తివాసన్ సురేష్‌ను ఓడించి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. మొదటి సెట్‌ను హోరాహోరీగా ఎదుర్కొన్న తర్వాత, మనీష్ తన జోరును కొనసాగించి రెండవ సెట్‌ను ముగించి కిరీటాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో వైష్ణవి అడ్కర్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించి, ఆకాంక్ష నిట్టూర్‌ను 6-1, 6-2 తేడాతో ఓడించింది. వైష్ణవి దూకుడుగా ప్రారంభించి ప్రారంభంలోనే బ్రేక్ చేసి, తన ఖచ్చితమైన షాట్ మేకింగ్ మరియు దృఢమైన సర్వ్‌ను ఉపయోగించి వరుస సెట్లలో టైటిల్‌ను కైవసం చేసుకుంది. కాగా అండర్18 విభాగంలో, హర్షిణి ఎన్ 6-1, 2-6, 6-4 తేడాతో స్నిగ్ధ కాంతపై మూడు గంటల పాటు ఉత్కంఠభరితంగా జరిగిన పోరులో పోరాడి బాలికల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. ఇక హృతిక్ కటకం గాయం కారణంగా రిటైర్ కావడంతో తవిష్ పహ్వా బాలుర సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది, స్కోరు 7-6(2), 1-0తో తవిష్‌కు అనుకూలంగా ఉంది. పురుషుల డబుల్స్ ఫైనల్‌లో నితిన్ కుమార్ సిన్హా-మాన్ కేశర్వాణి, మనీష్ సురేష్‌కుమార్-అభినవ్ సంజీవ్ ఎస్‌లను 6-4, 3 -6 (10-5) తేడాతో ఓడించి విజయం సాధించారు. మహిళల డబుల్స్‌లో ఆకాంక్ష నిట్టురే-సోహా సాదిక్ జట్టు, జత పూజా ఇంగలే-యుబ్రాని బెనర్జీలను 6-2, 6-2 తేడాతో ఓడించింది.

# ముగ్గురు ఔట్

### ఛాంపియన్స్ ట్రోఫీ విజేతలకు షాక్

## జడేజా, షమీ, వరుణ్‌లకు ప్లేస్ నిల్

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ విజయానికి కారణమైన టీమిండియాకు నాయకత్వం వహించిన రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తొలగించారు. ఇదే సమయంలో ఈ ట్రోఫీ విజయానికి కీలకమైన మరో ముగ్గురు ఆటగాళ్లను జట్టు నుంచి తొలగించారు. వారిలో రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నారు. ఈ



నెల 19 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా పర్యటనలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు టీమిండియా సభ్యులను భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) పురుషుల సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఏడు నెలల క్రితం ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును విజయపథంలో నడిపించిన కెప్టెన్ రోహిత్ స్థానంలో శుభ్‌మాన్ గిల్‌ను కెప్టెన్‌గా నియమించడం వివాదాస్పదమైంది. అయితే ఆస్ట్రేలియా టెస్ట్‌లో ప్లేయర్‌గా రోహిత్‌కు అవకాశం కల్పించారు. దీంతో రోహిత్ భవిష్యత్తు ఇప్పటికే ప్రశ్నార్థకంగా ఉంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీని ఎంపిక చేయలేదు. ఛాంపియన్స్ ట్రోఫీలో, షమీ సెమీఫైనల్‌లో 3 వికెట్లు పడగొట్టి, జట్టు ఫైనల్‌కు చేరుకోవడానికి సహాయం చేశాడు. అతను టోర్నమెంట్‌లో భారత జట్టు తరఫున అత్యంత విజయవంతమైన బౌలర్. తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. కానీ, ఇప్పుడు అతనికి జట్టులో చోటు లేదు. షమీ మాత్రమే కాదు, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ కూడా తొమ్మిది వికెట్లు పడగొట్టి, ఛాంపియన్స్ ట్రోఫీలో షమీ వికెట్‌ను సమం చేశాడు. భారత జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. సెమీఫైనల్, ఫైనల్‌లో వరుణ్ ఆర్థికంగా బౌలింగ్ చేశాడు. చెరో 2 వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శన ఉన్నప్పటికీ, ఆస్ట్రేలియా పర్యటనకు అతనిని తప్పించడం ఆశ్చర్యకరం. మరో ముఖ్యమైన నిర్ణయం రవీంద్ర జడేజాను తప్పించడం. జడేజా టీం ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో భాగం. కానీ ఆ టోర్నమెంట్ అతనికి అంతగా ఆకట్టుకోలేదు. కేవలం 5 వికెట్లు మాత్రమే తీసుకుని 50 పరుగులు మాత్రమే చేశాడు. అయినప్పటికీ, ఇటీవల ఇంగ్లాండ్‌తోను, ఇప్పుడు వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్‌లలో తన బ్యాటింగ్‌తో తనను తాను నిరూపించుకున్నాడు. అయితే, ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేయకుండా పక్కనపెట్టారు.



## ఇరానీ కప్ విజేత విదర్భ

### రెస్ట్ ఆఫ్ ఇండియాకు షాక్

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ ఛాంపియన్ విదర్భ తమ జోరును చూపిస్తూ ఇరానీ కప్ నూ దక్కించుకుంది. బ్యాటర్లతో పాటు స్పిన్నర్ దూబె చెలరేగడంతో రెస్ట్ ఆఫ్ ఇండియాకు షాకిస్తూ మూడోసారి ట్రోఫీని అందుకుంది. 2018, 2019లో ఇరానీ కప్ విజేత అయిన విదర్భ ఈసారి కూడా ఛాంపియన్‌గా నిలిచింది. దూబే నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిని కూల్చడంతో 93 పరుగుల తేడాతో గెలుపొందింది. శతకంతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన అథర్వ తైడే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. విదర్భ నిర్దేశించిన 361 పరుగుల ఛేదనలో రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. 35/2తో ఐదో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు ఐదో ఓవర్లోనే కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ కోల్పోయింది. రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్‌లు సైతం త్వరగా వెనుదిరగడంతో 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది రెస్ట్ ఆఫ్ ఇండియా. అనంతరం యశ్ ధుల్(92), సరాన్ష్ జైన్(29)లు ఆరో వికెట్‌కు 53 పరుగులు జోడించింది ఆదుకున్నారు. కానీ, జైన్ ఎల్బీగా ఔట్ కావడంతో 156/6తో లంచ్‌కు వెళ్లింది రెస్ట్ ఆఫ్ ఆండియా. ఆ తర్వాత మానవ్ సుతార్ (56), ధుల్ ద్వయం 103 పరుగుల భాగస్వామ్యలో విదర్భను భయపెట్టారు. కానీ సెంచరీకి చేరువైన ధుల్‌ను, అన్షుల్ కంబోజ్‌ను యశ్ ఠాకూర్ ఔట్ చేయడంతో ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి. టీ బ్రేక్ లోపే రెస్ట్ ఆఫ్ ఇండియాను 267కు ఆలౌట్ చేసిన విదర్భ హ్యాట్రిక్ ట్రోఫీతో చరిత్ర సృష్టించింది. నాగ్‌పూర్‌లోని వీసీఏ స్టేడియంలో విదర్భ బౌలర్ల ధాటికి రెస్ట్ ఆఫ్ ఇండియా కుప్పకూలింది. తొలి వికెట్‌కు 52 పరుగుల శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. కెప్టెన్ రజత్ పాటిదార్(66), అభిమన్యు ఈశ్వరన్(52)లు రాణించగా, యశ్ ఠాకూర్ విజృంభణతో ఆ జట్టు214కే ఆలౌట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో అథర్వ తైడే(143) మారథాన్ ఆటతో ఆదుకోగా, యశ్ రాథోడ్(91) మెరవగా విదర్భ 312 రన్స్ చేసింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో ఆకాశ్ దీప్ (351), సరన్ష్ జైన్(294)లు రాణించారు.

## నిర్ణయాత్మక మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 316 భారీ స్కోర్



### 172 / 3తో క్రీజులో భారత్

### కెప్టెన్ శ్రేయస్, రియాన్

**న్యూఢిల్లీ:** భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా నిర్ణయాత్మక మూడో వన్డేలో ఆసీస్ భారీ స్కోర్ చేసింది. ఆదివారం టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.1 ఓవర్లలో 316 పరుగుల స్కోర్ చేసింది. కూపర్ కన్నోలీ 64, లియామ్ స్కాట్ 73, కెప్టెన్ జాక్ ఎడ్వర్డ్స్ 89తో అర్ధ సెంచరీలు చేసి సత్తా చాటి ఆసిస్ భారీ స్కోర్ చేసేందకు దోహదపడ్డారు. 44 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో కన్నోలీ, లిచ్లన్ షా (32) సాయంతో ఆసీస్ ఇన్నింగ్స్‌కు జీవం పోశాడు. ఆ తర్వాత లియామ్ స్కాట్, ఎడ్వర్డ్స్ సంచలన ఇన్నింగ్స్‌లతో భారీ స్కోకర్ అందించారు. భారత్ బౌలర్లలో అర్షదీప్ షింగ్, హర్షిత్ రాణా చెరో 3 వికెట్లు తీయగా, పార్ట్ టైమ్ బౌలర్ ఆయుష్ బదోని 2, గుర్జప్నీత్ షింగ్, నిషాంత్ సంధు తలో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం 317 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ శతకంతో విరుచుకుపడటంతో 24 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ తన శైలికి విరుద్ధంగా నిదానంగా ఆడి 25 బంతుల్లో 22 పరుగులు చేసి ఔటయ్యాడు. తిలక్‌వర్మ 3 పరుగులతో నిరాశపరిచాడు. కెప్టెన్ శ్రేయష్ అయ్యర్ (17), రియాన్ పరాగ్ (22) క్రీజ్‌లో ఉన్నారు. భారత్ గెలవాలంటే 26ఓవర్లలో మరో145 పరుగులు చేయాల్సి ఉంది. చేతిలో ఇంకా 7 వికెట్లు ఉన్నాయి.

## వాణిజ్యం

## చిన్న బ్యాంకుల్లోనూ సీనియర్ సిటిజన్స్‌కు అధిక వడ్డీ!



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** అధిక వడ్డీ కోరుకునే వారికి పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు ఇపుడు అధిక వడ్డీలు ఆఫర్ చేస్తున్నాయి. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 3 సంవత్సరాల మెచ్యూరిటీ టెన్యూర్ గల్ డిపాజిట్లకు గరిష్టంగా 8.15 శాతం మేర వడ్డీ ఆఫర్ చేస్తోంది. సీనియర్ సిటిజన్ రూ.5 లక్షలు జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత చేతికి అసలు, వడ్డీ కలిపి రూ. 6,21,830 వరకు వస్తాయి. స్లైస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 18 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు టెన్యూర్ డిపాజిట్లపై గరిష్ఠంగా 7.75 శాతం మేర వడ్డీ అందిస్తోంది. ఇందులో సీనియర్ సిటిజన్ రూ.5 లక్షలు జమ చేస్తే 3 ఏళ్ల నాటికి చేతికి అసలు వడ్డీ కలిపి రూ. 6,15,850 వరకు వస్తుంది. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రస్తుతం 2 ఏళ్ల నుంచి 3 సంవత్సరాల వరకు మెచ్యూరిటీ ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఏకంగా 8 శాతం వడ్డీ ఇస్తోంది. శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రస్తుతం 3 ఏళ్ల టర్మ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు గరిష్ఠంగా 7.50 శాతం మేర వడ్డీ అందిస్తోంది. ఇందులో రూ.5 లక్షలు జమ చేసినట్లయితే మెచ్యూరిటీ తర్వాత చేతికి మొత్తం రూ. 6,12,000 పైన అందుతాయి. చాలా మంది స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెనకడుగు వేస్తారు. అయితే, వీటిల్లోనూ డిపాజిట్ ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారెంటీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత బీమా కవరేజీ ఉంటుంది.

### నెలలో రూ.23,885 కోట్ల

## ఎఫ్‌పిఐల విత్‌డ్రా!



**ముంబయి, అక్టోబరు 5:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు మార్కెట్లనుంచి సెప్టెంబరు నెలలో రూ.23,885 కోట్ల రూపాయలు విత్‌డ్రాచేసుకునానరు. దీనితోఈ ఏడాది ఇప్పటివరకూ మార్కెట్లనుంచి విదేశీ ఇన్వెస్టర్లు రూ.1.58 లక్షలకోట్లుగా ఉన్నాయని డిపాజిటరీ డేటా వివరాలతో స్పష్టం అవుతోంది. వరుసగామూడోనెలలో కూడా విదేశీ ఇన్వెస్టర్లు విత్‌డ్రాకే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఆగస్టులో 34,990 కోట్లు, జులైలో 17,700 కోట్లు కూడా విత్ అయ్యాయి. మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చి సంస్థ ప్రిన్సిపల్ మేనేజర్ హిమాంశు శ్రీవాస్తవా మాట్లాడుతూ ఈ అమ్మకాలు అనేక అంశాలతోముడిపడి ఉన్నాయని, అమెరికా వాణిజ్య ఒప్పందం, భారత పాలసీ మార్పులు వంటివి కూడా తోడవుతున్నాయన్నారు. అలాగే భారత దిగుమతులపై అమెరికా 50శాతం సుంకాలు, హెచ్‌వన్‌బి వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంపు వంటివి ఎగుమతి ఆధారిత రంగాల సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని చెప్పారు. వీటితోపాటు భారత్‌రూపాయి గణనీయంగా పతనం అయింది. డాలరుతో రూపాయి మారకం విలువలు రికార్డుస్థాయికి క్షీణించాయి. జిఎస్టీ హేతుబద్దీకరణతో కొంతమేర మార్కెట్లకు ఊతం ఉంటుందని కొందరు ట్రేడర్లు చెపుతున్నారు. ఇప్పటికీ కూడా భారత్ ప్రపంచంలోనే శరవేగంగా అభివృద్ధిచెందుతునన దేశంగా పరిగణించవచ్చని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. భారత్ డెట్ మార్కెట్లలో ఎఫ్‌పిఐలు 1085 కోట్లు పెట్టుబడులు పెట్టారు. డెట్ మార్కెట్లలో ఎఫ్‌పిఐల పరిమితి 1213 కోట్లవరకూ ఉంది. ఆపరిమితికి లోబడే విదేశీ పెట్టుబడులు వచ్చినట్లు విశ్లేషకుల అంచనా.

## ఈక్విటీలపై కార్పొరేట్

# త్రైమాసిక ఫలితాలు



### ఈ వారంలో సెన్సెక్స్, నిఫ్టీల ట్రేడింగ్‌లో కీలక పరిణామాలు

**ముంబయి, అక్టోబరు 5:** భారత్ ఈక్విటీ మార్కెటకు ఈ వారంలో అంతర్జాతీయ పరిణామాలు స్థూల ఆర్థిక గణాంకాలతోపాటు ఐటి దిగ్గజాలు టిసిఎస్ వంటి వాటి కార్పొరేట్ ఫలితాల ప్రభావం అధికంగా ఉంటుంది. విదేశీ ఫండ్స్ రాకపైనా ట్రేడర్లు దృష్టిసారిస్తారు. సెప్టెంబరులో ఎఫ్‌పిఐలు ఎక్కువ విత్‌డ్రా కావడంతో ట్రేడర్లు అప్రమత్తం అయ్యారు. ఈ వారం రెండోత్రైమాసికం ఫలితాల సీజన్‌గా ఉంటుంది. టిసిఎస్ ఈనెల 9న ఫలితాలు వెల్లడిస్తుంది. హెచ్ఎస్‌బిసి సర్వీస్, కాంపోజిట్ పిఎంఐ గణాంకాలు కూడా అదేరోజువ ఇడుదలవుతాయి. అలాగే ఇప్పటివరకూ బ్యాంకింగ్‌రంగంలోని రుణాలు, డిపాజిట్ల వృద్ధికూడా ప్రభావితంచేస్తాయంన్నది అంచనా. ఇక ఈ వారంలోనే భారీ ఐపిఒలు వస్తున్నాయి. టాటాక్యాపిటల్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వంటి మెగా ఐపిఒలు వస్తున్నాయి. అలాగే ఫెడ్‌రిజర్వు మినిట్స్, నిరుద్యోగ గణాంకాలు, వినియోగరంగ సెంటిమెంట్‌లు కూడా ఈ వారం మార్కెట్లకు కీలకం అవుతాయని విశ్లేషకుల అంచనా. డాలరుతో రూపాయి మారకం విలువలు, పదేళ్ల బాండ్ల రాబడులు, బంగారం వెండి ఆభరణాల ధరవరలు కూడా ఈక్విటీసూచీల్లో ఆరంగ కంపెనీలపై ప్రభావంచూపిస్తాయి. అలాగే ఐటి దిగ్గజాల్లో కొనసాగుతున్న లేఆఫ్‌లు, విదేశీ ఉద్యోగులకు అమెరికా టెక్ కంపెనీల ఉద్వాసన వంటివి టెక్కీరంగం షేర్లపై ప్రభావం ఉంటుంది. గతవారంలో బిఎస్ఇ సెన్సెక్స్ 780.71 పాయింట్లుపెరిగితే నిఫ్టీ 239.55 పాయింట్లవరకూ పెరిగింది. శెలవులకారణంగా గతవారం కొద్దిరోజులే ట్రేడింగ్‌జరిగినా ఈ వారం రెండోత్రైమాసిక ఫలితాలు మార్కెట్లకు కీలకం కానున్నాయి.

## క్యాష్ ఆన్ డెలివరీలపై

# అదనపు ఛార్జీలు



### దోపడీని ఉపేక్షించమని కేంద్రం సీరియస్

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ఆన్‌లైన్ కొనుగోళ్లలో వినియోగదారుల్ని ఆకర్షించే ముఖ్య సదుపాయాల్లో క్యాష్ ఆన్ డెలివరీ కూడా ఒకటి. అయితే ఇక్కడ ప్రముఖ ఇ కామర్స్ సంస్థలు ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నాయన్న ఫిర్యాదులపై కేంద్రం దృష్టిసారించింది. ఎట్టిపరిస్థితుల్లోనుపేక్షించేదిలేదని, కఠిన చర్యలు తప్పవని కేంద్ర వినియోగ వ్యవహారాలశాఖ హెచ్చరించింది. ఈకామర్స్ సంస్థలు సైలెంట్‌గా ఎక్కువ వసూలు చేస్తున్నాయన్న సంగతి అందరికీ తెలియకపోయినా ఇలా అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్న ఇ కామర్స్ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఇది కస్టమర్లను దోపిడీకి గురి చేయడమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై దర్యాప్తునకు ఆదేశించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఇటీవల పలు ఇ కామర్స్ సంస్థలు సీవోడీ (క్యాష్ ఆన్ డెలివరీ) ఆప్షన్ ఎంచుకున్నందుకు ప్రత్యేకంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లుగా వినియోగదారుల వ్యవహారాల విభాగానికి కంప్లైంట్స్ వచ్చాయి. ఇ కామర్స్ సంస్థలు ఆఫర్ హ్యాండ్లింగ్ ఫీజు, పేమెంట్ హ్యాండ్లింగ్ ఫీజు, ప్రొటెక్ట్ ప్రామిస్ ఫీజు అని కొత్త కొత్త ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. ఈ పోస్టుపై కేంద్ర మంత్రి వెంటనే స్పందించారు. ఇలా అదనపు ఛార్జీలు వసూలు చేయడం అనేది వినియోగదారుల్ని తప్పుదోవ పట్టించి దోపిడీ చేసే చీకటి విధానమే అని అన్నారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఇ కామర్స్ సెక్టార్‌లో పారదర్శకత, న్యాయమైన విధానాలు కొనసాగించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది కేంద్రం. ఆన్‌లైన్ షాపింగ్ అనేది.. వినియోగదారులకు మరింత విశ్వసనీయంగా ఉండేలా ఇ కామర్స్ సంస్థల మోసపూరిత విధానాల్ని నియంత్రించేందుకు కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొంది.

## బిట్‌కాయిన్

# రికార్డు ధర!



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ ఈ రోజు మరోసారి సరికొత్త రికార్డుస్థాయికి చేరింది. ఆదివారం ఆసియా మార్కెట్లలో బిట్‌కాయిన్ ధర 125,689 డాలర్లకు చేరుకుంది. ఇది ఆగస్టు 14న సృష్టించిన మునుపటి గరిష్టం 124,514డాలర్లను అధిగమించింది. ఈ ఏడాది ఇప్పటివరకు బిట్‌కాయిన్ ధర 30శాతం కంటే ఎక్కువ పెరిగింది. బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్స్‌లో కొత్త పెట్టుబడులు ఈ ర్యాలీకి ఊతం ఇచ్చాయని నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో బుధవారం నుంచి ప్రభుత్వ షట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్ నిపుణులు దీనిని డీబేస్‌మెంట్ ట్రేడ్ అని పిలుస్తున్నారు. ఇక్కడ డాలర్ విలువ తగ్గుతుందనే భావనతో బిట్‌కాయిన్ వంటి ఆస్తులకు డిమాండ్ పెరుగుతోంది. స్టాక్స్, బంగారం, ఇతర సేకరణ వస్తువులు కూడా గరిష్ట స్థాయిలకు చేరుతున్నాయి. డాలర్ విలువ తగ్గుతుందన్న నేపథ్యంలో బిట్‌కాయిన్ లాభపడుతోందని క్రిప్టో ప్రైమ్ బ్రోకరేజ్ సంస్థ ఫాల్కన్‌ఎక్స్ మార్కెట్స్ కో హెడ్ జోషువా లిమ్ అన్నారు. అక్టోబర్ బిట్‌కాయిన్‌కు శుభవార్త తెచ్చే నెల అని చెప్పవచ్చు. ఎందుకంటే గత 10 సంవత్సరాల్లో 9 సార్లు ఈ నెలలోనే బిట్‌కాయిన్ ధర పెరిగింది. ఈ కారణంగా ఈ నెలను ఉప్టోబర్ అని పిలుస్తారు. ఇప్పుడు కూడా ఈ ట్రెండ్ కొనసాగుతోంది. అమెరికా స్టాక్ మార్కెట్ శుక్రవారం రికార్డు స్థాయిలకు చేరడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెద్ద ఒప్పందాలు, బిట్‌కాయిన్‌పై పెరుగుతున్న నమ్మకం ఈ ర్యాలీకి ఊతమిచ్చాయి. అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హయాంలో క్రిప్టో కరెన్సీలకు అనుకూలమైన చట్టాలు అమలులోకి వచ్చాయి. ఈ వాతావరణం బిట్‌కాయిన్ ధర పెరుగుదలకు దోహదపడింది. మైఖేల్ సేలర్ నేతృత్వంలోని స్ట్రాటజీ పబ్లిక్ కంపెనీలు బిట్‌కాయిన్‌ను పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా చేశాయి. ఈ వ్యూహం ఇతర చిన్న క్రిప్టోలైన ఈథర్ వంటి ఆస్తులకు కూడా విస్తరించింది.

## జూలియన్ ఆగ్రో బంపర్ ఆఫర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** లార్జ్ క్యాప్ కేటగిరిలోని కన్‌స్ట్రక్షన్ సెక్టార్ సంస్థ జూలియన్ ఆగ్రో ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. తమ షేర్ హోల్డర్లకు ఉచితంగా షేర్లు ఇస్తామని తెలిపింది. కంపెనీ బోర్డు డైరెక్టర్స్ 1:1 రేషియోలో బోనస్ షేర్లు ఇచ్చేందుకు అంగీకరించారు. 100 షేర్లు కొన్న వారికి మరో 100 షేర్లు ఉచితంగా లభిస్తాయి. ఇక ఈ బోనస్ షేర్ల రికార్డు డేట్ ఈనెల 6గా నిర్ణయించారు. ఈ కంపెనీ షేర్లు అక్టోబర్ 6న ఎక్స్‌బోనస్ ట్రేడ్ చేయనున్నాయి. జూలియన్ ఆగ్రో ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ కంపెనీ స్టాక్ రూ. 10 లోపు ధర ఉన్న ఒక పెన్నీ స్టాక్. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం ఇటీవలే కంపెనీ బోర్డు డైరెక్టర్స్ భేటీ అయ్యి 1:1 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేయడానికి ఆమోదం తెలిపారు. అంటే రికార్డు తేదీ నాటికి రూ. 5 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరును తమ డీమ్యాట్ ఖాతాలో కలిగి ఉన్న వారికి అదనంగా రూ. 5 ఫేస్ వ్యాల్యూ ఉండే 1 ఈక్విటీ షేరుని బోనస్ రూపంలో ఇస్తాని తెలిపింది. ఇక ఈ బోనస్ షేర్లు ఇచ్చేందుకు రికార్డు డేట్ ఈనెల 6గా బోర్డు డైరెక్టర్స్ నిర్ణయించారు. ఆ తేదీలోపు షేర్లు కొన్నవారికి ఉచిత షేర్లు పొందేందుకు అర్హత లభిస్తుంది. మరోవైపు కంపెనీకి బోర్డు డైరెక్టర్స్ మరోసారి ఈనెల 21వ తేదీ సమావేశం కానుంది. 2026 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ నెలతో ముగిసే రెండవ త్రైమాసికానికి ఆడిట్ చేయని కంపెనీ ఆర్థిక ఫలితాలను ఆమోదించనున్నారు. రెండో మధ్యంతర డివిడెండ్ సైతం ఆమోదం తెలుపనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గత వారంలో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో జూలియన్ ఆగ్రో ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ స్టాక్ ధర 2.48 శాతం నష్టంతో రూ. 6.86 వద్ద స్థిరపడింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 17.22, కనిష్ఠ ధర రూ. 6.55 వద్ద ఉన్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 41 కోట్ల వద్ద ఉంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.